ప్రపంచానికి ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

ఛాంపియన్‌లీగ్ వేడుకల్లో హింస
లెబనాన్‌లో చరిత్రాత్మక బ్యూఫోర్ట్ కోట ఇజ్రాయెల్ స్వాధీనం 08

సంపుటి 09, సంచిక: 181 | సోమవారం | 01-06-2026 | ఖమ్మం   Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**   పేజీలు: 12+8 | వెల రూ. 5.00

### మోదీ సర్కార్‌ను ప్రశ్నిస్తే
## సమాధానాలకు బదులు అవమానాలు

- ప్రశ్నలను సంధించిన విద్యార్థులు ధైర్యవంతులైన యువ భారతీయులు
- వారు ఉజ్వల భవిష్యత్తుకు అర్హులు
- తోటి దేశద్రోహ సోరోస్ ఏజెంట్లతో అసలు విషయాలు బయటపెట్టే సంభాషణ జరిపా : రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ :** ఇటీవలి కాలంగా సిబిఎస్ఇ ఒఎస్ఎం వివాదంపై కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విరుచుకుపడుతున్నారు. కొంతమంది విద్యార్థులతో తాను జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియోను పంచుకుంటూ మోదీ ప్రభుత్వాన్ని సాధారణ ప్రశ్నలు అడిగిన ఆ విద్యార్థులు సమాధానాలకు బదులుగా అవమానాలను ఎదుర్కొన్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ధైర్యవంతులైన యువ భారతీయులుగా రాహుల్ అభివర్ణించారు. ఆ విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు అర్హులని నొక్కిచెబుతూ తరువాయి 12లో



### బెంగాల్‌లో ఎన్నికల అనంతరం దాడి...
## ఖండించిన సిపిఐ

ఎన్నికైన ప్రతినిధులపై భౌతిక దాడులు, విధ్వంసానికి ప్రజాస్వామ్యంలో చోటు లేదు: డి. రాజా



**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల అనంతరం కొనసాగుతున్న హింసాత్మక ఘటనలను సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా ఖండించారు. ఎన్నికైన ప్రతినిధులపై దాడులకు, విధ్వంసానికి, ప్రజాస్వామ్యంలో చోటు లేదని ఆదివారం ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని సోనార్‌పూర్ ప్రాంతంలో ఎన్నికల అనంతర హింసతో ప్రభావితమైన కుటుంబాలను పరామర్శించడానికి వెళ్లిన తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీపై దాడి జరగడంపై రాజా స్పందించారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల అనంతరం కొనసాగుతున్న హింసాత్మక ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, వీటిని నిస్సందేహంగా ఖండించాలని పిలుపునిచ్చారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులపై శారీరక దాడులకు, విధ్వంసక చర్యలకు ప్రజాస్వామ్యంలో చోటు లేదని, తరువాయి 12లో



## అతిపెద్ద గృహ విప్లవం!

- ఇందిరమ్మ ఇళ్లతో దేశానికి తెలంగాణ మార్గదర్శకం
- 13 నెలల్లో లక్ష ఇళ్లు పూర్తి - మరో రెండు నెలల్లో మరో 2 లక్షలు
- రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఏడు దశాబ్దాల స్వతంత్ర భారత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పేదల సొంతింటి కలలను నెరవేర్చడానికి ఉచితంగా ఐదు లక్షల రూపాయలతో భారీ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని అమలు చేస్తూ తెలంగాణ రాష్ట్రం దేశానికే మార్గదర్శకంగా నిలుస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో అమలు అవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇప్పుడు కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాకుండా పేద కుటుంబాల జీవితాలను మార్చేస్తున్న సామాజిక ఉద్యమంగా మారిందని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పథకం ప్రగతిని వివరించారు.

**జూన్ 1న రెండో విడతకు శ్రీకారం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సలహాలు సూచనల మేరకు భారీ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టి తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా తరువాయి 12లో

### నేడు ఇందిరమ్మ ఇళ్లు రెండో విడతకు శ్రీకారం

- కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సిఎం పర్యటన
- కొత్తగూడలో సామూహిక గృహప్రవేశాలలో పాల్గొననున్న రేవంత్ రెడ్డి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. కొత్తగూడలో తొలి విడత కింద నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామూహిక గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద నిర్వహించే బహిరంగ సభలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం తరువాయి 8లో

### పదేళ్లలో విద్య విధ్వంసం నుంచి
## విద్యా వికాస్ పునర్ నిర్మాణం

- సమాజాన్ని జాగృతం చేసేది విద్యే
- పనితీరు మెరుగుపడిందని పిజిఐ పేర్కొనడం ప్రభుత్వ కృషికి నిదర్శనం : సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

అభివృద్ధికి తొలి కొలబద్ద విద్య అని, విద్య ఒక్కటే పేదరికాన్ని నిర్మూలించి, సమాజాన్ని జాగృతం చేస్తుందని తాను బలంగా విశ్వసించానని,అందుకే ఆ దిశగా రెండేళ్లుగా ప్రజా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. పాఠశాల విద్యలో తెలంగాణ రాష్ట్ర పనితీరు గణనీయంగా మెరుగుపడిందని తాజాగా కేంద్ర విద్యా శాఖ పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పిజిఐ) పేర్కొనడం తమ ప్రభుత్వ రెండేళ్ల కృషికి నిదర్శనమన్నారు. ఈమేరకు తరువాయి 8లో







### ఏటుకూరి జీవితం
## సాహితీ రంగానికే అంకితం

**డాక్టర్ ప్రసాద్ సాహిత్య రంగానికి ఎన్‌సైక్లోపీడియా, మార్క్సిస్ట్ సాహితీ రంగానికి మార్గదర్శి సంస్మరణ సభలో కొనియాడిన వక్తలు**

ప్రజాపక్షం/హైదరాబాద్

సాహిత్యమే ఊపిరిగా ఈ రంగానికి నిస్వార్థ సేవలను అందించిన గొప్ప సాహితీవేత్త, అభ్యుదయ రచయిత డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ అని పలువురు రచయితలు, కవులు, కళాకారులు కొనియాడారు. 'డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ సాహిత్యరంగానికి ఎన్‌సైక్లోపీడియా. మార్క్సిస్టు సాహితీ రంగానికి మార్గదర్శి' వారు అన్నారు. డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ మరణం అభ్యుదయ, ప్రగతిశీల సాహిత్యరంగానికి తీరని లోటు అని పేర్కొన్నారు. నవచేతన పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు, అభ్యుదయ రచయిత సంఘం నాయకులు 'డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ సంస్మరణ సభ ఆదివారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని రాజ్ బహదూర్ గౌర్ హాల్‌లో జరిగింది. నవ చేతన పబ్లిషింగ్ హౌస్, తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం, తెలంగాణ ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అరసం గౌరవ అధ్యక్షులు ఆర్.వి.రామారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు కవులు, రచయితలు, కళాకారులు, సిపిఐ సీనియర్ నేతలు, అభిమానులు ఏటుకూరి ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఏటుకూరి ప్రసాద్ భౌతికంగా మన మధ్య లేకపోయినా కమ్యూనిస్టు భావజాలం ఉన్నంత కాలం ఆయన ఉంటారన్నారు. కమ్యూనిస్టు భావాలు కలిగిన అనేక మంది వ్యక్తులు కేవలం సమాజం అభ్యున్నతి కోసం మాత్రమే జీవిస్తూ వారు వేసిన తరువాయి 8లో

### ఇక ఉక్కపోతకు
## ఉపశమనం..

**రాష్ట్రంలో రాబోయే వారం రోజులు వర్షాలు !**



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రాన్ని గత కొన్ని రోజులుగా ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఎండలు, వడగాల్పుల నుంచి తెలంగాణ ప్రజలకు ఊరట లభించే సూచనలు కనిపిస్తున్నాయి. జూన్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. వర్షాల ప్రభావంతో రాబోయే ఐదు రోజులలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశముందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో 41 నుంచి 45 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయితే జూన్ తొలి వారం నుంచి ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పట్టనున్నాయని అంచనా వేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం 38 డిగ్రీల వరకు నమోదవుతున్న ఉష్ణోగ్రతలు రానున్న రోజుల్లో 36 డిగ్రీల వరకు తగ్గే తరువాయి 8లో

### ఇరాన్ అణ్వాయుధం
## తయారుచేయదు, కొనదు

- మాకు భరోసా ఇచ్చారు : ట్రంప్ ప్రకటన
- తగ్గిన క్రూడాయిల్ ధర,పెరిగిన బంగారం, వెండి



**వాషింగ్టన్ :** ఇరాన్ స్వయంగా తన దేశంలో అణ్వాయుధాన్ని తయారు చేయదు లేదా ఇతర దేశాల నుండి అణ్వాయుధాన్ని కొనుగోలు చేయదు అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఫాక్స్‌న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. యుద్ధ పరిష్కార చర్చల సందర్భంగా ఇరాన్ నుండి తమకు ఈ భరోసా లభించిందని చెప్పారు. రష్యాకు చెందిన టాస్ వార్తాసంస్థ ఆదివారం ఈ మేరకు ఒక వార్త ప్రచురించింది. ''మేం అణ్వాయుధాలను అభివృద్ధి చేయబోమని వారు మొదట చెప్పారు, మరి అణ్వాయుధాన్ని ఇతర దేశాల నుండి కొనుగోలు చేస్తే ఏమవుతుంది? తేడా ఏమిటి? అని నేను అడిగాను'' అని ఫాక్స్‌న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ చెప్పారు. ముసాయిదా ఒప్పందం ప్రకారం, ఇరాన్ అణ్వాయుధాలను స్వయంగా తన దేశంలో అభివృద్ధి చేయదు లేదా ఇతర దేశాల నుండి కొనుగోలు చేయదు అని ఇప్పుడు స్పష్టంగా సూచిస్తోందని ట్రంప్ చెప్పారు. దీంతో అమెరికా–ఇరాన్ మధ్య ఒక ప్రధానమైన సమస్య దాదాపు పరిష్కారమైనట్టే. హోర్ముజ్ జలసంధి తెరచుకోవడానికి మార్గం సుగమం అవుతుంది. ఐతే ఇరాన్ సమాధానం రావడానికి మూడు రోజులు సమయం తరువాయి 8లో

### ఖర్గేతో సిఎం రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్ భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తదితరులు ఆదివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హైదరాబాద్ మీదుగా గుల్బర్గ్‌కు వెళ్తున్న ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో సిఎం రేవంత్ రెడ్డితో పాటు పలువురు మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎఐసిసి ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు, ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు, తాజా రాజకీయాలు తదితర అంశాలు చర్చకు వచ్చినట్టు తెలిసింది. ఇటీవల గాంధీభవన్‌లో జరిగిన టిపిసిసి పిఎసి సమావేశ వివరాలను వారు ఖర్గేకు వివరించారు. 'సర్' విషయంలో రాష్ట్రంలో జరుగుతున్న కార్యక్రమాలను కూడా వారు ఖర్గే దృష్టికి తీసుకెళ్లారు.



**తెలంగాణ ఫర్టిలైజర్ బుకింగ్ యాప్**
## దేశానికే మార్గదర్శి



రైతుల ముసుగులో ప్రతిపక్ష నాయకుల రాజకీయ ప్రేరేపిత ఆందోళనలకు అడ్డుకట్ట
మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వం అమలు చేస్తున్న ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ జాతీయ స్థాయిలో మార్గదర్శిగా మారిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సాంకేతికత ద్వారా ఎరువుల పంపిణీలో దీర్ఘకాలిక సమస్యలు ఎలా పరిష్కరించవచ్చో తెలంగాణ నమూనా కేంద్ర ప్రభుత్వానికి మోడల్ గా నిలిచిందని పేర్కొన్నారు. అంతేకాకుండ రైతుల ముసుగులో ప్రతిపక్ష నాయకుల రాజకీయ ప్రేరేపిత ఆందోళనలకు అడ్డుకట్ట వేసిందన్నారు. గతంలో యూరియా కోసం క్యూ లైన్స్‌లో రైతులు నిలబడే ఓపిక లేక చెప్పులు క్యూ లైన్స్‌లో పెట్టిన రైతులు, సొమ్మసిల్లి పడి పోయిన రైతులు ఇలా సోషల్ మీడియాలో పోస్ట్ లు పెట్టి ప్రభుత్వాన్ని తరువాయి 12లో

## పేదలకూ కార్పొరేట్ వైద్యం

- పదిలక్షల వ్యయంతో రాజీవ్ ఆరోగ్యశ్రీతో పాటు సిఎంఆర్ఎఫ్ నిధులు
- ఉద్యోగాల కల్పనలో ప్రతి నియోజకవర్గానికీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్
- అందులో చదివే విద్యార్థులకు రూ.2వేలు ఆర్థిక సాయం మంత్రి వివేక్ వెంకటస్వామి



ప్రజాపక్షం/గజ్వేల్

ప్రజా పాలనతోనే పేదల అభివృద్ధి సాధ్యమైందని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి, కలెక్టర్ హైమావతి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, డిసిసి అధ్యక్షులు అంక్షారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విజయ మోహన్, మున్సిపల్ చైర్మన్ చందన రవీందర్ తో కలిసి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ, వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రజాపాలనలో తరువాయి 12లో

## దివ్యాంగ నకిలీ ధృవపత్రాలు

- ఖమ్మం పెద్దాసుపత్రిలో యథేచ్ఛగా దందా
- అంగవైకల్యం లేకున్నా ఫొటోల మార్ఫింగ్‌తో ధృవపత్రాల జారీ
- రూ. 50వేల నుంచి లక్ష వరకు వసూళ్లు





ప్రజాపక్షం/ఖమ్మం

ఖమ్మం పెద్దాసుపత్రి కేంద్రంగా నకిలీ రాకెట్ దందా పెద్ద ఎత్తున సాగుతుంది. గ్రామాల్లో వికలాంగ ధృవీకరణ పత్రం ఇప్పిస్తే నెలకు రూ.4 వేల పింఛన్ అంటూ సామాన్యులకు ఆశ చూపించి పెద్ద మొత్తంలో వసూళ్లు చేస్తున్నారు. ఐదేండ్ల నుంచి ఈ దందా యథేచ్ఛగా సాగుతుంది. ఏ వైకల్యం లేకపోయినా ఫోటోలు అంగవైకల్యం ఉన్నట్లు తీయించి ధృవీకరణకు దరఖాస్తు చేస్తున్నారు. వైకల్యం లేని వారికి ధృవీకరణ పత్రం రావటం పింఛన్ కూడా ప్రతి నెల వస్తుండడంతో నకిలీ దందా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. జిల్లా వ్యాప్తంగా నకిలీ వికలాంగ ధృవపత్రాలు ఖమ్మం పెద్దాసుపత్రి నుండే జారీ అవుతుండటం గమనార్హం. ఈ నకిలీ తరువాయి 8లో

# ఆధునిక సాహిత్య ధోరణి 'నేచురలిజం'

సాహిత్య చరిత్రలో నేచురలిజం (ప్రకృతివాదం) అనే ధోరణి ఒక తీవ్ర వాస్తవిక దృక్పథంగా అభివృద్ధి చెందుతున్నది. ఇది సాధారణ 'వాస్తవికత' కంటే ఒక అడుగు ముందుకు వేసి, మనిషి జీవితాన్ని మరింత కఠినంగానూ, నిర్మొహమాటంగానూ, లోతుగానూ పరిశీలిస్తుంది. నేచురలిజం ప్రకారం మనిషి తన నిర్ణయాలతో మాత్రమే జీవితం నిర్మించుకోడు. వంశపరంపరలు, వారసత్వ లక్షణాలు, సామాజిక పరిస్థితులు వంటి ఎన్నో అంశాలు అతని గమ్యాన్ని నిర్దేశిస్తాయి. ఈ ఆలోచన సాహిత్యాన్ని ఒక కొత్త తాత్విక స్థాయికి తీసుకెళ్లింది. సాహిత్యంలో నేచురలిజం అడుగుపెట్టడానికి, బలపడడానికి గల కారణాలను అర్థం చేసుకోవాలంటే, 19వ శతాబ్దం చివర్లో జరిగిన శాస్త్రీయ, సామాజిక మార్పులను పరిశీలించాలి. చార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన పరిణామ సిద్ధాంతం మనిషిని ప్రకృతి భాగంగా చూడాలని సూచించింది. అదే సమయంలో పారిశ్రామికరణ, పట్టణీకరణ వేగంగా జరిగాయి. ఈ మార్పుల వల్ల పేదరికం, నిరుద్యోగం, సామాజిక అసమానతలు పెరిగాయి. ఈ పరిస్థితులను చూసిన రచయితలు, 'మనిషి స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకుంటాడు' అనే సంప్రదాయ భావనను ప్రశ్నించారు. మనిషి జీవితం సంపూర్ణంగా నియంత్రణలో ఉండదని భావించారు. ఈ భావన నేచురలిజం దృష్టి కోణానికి పునాది. నేచురలిజం ప్రధాన సూత్రంగా డిటర్మినిజం (నిర్ణయాత్మకత)ను పేర్కొంటారు. ఈ సిద్ధాంతం ప్రకారం ప్రతి సంఘటనకు ఒక కారణం ఉంటుంది. మనిషి ప్రవర్తన కూడా ఏదో ఒక కారణ-ఫలిత సంబంధంతోనే నడుస్తుంది. ఒక వ్యక్తి పేదరికంలో పుడితే, అతని అవకాశాలు పరిమితమవుతాయి. జీవితం అతని ప్రమేయం లేకుండానే కుదించుకుపోతుంది. అదే విధంగా, ఒక వ్యక్తి హింసాత్మక పరిసరాల్లో పెరిగితే, అతని ప్రవర్తన కూడా హింసాత్మకంగా మారే అవకాశం ఉంది. ఈ దృక్కోణం వ్యక్తిగత బాధ్యతను తగ్గించి, పరిస్థితుల ప్రభావాన్ని పెంచుతుంది. ఈ భావనను సాహిత్యంలో అత్యంత ప్రభావవంతంగా ఉపయోగించిన రచయితల్లో ఎమిలీ జోలా (ఎమిల్ ఎడ్వార్డ్ చార్లెస్ ఆంటోనే జోలా) ఒకరు. సాహిత్యంలో నేచురలిజం ప్రధాన సిద్ధాంతకర్తగా గుర్తింపు పొందారు. జోలా రచనలు ఒక శాస్త్రీయ ప్రయోగాల్లాగా ఉంటాయి. పాత్రలను ఒక నిర్దిష్ట పరిసరాల్లో ఉంచి, వారు ఎలా ప్రవర్తిస్తారో పరిశీలిస్తారు. ఆయన దృష్టిలో రచయిత ఒక పరిశోధకుడు. కథ ఒక ప్రయోగశాల. కాగా, నేచురలిజం కథల్లో కఠినమైన వాస్తవం ప్రధానంగా కనిపిస్తుంది. పేదరికం, వ్యభిచారం, మద్యం వ్యసనం, హింస, నేరాలు వంటి అనేకానేక అంశాలను రచయితలను నిర్భయంగా వివరిస్తారు. కళ్ల ముందు ఆవిష్కరిస్తారు. ఈ కథలు సౌందర్యాన్ని చూపించడానికి ప్రయత్నించవు. అందుకు బదులుగా, జీవితంలోని అసహాజతను, అసౌకర్యాన్ని ముందుకు తెస్తాయి. ఉదాహరణకు స్టీఫెన్ క్రేన్ రచించిన 'మ్యాగీ: ఎ గర్ల్ ఆఫ్ ది స్ట్రీట్స్'లో పట్టణ పేదరికం, వ్యభిచారం వంటి అంశాలు, పాఠకులు ఎలాంటి ముసుగు లేకుండా దర్శనమిస్తాయి. పాత్రలు తమతమ పరిస్థితుల నుండి... పరిధుల నుంచి బయటపడలేవు. అమెరికన్ రచయిత థియోడర్ డ్రైసర్



రచన 'సిస్టర్ క్యారీ'కూడా నేచురలిజం ప్రక్రియకు ఉదాహరణ. ఇందులో కథానాయిక ఒక మంచి జీవితం కోసం ప్రయత్నిస్తుంది. కానీ ఆమె నిర్ణయాలు వ్యక్తిగత కోరికలకంటే ఎక్కువగా సామాజిక పరిస్థితుల వల్ల ప్రభావితం అవుతాయి. ఆమె విజయం కూడా ఒక స్థిరమైన నైతిక విజయం కాదు... అది ఒక సంక్లిష్ట ఫలితం. నేచురలిజం మనిషిని ప్రకృతిలోని ఒక భాగంగా చూస్తుంది. మనిషి ప్రవర్తనను జంతువుల ప్రవర్తనతో పోలుస్తుంది. ఆకలి, లైంగిక కోరిక, భయం వంటి ప్రాథమిక ప్రవృత్తులు పాత్రల నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి. ఈ దృక్కోణం మనిషిని గొప్ప నైతిక వ్యక్తిగా కాకుండా, ఒక జీవ శాస్త్రీయ సజీవిగా ఆవిష్కరిస్తుంది. మనిషికి స్వేచ్ఛ ఉందా? లేక అతను పరిస్థితుల బానిసనా? అనే ప్రశ్న తలెత్తినప్పుడు, నేచురలిజం రెండో భావనవైపే మొగ్గు చూపుతుంది. అంటే, మనిషిని సంపూర్ణ స్వేచ్ఛా జీవిగా కాకుండా, కొన్ని పరిమితులకు... కొన్ని రకాల చట్రాలకు పరిమితం చేస్తుంది. ఇందులో ఆశకు తక్కువ స్థానం ఉంటుంది. అందుకే, కొందరు విమర్శకులు నేచురలిజాన్ని నిరాశావాదంగా భావిస్తారు. ఈ సాహిత్యంలో పాత్రలు తమ పరిస్థితులను మార్చలేకపోతాయి కాబట్టి, ఇది మనిషిని చులకన చేయడమేనని వాదిస్తారు. కానీ, ఆ వాదన నిజం కాదు. నిజానికి నేచురలిజం ఆశను తగ్గించదు.. కాకపోతే, వాస్తవాన్ని వాస్తవంగా చూపిస్తుంది. అందులో కఠినత్వం కనిపిస్తుంది. తీవ్రత ఉంటుంది. ఏదైనా ఒక సమస్యను పరిష్కరించాలంటే, ముందుగా దాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. ఈ దృక్కోణంలో, నేచురలిజం ఒక అవగాహన సాధనం. ఇది సమాజంలోని కఠిన వాస్తవాలను బయటపెడుతుంది. అర్థం చేసుకోవాలన్న ఆలోచనను కలిగిస్తుంది.

ఇక్కడ, నేచురలిజం, రియలిజం మధ్య తేడాను గమనించడం అవసరం. చాలా మంది ఈ రెంటి మధ్య తేడా లేదని అనుకుంటారు. కానీ ఆ ఆలోచన సరైంది కాదు. ఎందుకంటే, రియలిజం అనేది వాస్తవాన్ని చూపించడానికే పరిమితమవుతుంది. కానీ నేచురలిజం వాస్తవం వెనుక ఉన్న కారణాలను విశ్లేషిస్తుంది. రియలిజం 'జీవితం ఇలా ఉంది' అని చూపితే, నేచురలిజం మాత్రం 'జీవితం ఇలా ఎందుకు ఉంది?' అని ప్రశ్నిస్తుంది. ఈ కారణంగా నేచురలిజం మరింత శాస్త్రీయ దృక్కోణాన్ని కలిగి ఉంటుంది. ఊహకంటే వాస్తవాలు భయపెడతాయన్నది నిజం. అందుకే, నేచురలిజం ధోరణిలో వచ్చే రచనలు చాలా వరకు విషాదాంతాలే. పాత్రలు తమ పరిస్థితులను అధిగమించలేవు. అవి సృష్టించే సమస్యల ఊబి నుంచి బయటపడవు. పరిస్థితుల ప్రవాహంతో కొట్టుకుపోతారు. ఈ ధోరణి సహజంగానే పాఠకుడికి అసౌకర్యాన్ని కలిగిస్తుంది. కానీ, ఒక రకంగా, ఈ అసౌకర్యమే ఈ సాహిత్యం యొక్క శక్తి. ఇది పాఠకుడిని ప్రశ్నించమని ప్రేరేపిస్తుంది. సమాజం ఎందుకు ఇలా ఉంది? ఈ పరిస్థితులను మార్చడానికి ఏమి చేయాలి? అని నిలదీయాలను సూచిస్తుంది. ఇక్కడ మరో వాదనను కూడా ప్రస్తావించుకోవాలి. నేచురలిజం చాలా సార్లు మనిషిని ఒక యంత్రంలా చూపిస్తుందనే విమర్శ ఉంది. అతని భావోద్వేగాలు, నైతికత, తీసుకునే నిర్ణయాలు వంటివన్నీ పరిస్థితుల ప్రభావాలుగానే ఉంటాయి. ఒక రకంగా ఇది మనిషి వ్యక్తిత్వాన్ని తగ్గిస్తుంది. మనిషి ఉనికిని ప్రమాదంలోకి నెడుతుంది. అందుకే, ఈ ధోరణిని పూర్తిగా అంగీకరించడం కష్టం. అయినప్పటికీ, నేచురలిజం సాహిత్యానికి ఒక కొత్త లోతును ఇచ్చింది. ఇది మనిషి జీవితాన్ని శాస్త్రీయ దృక్కోణంతో పరిశీలించింది. ఇది సమాజంలోని అసమానతలను తీవ్రంగా చూపించింది. ఇది పాఠకుడిని అసౌకర్యానికి గురి చేసింది, కానీ అదే సమయంలో ఆలోచింపజేసింది. స్థూలంగా చూస్తే, నేచురలిజం సాహిత్యంలో ఒక కఠినమైన కానీ అవసరమైన దిశగా కనిపిస్తుంది. ఇది మనిషి జీవితాన్ని అలంకారం లేకుండా చూపిస్తుంది. ఇది పరిసరాలు, వారసత్వం, సామాజిక పరిస్థితుల ప్రభావాన్ని విశ్లేషిస్తుంది. ఇది ఆశను తగ్గించినట్టుగా కనిపించినా, వాస్తవాన్ని స్పష్టంగా చూపించడం ద్వారా ఒక అవగాహనను పెంచుతుంది. మనిషిని పూర్తిగా స్వతంత్రుడిగా కాకుండా, పరిస్థితుల ప్రభావంలో ఉన్న జీవిగా చూపిస్తుంది. ఇది సాహిత్యాన్ని ఒక శాస్త్రీయ అధ్యయనంగా మార్చుతుంది. ఇది పాఠకుడిని కఠిన వాస్తవాలను ఎదుర్కొనడానికి ప్రేరేపిస్తుంది. అయితే, ఇది పూర్తిగా సమగ్ర దృక్కోణం కాదు. ఒక కోణం మాత్రమే. అయినప్పటికీ, ఇది సాహిత్యంలో అత్యంత ప్రభావవంతమైన, ఆలోచనాత్మక ధోరణులలో ఒకటిగా నిలిచింది.

నేచురలిజం మనిషి లోతుల్ని పరిశీలిస్తుంది. అదే సమయంలో మనిషి శక్తిసామర్థ్యాలను తక్కువ చేసి చూపిస్తుంది. అయితే, ఏ సామాజిక సిద్ధాంతమైనా, అధిక శాతం మందిని ప్రామాణికంగా తీసుకొని, అంశాన్ని విశ్లేషిస్తుందే తప్ప, అతి కొద్ది మంది గురించి పేర్కోదు. సొమాలియా, బురుండీ వంటి తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో నిత్యం కరువుకాటకాలు తాండవిస్తుంటాయి. అక్కడ బతకడకమే ఒక గొప్ప యుద్ధం. అలాంటి పరిస్థితుల్లో లక్ష్యాలు.. ఆశయాలు.. అందలాలు వంటిని ఊహించలేం. కానీ, అక్కడి నుంచి కూడా విశ్వ మానవ పటంలో తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న వారు లేకపోలేదు. అదే విధంగా, ఒకే వాతావరణంలో, ఒకే పరిస్థితుల మధ్య పెరిగిన వ్యక్తుల జీవితాలన్నీ ఒకే రీతిలో ఉంటాయనుకోవడం కూడా తప్పే. కొందరు పరిస్థితులను అధిగమించి, సమస్యలను జయించి, జీవితంలో ముందుకు దూసుకెళతారు. స్ఫూర్తిప్రదాతలవుతారు. నిజమే. కానీ, అత్యల్పంగా ఉన్న ఈ సంఖ్యను ఆధారంగా చూసుకొని, అత్యంత ఉత్తమమైన జీవితాలను వర్ణించడం ఎంత వరకు సబబు? మిగతా సాహిత్య ధోరణుల మాదిరిగానే నేచురలిజానికి కూడా పరిమితులు లేకపోలేదు. వాటిని మాత్రమే ప్రస్తావిస్తూ, మొత్తం ఈ సాహిత్య ధోరణినే తప్పనడం భావ్యం కాదు.

– సత్య శ్రీ

## సాహిత్యంలోనూ పురుషాధిక్య ధోరణి!



సమాజంలోని రుగ్మతలను ప్రశ్నించి, కూకటివేళ్లతో పెకలించివేయడానికి కృషి చేయాల్సిన సాహిత్య రంగంలోనూ పురుషాధిక్య ధోరణి ఉందా? అనే ప్రశ్నకు 'ఉంది' అని సమాధానం చెప్పాలి. ఇందుకు ఉదాహరణగా, ప్రముఖ రచయిత వ్లాదిమిర్ నబొకొవ్ పేరును పేర్కోవాలి. తనకు మహిళా రచయితల పట్ల సరైన అభిప్రాయం లేదని, చులకనగా చూస్తానని ఆయనే స్వయంగా అంగీకరించాడు. జేన్ ఆస్టెన్ వంటి ప్రసిద్ధి రచయిత్రిని కూడా ఆయన తక్కువ అంచనా వేశాడు. ఇందుకు, కారణం లేకపోలేదు. రచయితగానే కాకుండా, సాహితీ విమర్శకుడిగా కూడా పేరుపొందిన నబొకొవ్ ఒక సాహితీ ప్రక్రియను అంచనా వేయడానికి చాలా కఠినమైన ప్రమాణాలను నిర్ధారించుకున్నాడు. శైలి, నిర్మాణం, భాషలోని సౌందర్యం అనేవి అత్యంత ప్రధానమైనవని భావించేవాడు. అయితే, ఈ కఠిన ప్రమాణాల మధ్యలోనే, ఆయన వ్యక్తిగత అభిరుచులు కూడా పనిచేశాయి. అదే సందర్భంలో మహిళా రచయితల పట్ల ఒక ముందస్తు అభిప్రాయం ఏర్పరచుకొని, ఏకపక్షంగా వ్యవహరించేవాడు. ఈ పక్షపాత వైఖరిని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? ఇది నిజంగా లింగ వివక్షనా లేక ఆయన సాహిత్య అభిరుచుల పరిమితి మాత్రమేనా? అనే ప్రశ్నలు ఉదయించడం సహజం. సమాధానం వెతకాలంటే, నబొకొవ్ ఆచరించిన విధానాలు, ఇష్టాయిష్టాలను పరిశీలించి, పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. అతనికి ఎక్కువగా భాషా ప్రయోగాలు, సంక్లిష్ట నిర్మాణాలు, మానసిక లోతులు ఉన్న రచనలు నచ్చేవి. కానీ జేన్ ఆస్టెన్ రచనలు సామాజిక వ్యంగ్యం, సున్నితమైన భావాలు, సంబంధాల విశ్లేషణపై ఆధారపడతాయి. అంటే, ఆయన అభిరుచులు, ఆమె రచనా శైలి మధ్య చాలా భేదం ఉంది. ఒక రచయిత తన అభిరుచుల ఆధారంగా మాత్రమే ఇతరులను అంచనా వేస్తే, అది నిష్పక్షపాత విమర్శగా తీసుకోవాలా? లేక వ్యక్తిగత పరిమితుల ప్రతిబింబంగా పరిగణించాలా? అనే ప్రశ్నలు కూడా సహజమే. అదే విధంగా, నబొకొవ్ తన అభిప్రాయాన్ని వెల్లడించడం, తన ధోరణిని ఒప్పుకోవడం, అతనిలోని నిజాయితీని కోణాన్ని చూపిస్తుంది. అదే సమయంలో అతని విమర్శలో ఉన్న పరిమితులను కూడా బయటపెడుతుంది. జేన్ ఆస్టెన్ వంటి ప్రపంచ సాహిత్యంలో అత్యంత గౌరవనీయ స్థానాన్ని పొందిన రచయిత్రిని సైతం చులకనగా చూడడం నబొకొవ్ హ్రస్వదృష్టికి నిదర్శమన్న తీవ్రమైన విమర్శలు ఉన్నాయి. ఆమె రచనలు మానవ సంబంధాల సున్నితత్వాన్ని, సామాజిక నిర్మాణాలపై విమర్శను, భావోద్వేగాల లోతును అద్భుతంగా ప్రతిబింబిస్తాయి. అంటే, ఒక ప్రముఖ రచయిత అభిప్రాయం, ఆమె సాహిత్య విలువను తగ్గించలేదని స్పష్టంగా తెలుస్తుంది. విమర్శకుడు లేదా రచయిత ఎంత గొప్పవాడైనా, అతని అభిప్రాయాలు సంపూర్ణ సత్యం కావని ఈ విషయం రుజువు చేస్తుంది. అవి అతని వ్యక్తిగత దృక్కోణం, అనుభవం, పరిమితుల ప్రభావంతోనే రూపుదిద్దుకుంటాయని స్పష్టమవుతుంది.

## పారదర్శక సమీక్షలు సామాజిక అవసరం!



అవకాశాలు.. సౌలభ్యాలు విపరీతంగా పెరగడంతో, రాసేవాళ్లు పెరిగారు. ఇది మంచి పరిణామం. కానీ, అదే సమయంలో ప్రతి రాత కూడా సాహిత్యంగా చెలామణి కావడం దురదృష్టకరం. ప్రజల మధ్య ప్రాంతాలు... మతాలు.. కులాలు.. వర్గాలుగా చిచ్చుపెట్టి, దోపిడీ వర్గాలకు కొమ్ముకాచే రచయితలు పుట్టుకురావడం ప్రమాదకరం. ఇలాంటి పరిస్థితుల్లోనే, సాహితీ సమీక్షలకు ప్రాధాన్యం పెరిగింది. ఒకటి రెండు మినహాయింపులను పక్కకు పెడితే, వివిధ పత్రికల్లో, తమకు సానుకూలమైన అంశాలకే పెద్దపీట వేయడం కనిపిస్తుంది. అందుకే, సాహిత్యంలో నూ ఒక రకమైన పక్షపాత వైఖరి ఉంటుంది. ఇలాంటి సమయంలోనే పారదర్శక సమీక్షల అవసరం మరింత పెరుగుతుంది. చిన్న సంస్థలు, పత్రికలు, ముద్రణలతో పోలిస్తే, పెద్దపెద్ద విశ్వవిద్యాలయాలు, పేరుమోసిన సంస్థల ప్రచురణకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఈ పెద్ద సంస్థలు వాస్తవాలను, నిష్పాక్షిత అభిప్రాయాలను గౌరవిస్తే, పరిస్థితి కొంత వరకైనా మారుతుంది. అయితే, ఇక్కడ సదరు సమీక్షలు దేనిపై ఉండాలనే ప్రశ్న తలెత్తుతుంది. సాధారణంగా కవితలు లేదా కథలు లేదా నవలలపైనే ఎక్కువగా సమీక్షలు వస్తుంటాయి. వాటిలో ఉపయోగించిన భాష నుంచి పాత్రలను మలచిన విధానం వరకూ, పలు అంశాలను విశ్లేషించే వారు చాలా మందే ఉన్నారు. తరచు పత్రికల్లో చూసే సమీక్షలు ఇదే కోవకు చెందుతాయి. వ్యాసాలు, అధ్యయనాలు, విజ్ఞానాది రంగాలకు సంబంధించినవి కూడా రచనల జాబితాలోనే వస్తాయన్న వాస్తవాన్ని దురదృష్టవశత్తు చాలా మంది మరచిపోతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో పెద్దపెద్ద విశ్వవిద్యాలయాలు లేదా పేరొందిన సంస్థలకు చెందిన వారి రచనలే సమీక్షకుల నుంచి మంచి రేటింగ్ పొందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నది చేదు నిజం. ఎలాంటి పక్షపాత వైఖరి లేకుండా, రచనలను సమీక్షించే విధానం వేళ్లూనుకునే వరకూ ఇలాంటి దుష్ట సంప్రదాయం కొనసాగుతునే ఉంటుంది.

## ఆఫ్రికన్ సంప్రదాయాల 'వోలాఫ్'

పశ్చిమ ఆఫ్రికాలోని వోలాఫ్ ప్రజల భాష, సంస్కృతి, సామాజిక అనుభవాల ప్రతిబింబం వోలాఫ్ సాహిత్యం. ఇది ముఖ్యంగా సెనెగల్, జాంబియా ప్రాంతాల్లో విస్తరించింది. ఈ సాహిత్యం కూడా ఇతర ఆఫ్రికన్ సంప్రదాయాల మాదిరిగానే మొదట మౌఖిక రూపంలోనే అభివృద్ధి చెందింది. మౌఖిక సంప్రదాయం వోలాఫ్ సాహిత్యానికి మూలాధారం. ఇందు లో గ్రియోట్‌లు (పారంపరిక గాయకకథకులు) కీలక పాత్ర పోషిస్తారు. వీరు రాజుల వంశ చరిత్రలు, వీరగాథలు, సామాజిక సంఘటనలు, ప్రజల జీవన విలువలను పాటల రూపంలో చెప్పేవారు. ఈ సంప్రదాయం కేవలం వినోదం కోసం కాకుండా, జ్ఞాపకశక్తి ఆధారంగా చరిత్రను నిలుపుకునే ఒక విధానంగా కూడా పనిచేసింది. వోలాఫ్ సాహిత్యంలో పురాణాలు, జానపద కథలు, సామెతలు, గేయాలు ప్రధానంగా కనిపిస్తాయి. ఈ కథల్లో మానవ స్వభావం, ధర్మం, న్యాయం, సమాజంలో వ్యక్తి స్థానం వంటి అంశాలు ప్రతిఫలిస్తాయి. ముఖ్యంగా సామెతలకు చాలా ప్రాధాన్యం ఉంది. ఇవి సంక్షిప్తంగా, లోతైన జీవన సత్యాలను చెప్పగలవు. లిఖిత వోలాఫ్ సాహిత్యం తరువాతి దశలో, ముఖ్యంగా వలస పాలన తరువాత అభివృద్ధి చెందింది. అరబిక్ లిపిలో వోలాఫ్ భాషను రాయడం ఒక ముఖ్యమైన దశ. దీన్ని 'అజామీ' అని పిలుస్తారు. ఈ రూపంలో ధార్మిక గ్రంథాలు, కవిత్వం, ఉపదేశాలు విరివిగా వచ్చాయి. తరువాత కాలంలో, యూరోపియన్ ప్రభావంతో లాటిన్ లిపి ఉపయోగం పెరిగింది. ఆధునిక వోలాఫ్ సాహిత్యంలో సామాజిక సమస్యలు, రాజకీయ పరిస్థితులు, ఆధునిక జీవన సంక్లిష్టతలు ప్రధానంగా చర్చలో ఉన్నాయి. రచయితలు సంప్రదాయం, ఆధునికత మధ్య ఉన్న సంఘర్షణను విశ్లేషిస్తున్నారు.



వోలాఫ్ సాహిత్యం నిజంగా లిఖిత రూపంలోనే పూర్తిగా అర్థమవుతుందా? లేక మౌఖిక రూపంలోనే దాని అసలు స్ఫూర్తి ఉంటుందా? అనే ప్రశ్నకు నేరుగా సమాధానం ఇవ్వడం కష్టం. ఎందుకంటే, మౌఖిక సాహిత్యం సందర్భానుసారంగా మారుతుంది, జీవంతో నిండి ఉంటుంది. లిఖిత సాహిత్యం మాత్రం దానిని స్థిరపరుస్తుంది, కానీ అదే సమయంలో దాని చలనశీలతను తగ్గిస్తుంది. వోలాఫ్ సాహిత్యాన్ని కేవలం జానపద కథలుగా చూడటం సరిపోతుందా? లేదా అది ఒక సమాజపు రాజకీయ, ఆర్థిక, ఆధ్యాత్మిక నిర్మాణాలపై లోతైన వ్యాఖ్యానంగా కూడా భావించాలా? అనే ప్రశ్నలు వోలాఫ్ సాహిత్యాన్ని మరింత గంభీరంగా, లోతుగా అధ్యయనం చేయడానికి దారి తీస్తాయి. మొత్తం మీద వోలాఫ్ సాహిత్యం అనేది ఒక జీవించే సంస్కృతికి శబ్దరూపం. ఇది గతాన్ని సంరక్షిస్తూ, వర్తమానాన్ని విశ్లేషిస్తూ, భవిష్యత్తును ప్రశ్నించే ఒక శక్తివంతమైన సాహిత్య పరంపర.

## ఈ వారం కవితలు

### 'ఎర్రబాట'

జోహారు ... జోహారు
ఏటుకూరి ప్రసాదు
"అక్షరాంజలి ఇదే –
ఏటుకూరి ప్రసాదు
జోహారులు ఎర్ర బాటసారి ప్రసాదు
అరుణారుణ అంజలి...
ఏటుకూరి ప్రసాదు

కష్టజీవి కిరువైపుల
కాపలాగ నిలిచావు
పేద ప్రజల కండగా
పాటలెన్నో మలిచావు
॥జోహారు॥

అతివాద సోదరులకు
అలనాడే తెలిపినావు
సాయుధ సమరానికి
సమయం కాదన్నావు
॥జోహారు॥

మడుగునొదిలి చేపపిల్ల
బ్రతకదని తెలిపావు
ప్రజల విడువ ఆశయం
నెరవేరదు అన్నావు
'॥జోహారు॥

సంపూర్ణ జీవితం సాగించిన ఏటుకూరి
సేవలంటూ వెళ్లిపోయిన..సేనాని ఏటుకూరి
అక్షరాంజలి – మీకు – అరుణారుణ
వందనం

– లక్ష్మీ నారాయణ

### రెడ్ సెల్యూట్ డా॥ఏటుకూరి

మాటల్లో తూటాల్నీ ఉపన్యాసాల్లో ఈటల్నీ
రచనల్లో అభ్యుదయంను
నడకలో నడతలో ఎర్రజెండా రెపరెపల్నీ
జీవితమంతా అంకితం చేసిన ఎర్రసైనికుడు
అభ్యుదయ పత్రిక సంపాదకుడిగా తొలి ఎర్రజెండా కవిగా

అభ్యుదయ సాహిత్య ప్రారంభకులలో ప్రముఖుడిగా
వందమంది చేతిరాతలతో తెలుగు సాహిత్యంలో
వినూత్న ప్రక్రియ ద్వారా చరిత్రలో సువర్ణ అక్షరాలతో
చరిత్రలో తన స్థానాన్ని పదిలపర్చుకున్నవాడు

తాను నమ్మిన సిద్ధాంతం కోసం ఆశయం కోసం
ఆదర్శం కోసం తమ శ్వాస ఉన్నంత వరకు అంకిత
భావంతో కట్టుబడిన నిఖార్సైన కమ్యూనిస్టు
కవిత్వమే తమ శ్వాసగా, ధ్యాసగా గడిపాడు
లబ్ధి ప్రతిష్టులైన కవుల నుండి వర్ధమాన కవుల వరకు
ఎవరి కవిత్వం నచ్చిన ఫోన్ చేసి మెచ్చుకునే వారు
అక్షర సైనికుడు ఎంతో
మంది గురువులకే గురువు
ఏటుకూరి ప్రసాద్ లేరు తిరిగి రారు అనే మాటలు
నమ్మలేని నిజాలు ఏటుకూరి ప్రసాద్ ఉన్నా లేకున్నా
అభ్యుదయ సాహిత్య ప్రస్థానంలో ఆయన స్థానం పదిలం

అభ్యుదయ రచయితలుగా ఆయన ఓనమాలు నేర్పిన వారు
ఈనాడు తెలుగు సాహిత్యంలో పత్రిక రంగాల్లో
ప్రముఖులు రాటు దేలిన కవులు ఏటుకూరి
ఆశయాలను ఆదర్శాలను కన్నకలలను తాను
కోరుకున్న సమసమాజ నిర్మాణానికి అంకితం కావడమే
ఆయనకు మనం అర్పించే అసలు సిసలైన నివాళులు
రెడ్ సెల్యూట్ ఏటుకూరి ప్రసాద్
ఎర్రెర్రని దండాలు ఎర్రదండాలతో
అర్పించాలి అక్షర నివాళులు

డాక్టర్.ఎస్. విజయ భాస్కర్,
9290826988

## ప్రముఖ అభ్యుదయ కవి

### ఏటుకూరి ప్రసాద్ గారి జీవితం, సాహిత్య సేవ స్ఫూర్తివంతమైనవి



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభ్యుదయ సాహిత్యం వ్యాప్తికి కృషి చేసిన అభ్యుదయ రచయితల సంఘం సీనియర్ నాయకులు, విశాలాంధ్ర, నవచేతన పుస్తక ప్రచురణ సంస్థ సంపాదకులు ఏటుకూరి ప్రసాద్ గారు ఈనెల 23వ తేదీ రాత్రి హైదరాబాదులోని తన స్వగృహంలో, తుది శ్వాస విడిచారు.వారి మరణం సాహిత్య ఉద్యమానికి తీరని లోటు. డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ గారు మార్క్సిస్ట్ సిద్ధాంత నిబద్ధత కలిగినటువంటి వ్యక్తి. సిద్ధాంత పునాదుల మీదనే రచన వ్యాసంగం సాగించాడు. చివరి శ్వాస వరకు గ్రంథ రచనలు సాగించారు. కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా, సిద్ధాంతాన్ని నమ్మిన వ్యక్తిగా ఆయన ఆలోచనలు, సాహిత్య రచన మొత్తంగా 'జనంలోంచి జనంలోకి' అన్న సూత్రాన్ని ఆధారంగా చేసుకొని సాగినవి. ఏటుకూరి ప్రసాద్ గారి కుటుంబం కమ్యూనిస్టు కుటుంబం. స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న కుటుంబం. ప్రముఖ అభ్యుదయ వాది రచయిత ఏటుకూరి బలరామమూర్తి గారి ప్రభావంతో వామపక్ష భావజాలాన్ని, అభ్యుదయ సాహిత్యాన్ని, వ్యాప్తి చేయటంలో ముందున్న కుటుంబం. విద్యార్థి దశ నుండే అభ్యుదయ భావాలను పునికి పుచ్చుకున్న ఏటుకూరి ప్రసాద్ గారు అంచలంచెలుగా జీవితంలో, సాహిత్య రంగంలో ఉద్యోగ రంగంలో ఎదగటం జరిగింది. తాను పత్రిక రంగంలో కూడా పని చేశారు. ఉపాధ్యాయుడిగా, లెక్చరర్‌గా, దీన్గా విద్యా రంగానికి సేవలందించినటువంటి గొప్ప అనుభవమున్న వ్యక్తిగా ఆయనకు జనం బాధలు తెలుసు, జనపదాలు తెలుసు, జానపద పాటల రాగాలు తెలుసు, తెలుగు డిక్షనరీలోని పదాల అర్థాలు క్షుణ్ణంగా తెలుసుకున్నవాడు. అభ్యుదయ సాహిత్య వెలుగుల్లో పురోగమిస్తున్న సమాజాన్ని చూసి తట్టుకోలేక తిరోగమన ఆలోచనలపై తిష్ట వేసి కూర్చున్నటువంటి కర్మ సిద్ధాంతపు ఆలోచనల సాహితీవర్గాల రాళ్ల వర్షం శ్రీశ్రీ గారి మీద కూడా పడ్డ విషయం అందరికీ తెలిసిందే. అభ్యుదయ కవులు జనములోకి వచ్చి బాధలు చూసి జనం మాటల్లో జన సాహిత్యాన్ని సృష్టిస్తున్నప్పుడు, జనం బాణీలో పాటలను రచిస్తున్నప్పుడు ఆ పాటలు జన హృదయాల్లో చైతన్యాన్ని రగిలిస్తున్నప్పుడు, చైతన్యంతో జనం దోపిడిపై, మూఢ విశ్వాసాలపై తిరుగుబాటు చేస్తున్నప్పుడు, ఈ సాహిత్యాన్ని అసలు సాహిత్యమే కాదని విమర్శలు వచ్చినప్పుడు కూడా శ్రీశ్రీ గారితో పాటు ఆనాటి అభ్యుదయ కవులు రచయితలు వారికి సరియైన పద్ధతిలో వ్యాసాల ద్వారా గుణపాఠం చెప్పారు. తాపీ ధర్మారావు, కేతు విశ్వనాథరెడ్డి , రాంబట్ల కృష్ణమూర్తి మరి ఎంతోమంది సాహిత్య ఉద్దండులు , ప్రగతి నిరోధక శక్తుల దాడులను తిప్పి కొడుతూ సాహిత్య వ్యాసాల ద్వారా సమాధానం చెప్పేవారు. అటు తర్వాత కాలంలో కూడా అభ్యుదయ సాహిత్య ప్రభంజనంకి తట్టుకోలేక అభ్యుదయ రచయితల మీద వివిధ పత్రికల్లో సాహిత్య విమర్శలు ,దాడులు చేస్తున్న మనువాద భావజాల కవులు, రచయితల కుతంత్రాలను, ఉద్దేశపూర్వక విమర్శలను, అభ్యుదయ మాసపత్రికలోనూ, విశాలాంధ్ర దినపత్రిక, ఇతర పత్రికలలో తన పదునైన సాహిత్య వ్యాసాస్త్రాలతోటి తిప్పి కొట్టిన అభ్యుదయ సాహిత్య సైనికుడు డాక్టర్ ఏటుకూరు ప్రసాద్ గారు. ఆ క్రమంలోనే అభ్యుదయ రచయితల సంఘం నాయకులు ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, పెనుగొండ లక్ష్మీ నారాయణ ,వల్లూరి శివప్రసాద్, వేల్పుల నారాయణ లాంటి ఎంతోమంది రచయితలు అభ్యుదయ సాహిత్య వ్యాప్తిలో వారి స్ఫూర్తితో కృషి చేసినారు. ఏటుకూరి ప్రసాద్ గారు కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా పార్టీ చరిత్రను తెలియజేసే గొప్ప పాటను అందించారు. వారు ఎర్ర పాటల రచయితగా ప్రసిద్ధిగాంచారు. ఈ రాష్ట్రంలో ఎంతోమంది యువకులకు, రచయితలకు, ఏటుకూరి ప్రసాద్ గారు మార్గదర్శకులు. వారికి భాష మీద, సాహిత్యం మీద ఉన్న పట్టు చెప్పలేనిది. అభ్యుదయ రచయితల సంఘం వేదికగా మూడు దశాబ్దాలకు పైగా ఏటుకూరి ప్రసాద్ గారితో నాకు అనుబంధం ఉన్నదని చెప్పటానికి గర్వపడుతున్నాను. నేటి తరం రచయితలు తమ గ్రంథానికి సందేశము, లేదా ముందుమాటను మీరే రాయాలని ఏటుకూరి ప్రసాద్ వారితో రాయించుకున్న సంఘటనలు ఎన్నో. ఇక్కడ మరొక విషయం తప్పకుండా చెప్పవలసి ఉన్నది. ఈ సమాజంలో సాహిత్యము సాంస్కృతిక కార్యక్రమాలు విస్తృతంగా పెరగాలని నమ్మిన వారిలో ఏటుకూరి ప్రసాద్ గారు ఒకరు. ఒక సభ , సమావేశం జరుపాలన్నా, విజయవంతం కావాలన్నా, అంత సునాయసమైన పని కాదు, దానికి ఆర్థిక భారం ఎంతో ఉంటుందని అనుభవపూర్వకంగా తెలిసినటువంటి నాయకుడిగా, అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్యమండలి, సభలు, సమావేశాలు ,కార్యక్రమాలు జరుగుతున్నప్పుడు ఆయన సహృదయంతో కార్యక్రమాల విజయవంతానికి ఆర్థిక ,హార్దిక తోడ్పాటు అందించిన గొప్ప వితరణశీలి. 17–7–2026 నాటికి ఏటుకూరి ప్రసాద్ గారు 92 వ సంవత్సరంలో అడుగు పెడతారు. ఈ సందర్భంగా వారి పేరు మీద ఒక జన్మదిన సంచికను కూడా తీసుకురావాలని నిర్ణయించి సంపాదక వర్గాన్ని కూడా ప్రకటించడం జరిగింది. 92 సంవత్సరాల వయస్సు ఉన్నప్పటికీ ఆయన నిత్యం ఉత్సాహంగా, చైతన్యవంతంగా స్ఫూర్తివంతంగా ఎదుటివారితో మాట్లాడుతుంటారు. వారి గొంతు కంచు కంఠం. వారు రాసిన పాటకు వారి ట్యూన్ గట్టి పాడుతుంటే ఒక గొప్ప గాయకుడిని కూడా చూడగలం. ఏటుకూరి ప్రసాద్ గారు నిరాడంబరుడు. వారి మాట, పాట, వారి రచన చాలా సరళంగా, సులభతరంగా అందరికీ అర్థమయ్యే రీతిలో ఉంటుంది. వారు రాసిన ఎర్రజెండేరో తమ్ముడా ఎర్రజెండేర అనే పాట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అశేష ప్రజానీకాన్ని ఉర్రూతలూగించింది, ఆలోచింపజేసింది, పోరు బాటన నడిపించింది. ఇలాంటి ఎన్నో పాటలు ప్రజానాట్యమండలి కళాకారుల గొంతు నుండి ప్రవాహంగా రాగా ప్రజల నాలుకలపై చిందులు తొక్కాయి. ఏటుకూరి ప్రసాద్ గారి పాటలే కాదు, సమావేశాలు సభలలో వారు మాట్లాడేటప్పుడు సంక్షిప్తంగా, అర్థవంతంగా, సందేశాత్మకంగా, అర్థం చేసుకునే వారికి అర్థమయినంతగా ఉంటుందని చెప్పడానికి ఎలాంటి సందేహం లేదు.1943 తెనాలిలో అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడిన నాటి నుండి ఉమ్మడి రాష్ట్రంలో అభ్యుదయ సాహిత్య పరిమళాల వ్యాప్తి ,సామాజిక చైతన్యం లక్ష్యంగా అరసం అనేక కార్యక్రమాలు నిర్వహించింది. ఆ సందర్భంలో ఎంతోమంది యువకులు అ.ర.సం. వైపు ఆకర్షితులైనారు. ఆ క్రమంలోనే ఏటుకూరి ప్రసాద్ గారు వారి గురువు గారి సలహా మేరకు అభ్యుదయ రచయితల సంఘంలో సభ్యత్వం తీసుకొని సభ్యుడిగా కొనసాగినట్లు అనేక సందర్భంలో ప్రసాద్ గారు చెప్పటం జరిగింది.ప్రసాద్ గారు అనేక గ్రంథాలు రచించారు. గేయ, కవిత సంపుటీలను వెలువరించారు. ప్రధానంగా వారు తాపీ ధర్మారావు గారి జీవితం రచనలు అనే అంశంపై సమగ్ర పరిశోధన చేసి ఒక సిద్ధాంత గ్రంథాన్ని సమాజానికి అందించారు ఈ గ్రంథ రచనతో ఆయనకు డాక్టరేట్ పట్టాను అందించారు. గడిచిన ఏప్రిల్ చివరి వారంలో పల్లేరు వీరస్వామి, తిరుపాల్, నేను , ముగ్గురం ఏటుకూరు ప్రసాద్ గారి ఇంటికి వెళ్లి వారిని కలిసి అభ్యుదయ సాహిత్యము గురించి కాసేపు మాట్లాడుకున్నాం. అప్పటికి వారు ఒక పుస్తక రచనలో నిమగ్నమయ్యే ఉన్నారు. ప్రజాపక్షంలో ఉద్యోగ బాధ్యత నిర్వహిస్తున్న వారి కుమారుడు అరుణ్ కోసం కూడా వెయిట్ చేసాము, కొంత ఆలస్యం అవుతుందని తెలుసుకున్నాక ఏటుకూరి ప్రసాద్ గారు స్వయంగా మాకు టీ ఆఫర్ చేయడం మర్చిపోలేని సంఘటన. ఆ సందర్భంగా వారు ఒక మాట చెప్పారు. ఎంతటి పెద్దవారైనా గ్రంథ రచన సమయంలో భాషా పరమైన పద దోషాలను గమనంలో ఉంచుకోవాలన్నారు. వారు చెప్పిన మాటలు, సూచనలు మర్చిపోలేనివి. వారి స్ఫూర్తివంతమైన మాటలను, రచనలను, అభ్యుదయ రచయితల సంఘం బలోపేతం గురించి , వ్యాప్తి గురించి, వారు చేసిన కృషి ఎప్పటికీ మరువలేం.అభ్యుదయ సాహిత్యం చరిత్రలో ఏటుకూరి ప్రసాద్ గారి పేరు చిరస్మరణీయంగా నిలిచి ఉంటుంది.

కె.వి.ఎల్.
అభ్యుదయ రచయితల సంఘం
రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ
9490952649

# ఘనంగా ముగిసిన మహిళా వారోత్సవాలు

### విజయవంతం చేసిన అందరికీ మంత్రి సీతక్క కృతజ్ఞతలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగానే కాకుండా ఆర్థికాభివృద్ధికి చోదకశక్తులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహించిన మహిళా వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మే 25 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాలు మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబన, నాయకత్వ వికాసం, బాలికల అభివృద్ధి, మహిళా భద్రత, పారిశ్రామిక ప్రోత్సాహం వంటి అంశాలపై విస్తృత చైతన్యాన్ని కల్పించాయని తెలిపారు. మహిళా వారోత్సవాల విజయంపై సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి సీతక్క మహిళా సాధికారతను ప్రజా ఉద్యమంగా మలచాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ కార్యక్రమాలు బలమైన పునాది వేశాయని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో స్వయం సహాయక సంఘాల బలోపేతం, గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధి, యువతుల్లో నాయకత్వ లక్షణాల పెంపు వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారన్నారు.

**ప్రజా ఉద్యమంగా మహిళా సాధికారత : సీతక్క**

మహిళా వారోత్సవాలు ప్రజా ఉద్యమంగా నిలిచాయని మంత్రి సీతక్క అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పం సాకారమయ్యే దిశగా ఈ కార్యక్రమాలు మహిళల్లో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపాయన్నారు. మహిళలు వ్యవసాయం, సూక్ష్మ వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామిక రంగం, విద్యుత్ ఉత్పత్తి, సేవారంగం, నాయకత్వ స్థానాల్లోనూ రాణించగలరని ఈ ఉత్సవాలు నిరూపించాయన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారత కోసం భవిష్యత్తులో మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపడతామని, తెలంగాణ మహిళలను దేశానికి ఆదర్శంగా నిలబెట్టే దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. మహిళా వారోత్సవాలను విజయవంతం చేసిన స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడి సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, యువత, ప్రజలందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

**సౌర విద్యుత్ కేంద్రం ప్రత్యేక ఆకర్షణ**

వారోత్సవాల్లో భాగంగా మధిరలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తొలి సౌర విద్యుత్ కేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క ప్రారంభించారు. మహిళలు పునరుత్పాదక ఇంధన రంగంలోనూ విజయవంతంగా రాణించగలరనే సందేశాన్ని ఈ ప్రాజెక్టు ఇచ్చిందని అధికారులు తెలిపారు.

**భద్రత, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన**

మహిళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పిఓఎస్‌హెచ్ చట్టంపై అవగాహన కార్యక్రమాలు, శిక్షణా శిబిరాలు నిర్వహించారు. బాల్య వివాహాల నిర్మూలన కోసం బాల్య వివాహం – బతుకు ఆగం పేరిట ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టి సమాజంలో చైతన్యం కల్పించారు.

**పారిశ్రామికవేత్తలుగా మహిళలు**

మహిళలను ఉద్యోగాల కోసం ఎదురు చూసే స్థితి నుంచి ఉపాధి కల్పించే స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక ఇంక్యుబేటర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రుణమేళాలు, జీవనోపాధి యూనిట్ల ప్రారంభోత్సవాలు, మార్కెటింగ్ అవకాశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, మహిళల్లో వ్యాపార దృక్పథాన్ని పెంపొందించే ప్రయత్నం చేశారు.

**బాలికల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు**

బలమైన బాల్యానికి 1000 మెట్లు కార్యక్రమం ద్వారా చిన్నారుల ఆరోగ్యం, పోషణ, అభివృద్ధిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ముగింపు రోజున నిర్వహించిన అమ్మ మాట – అంగన్‌వాడీ బాట కార్యక్రమం విశేష స్పందన పొందింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు యూనిఫారాల పంపిణీ, విద్యారంభ ధ్రువపత్రాల అందజేత, అక్షరాస్యత సాధించిన మహిళలకు ప్రశంసాపత్రాల ప్రదానం చేశారు. టీనేజ్ బాలికలకు సైకిల్ శిక్షణ, జిల్లాల వారీగా నిర్వహించిన స్నేహ సంఘాల మాక్ పార్లమెంట్ కార్యక్రమాలు యువతుల్లో నాయకత్వ సామర్థ్యాలను వెలికితీశాయి. ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెంపొందించడంతో పాటు నిర్ణయాత్మక స్థానాల్లో మహిళల పాత్ర ప్రాధాన్యాన్ని చాటి చెప్పాయి.

**లక్షలాది మంది భాగస్వామ్యం**

వారంరోజుల పాటు సాగిన ఈ ఉత్సవాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులు, స్నేహ సంఘాల బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పారిశ్రామికవేత్తలు, విద్యార్థినులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు భారీగా పాల్గొన్నారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలు పెరగడం, మహిళల్లో వ్యాపార ఆలోచనలు బలోపేతం కావడం, ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన విస్తరించడం వంటి సానుకూల ఫలితాలు కనిపించాయని అధికారులు తెలిపారు.

## ముందస్తుగా కోతలు విధించడం సరికాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉద్యోగుల ఆరోగ్య భద్రత కోసం ప్రవేశపెడుతున్న నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఇహెచ్‌ఎస్) అమలు విషయంలో పూర్తి విధివిధానాలను ఖరారు చేయక ముందే ఉద్యోగులకు చెందిన 'మే' వేతనాల నుంచి 1.5 శాతం 'చందా' మినహాయించడాన్ని స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టియు టిఎస్) ఖండించింది. రాష్ట్ర ప్రభుత్వం ఏ ఉత్తర్వుల ప్రకారం 1.5 శాతాన్ని తగ్గించిందని ప్రశ్నించింది. ముందస్తుగా వేతనాల్లో కోతలు విధించడం ఉద్యోగుల్లో అసంతృప్తికి దారితీస్తోందని, ఇప్పటికైనా ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకుని, ఈహెచ్‌ఎస్ చందా పేరుతో జరుగుతున్న వేతన కోతలను నిలిపివేయాలని, పూర్తిస్థాయి విధివిధానాలు ప్రకటించిన తర్వాతనే అమలుకు చర్యలు తీసుకోవాలని ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందంగౌడ్, ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబ సభ్యుల నమోదు ప్రక్రియ ఇంకా 50 శాతం కూడా పూర్తి కాలేదని, ఐఎఫ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో తరచూ మార్పులు జరుగుతుండటంతో అనేక మంది ఉద్యోగులు ఇంకా పూర్తి వివరాలను నమోదు చేయలేదన్నారు. కుటుంబ సభ్యుల అర్హత, భార్యాభర్తలు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే చందా మినహాయింపు విధానం వంటి కీలక అంశాలపై ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదన్నారు.

### శిశువు చేయి తొలగింపు ఘటనపై..

## సుమోటోగా హెచ్‌ఆర్‌సి కేసు నమోదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఖమ్మం ప్రభుత్వ మాతాశిశు సంక్షేమ కేంద్రంలో అకాల ప్రసవంతో జన్మించిన ఓ శిశువుకు వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఎడమ చేయి భుజం వరకు తొలగించాల్సి వచ్చిందన్న ఆరోపణలపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సీరియస్‌గా స్పందించింది. ఈ ఘటనపై కమిషన్ సభ్యురాలు శివాడి ప్రవీణ సుమోటో కేసు నమోదు చేశారు. తెలుగు దినపత్రికలో నెలలు తక్కువని వస్తే.. వికలాంగుడిగా మార్చారు! అనే శీర్షికతో ప్రచురితమైన కథనాన్ని ఆధారంగా తీసుకుని కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది. వార్తలో పేర్కొన్న ఆరోపణలు నిజమైతే, అవి నవజాత శిశువు జీవించే హక్కు, ఆరోగ్య హక్కు, గౌరవప్రదమైన జీవన హక్కు, సరైన వైద్య సేవలు పొందే హక్కులకు విఘాతం కలిగించే తీవ్రమైన అంశాలని కమిషన్ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి నుంచి సమగ్ర నివేదిక సమర్పించాలని కమిషన్ ఆదేశించింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను నివేదిక రూపంలో అందించాలని సూచించింది. ఈ కేసు విచారణను జూన్ 29, 2026 ఉదయం 11 గంటలకు కమిషన్ ముందుకు తీసుకురానున్నారు.

## రేవంత్‌రెడ్డి మాటలకు పొంతన లేదు

### మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి



**ప్రజాపక్షం/జగిత్యాల :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలకు, చేతలకు పొంతన లేదని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి పేర్కొన్నారు.జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం జీవన్ రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెడితే ఓటు అడగా అని రేవంత్ రెడ్డి అంటున్నారని అనడం అవివేకమన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటు అడిగే అవకాశం కూడా ఇవ్వరన్నారు. కాళేశ్వరంతో కెసిఆర్ రైతులకు ఆత్మస్థైర్యం అందించారన్నారు. రేవంత్ రెడ్డి మాయ మాటలతో ప్రజలను మభ్యపెట్టడం మానుకోవాలన్నారు. సీఎం అనుచర వర్గం అదే దోపిడి బాటలో నడుస్తుందన్నారు. జిల్లాల్లో మంత్రి లక్ష్మణ్ కుమార్ ఇసుక బజార్ ప్రారంభిస్తే నిత్యం ఇసుక అక్రమ రవాణా అవుతుంటే జిల్లా ఎస్పీకి, కలెక్టర్‌కు కనపడటం లేదా అని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు కనుసన్నల్లో రేవంత్‌రెడ్డి ఉచిత విద్యుత్‌పై ఆంక్షలు పెట్టేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. రైతుల కష్టం రేవంత్ రెడ్డికి ఎద్దు తెలియదు.. ఎవుసం తెలువదని కేవలం రియల్ ఎస్టేట్ మాత్రమే ఆయనకు తెలుసునన్నారు. కార్మికుల హక్కుల కోసం బాల్క సుమన్ ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారన్నారు. అనంతరం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం సేకరణలో పూర్తిగా విఫలం అయిందని మండిపడ్డారు. హమాలీ ఛార్జీల పేరుతో రూ.45 చొప్పున 22 కోట్ల చొప్పున రైతుల కష్టాన్ని దోచుకున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీకాంత్ రెడ్డి, సతీష్, దుర్గయ్య, తదితరులు ఉన్నారు.

# గురుకుల విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యం

### మంత్రి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్య, మౌలిక వసతులు, పోషకాహారం, విదేశీ విద్య, ఉద్యోగ అవకాశాల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటుంటే, 10 ఏళ్ల పాటు సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసిన బిఆర్‌ఎస్ ఇప్పుడు రాజకీయ ఆరోపణలు చేయడం సిగ్గుచేటని ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. గురుకులాల కోసం ఒక్క శాశ్వత భవనాన్ని కూడా నిర్మించని బిఆర్‌ఎస్ నాయకులు నేడు గురుకులాలపై మాట్లాడటం విడ్డూరమని పేర్కొన్నారు. ఆదివారం సిఎల్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గురుకుల బిడ్డల భవిష్యత్తు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో రాజీపడదని స్పష్టం చేశారు. బిఆర్‌ఎస్ హయాంలో 104 కొత్త గురుకుల పాఠశాల భవనాలు నిర్మిస్తామని ప్రకటించారని, ఇందులో ఒక్క గురుకుల భవనం నిర్మించి ఉంటే తను ఏ సవాల్‌కైనా సిద్ధం' అని మంత్రి లక్ష్మణ్ కుమార్ కెటిఆర్‌కు బహిరంగ సవాల్ విసిరారు. ఇందుకు వేదిక సమయం ఎక్కడో ఆయనే చెప్పాలన్నారు. గురుకులాల సంఖ్య పెంచామని చెప్పుకోవడం తప్ప, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, శాశ్వత భవనాలు, వసతి సౌకర్యాలు కల్పించడంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

**కెటిఆర్‌ది మేనేజ్‌మెంట్ సీటు :**

ఎన్‌ఐఆర్ కోటాలో తెలంగాణలో పోటీ చేసి గెలిచిన బిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేయడం బాధ్యతారాహిత్యమన్నారు. తమకు టెండర్లు, కాంట్రాక్టర్ల లాభాలు కాదని, తెలంగాణ పేద విద్యార్థుల భవిష్యత్తు, గురుకుల బిడ్డల సంక్షేమం ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రతి రూపాయి ప్రజాధనం ఆదా చేసి తిరిగి విద్యార్థుల సంక్షేమానికే ఖర్చు చేస్తున్నామని, గురుకుల బిడ్డల కడుపు నింపే వ్యవస్థ కావాలా కాంట్రాక్టర్ల జేబులు నింపే వ్యవస్థ కావాలా తెలంగాణ ప్రజలే నిర్ణయిస్తారు' అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.

**మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం : మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునేలా మాట్లాడితే అరెస్టులు చేయరా అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించారు. సుమన్ అసలు మనిషే కాదంటూ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బిఆర్‌ఎస్ పాలనలో ఒక్క గురుకుల భవనమైనా నిర్మించారని నిరూపిస్తే తాను దేనికైనా సిద్ధమని మంత్రి సవాల్ విసిరారు. సిఎల్‌పి కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ పదేళ్లపాటు అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ ప్రభుత్వం గురుకులాల సంఖ్యను పెంచిందేగానీ, వాటికి అవసరమైన మౌలిక వసతులు కల్పించలేదని విమర్శించారు. గురుకులాలన్నీ అద్దె భవనాల్లోనే కొనసాగాయని, కొత్త భవనాల నిర్మాణంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గురుకుల విద్యార్థుల డైట్ ఛార్జీలను పెంచి, మెరుగైన వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. కెటిఆర్ రాజకీయ ప్రస్థానంపై వ్యాఖ్యానిస్తూ, ఆయన అమెరికా నుంచి వచ్చి పోటీ చేశారని, అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం స్థానిక సంస్థల ఎన్నికల నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ సిఎం స్థాయికి చేరుకున్నారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి మెరిట్‌తో సిఎం అయ్యారు అని అన్నారు. దళితబంధు పథకం ద్వారా కేవలం 38 వేల మందికి మాత్రమే లబ్ధి చేకూర్చి, రాష్ట్రంలోని దళితులు అందరికీ ఇచ్చినట్లు బిఆర్‌ఎస్ నేతలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కెసిఆర్ మీడియా సమక్షంలో అవమానించారని గుర్తుచేశారు.

## నేడు ఈహెచ్‌ఎస్‌కు ఎంప్లాయ్ హెల్త్ కేర్ ట్రస్ట్ కమిటీ ప్రకటన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువస్తున్న 'ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్' (ఈహెచ్‌ఎస్)కు ఎంప్లాయ్ హెల్త్ కేర్ ట్రస్ట్ కమిటీని సోమవారం ప్రకటించే అవకాశం ఉంది. ఎంప్లాయ్ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ఈ పథకం అమలు కానుంది. ఉద్యోగ సంఘాల నుంచి ఆరుగురు, పెన్షనర్ల నుంచి ఇద్దరు ప్రతినిధులు ఈ ట్రస్ట్ సభ్యులుగా ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి ఒకరిని ఈ ట్రస్ట్‌కు సిఈఓగా నియమిస్తారు. 'ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్' (ఈహెచ్‌ఎస్)ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించనున్నారు. ఈ పథకం అమలుకు అవసరమైన వివరాల సేకరణ ఇప్పటికే మొదలైంది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించేందుకు ఫైనాన్స్ శాఖ ఇప్పటికే అన్ని శాఖలకు సర్క్యులర్ జారీ చేసింది. మే 31లోపు డేటా అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. ఈ వివరాల ఆధారంగా డిజిటల్ హెల్త్ కార్డులు, క్యాష్‌లెస్ చికిత్స సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం తెలియజేసింది.



## యువత స్ఫూర్తి పొందేలా ప్రధాని మోదీ 'మన్ కీ బాత్'

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న 'మన్ కీ బాత్' కార్యక్రమం దేశ యువతలో సరికొత్త స్ఫూర్తిని నింపుతోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని కెవిఎంఐటి లేన్ వద్ద గల పెరిక సురేష్ నివాసంలో ఆదివారం ప్రధాని మోదీ 134వ 'మన్ కీ బాత్' ఎపిసోడ్‌ను పార్టీ ముఖ్య నేతలతో కలిసి ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రతి 'మన్ కీ బాత్' కార్యక్రమం ద్వారా దేశ ప్రగతికి, సమాజ హితానికి అవసరమైన అనేక స్ఫూర్తిదాయక విషయాలను పంచుకుంటున్నారన్నారు. అంతర్జాతీయ క్రీడా వేదికలపై మన అథ్లెట్లు కనబరుస్తున్న ప్రతిభ, వారు పడుతున్న కష్టం, సాధిస్తున్న అద్భుత రికార్డులను ప్రధాని ప్రస్తావించడం యువతకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుందని తెలిపారు. ఈ విజయాలు ప్రపంచవ్యాప్తంగా భారతదేశ సత్తాను చాటుతున్నాయన్నారు. రాజరాజ చోళుని సముద్రయాన ఘనతలను, ఆయన సాహసాలను ప్రధాని మోదీ ప్రస్తుత తరం ముందుకు తీసుకురావడం అభినందనీయమని, రాంచందర్ రావు అన్నారు. ప్రస్తుత వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రధాని సూచించినట్లు తెలిపారు. 'మన్ కీ బాత్' ప్రతి ఎపిసోడ్ సరికొత్త సమాచారాన్ని, దేశభక్తిని అందిస్తుందని, కాబట్టి దేశ యువత అంతా ఈ కార్యక్రమాన్ని తప్పక వీక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి భరత్, ప్రసాద్ పాల్గొన్నారు.



## రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

### గాంధీభవన్‌లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. ఇందిరాభవన్‌లో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇంచార్జ్ సయ్యద్ ఖాలీద్ అహ్మద్, సహ ఇంచార్జ్‌లు రోషిని కుషాల్ జైస్వాల్, కేఆర్ భవ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా నీట్ పేపర్ లీకేజీ, పెట్రోల్ ధరల పెంపు వంటి అంశాలపై నిరసనలు కొనసాగిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా జూన్ 3న అచ్చంపేటలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## రైతు డిస్కంకు అనుమతి ఇవ్వొద్దు

### టిఆర్‌ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** డిస్కం పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొత్త డిస్కంలను ఏర్పాటు చేసి, మిగతా రెండు డిస్కంలను ప్రైవేట్ పరం చేసేందుకు కుట్రకు పాల్పడుతోందని తెలంగాణ రక్షణ సేన (టిఆర్‌ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. రైతులకు నష్టం చేసే రైతు డిస్కంకు ఇఆర్‌సి ఎట్టి పరిస్థితుల్లో అనుమతి ఇవ్వకూడదని కోరారు. ఈ విషయంలో అవసరమైతే సుప్రీం కోర్టుకైనా వెళ్లి అడ్డుకుంటామని తెలిపారు. హైదరాబాద్‌లోని టిఆర్‌ఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అన్ని చర్యలు కూడా రైతులకు వ్యతిరేకంగానే ఉన్నాయని ఆరోపించారు. కొత్త డిస్కంలో రైతులు వినియోగదారులుగా ఉంటారని, అందుకే ఇఆర్‌సి వారి అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. మొత్తం 33 జిల్లాల్లో ప్రజా అభిప్రాయ సేకరణ చేపట్టాలన్నారు. విద్యుత్ సంస్కరణల పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు పలుకుతోందని కవిత మండిపడ్డారు. పాలమూరు ప్రాజెక్టుకు సంబంధించి పనులను వేగవంతం చేయాలని, ఈ అంశంలో తాము పదే పదే ప్రశ్నించడంతో సిఎం సమీక్ష నిర్వహిస్తానని చెప్పారని కవిత గుర్తు చేశారు. దసరాలోపు పాలమూరు ప్రాజెక్ట్‌లో భాగంగా లక్ష్మీ దేవిపల్లిలో రిజర్వాయర్ పనులను ప్రారంభించాలన్నారు.

## నేడు సన్నాయి వాయిద్యాలతో నిరసన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోని దేవాలయాలలో తెలంగాణ చిన్న సన్నాయి వాయిద్య కళాకారులనే నియమించాలని తెలంగాణ సన్నాయిల కుల సంఘం అధ్యక్షులు వేముల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కోమండ్ల మనోహర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ దేవాలయాలలో సన్నాయి కులస్థులకు 10 శాతం ఉద్యోగాల రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ నేడు(సోమవారం) అబిడ్స్ బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ కార్యాలయం ముందు తమ సన్నాయి వాయిద్యాలతో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన వాయిద్యకారులు తెలంగాణ ప్రాంతానికి చెందినట్టు సర్టిఫికెట్లు సృష్టించి, తాము ఈ ప్రాంతం వారమని మోసం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేవాదాయ అధికారులకు తెలిసి కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తూ ఆంధ్ర వాయిద్యకారులను ఇంటర్వ్యూలకు ఆహ్వానిస్తున్నారని వారు మండిపడ్డారు. తెలంగాణ ప్రాంతంలో 100 సంవత్సరాల పైబడి దేవాలయాలలో చిన్న సన్నాయి వృత్తితో జీవనం సాగిస్తున్నామని, తెలంగాణ ప్రాంత దేవాలయాలలో పురాతన ఆచార పద్ధతులలో మేలుకొలుపు నుండి పవలింపు సేవ వరకు సన్నాయి వాయిద్యంతో భగవంతునికి సేవలు చేశామని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం దేవాలయలలో డిప్లొమా సర్టిఫికెట్లను అడుగుతూ డిప్లొమా లేని తమ కులస్తులను దేవాలయాల నుండి తొలగిస్తున్నారని, పూర్వం నుండి సన్నాయి వాయిద్యం తమకు కుల కళగా తరతరాల నుండి తమ పూర్వీకులే గురువులుగా వస్తున్నారన్నారు.

## హరీష్‌రావువి చిల్లర రాజకీయాలు

### ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ తీవ్ర విమర్శలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ మాజీ మంత్రి టి హరీష్ రావుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజకీయంగా హరీష్ రావు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం సిద్దిపేటలోనే హరీష్‌రావును చిల్లర రావుగా పిలుస్తున్నారని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ నేతలను కలిశారా లేదా అన్న అంశంపై హరీష్‌రావు స్పష్టంగా సమాధానం చెప్పడం లేదని దయాకర్ విమర్శించారు. రాజకీయ భవిష్యత్తు కోసం హరీష్‌రావు బిజెపి వైపు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అలాగే, కెటిఆర్‌ను పార్టీ నాయకుడిగా ముందుకు తీసుకురావడంతో బిఆర్‌ఎస్‌లో హరీష్‌రావు పాత్ర గందరగోళంగా మారిందన్నారు. కెటిఆర్, కవిత పార్టీలోకి వచ్చిన తర్వాత హరీష్‌రావు పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని వ్యాఖ్యానించారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డిని కలిసినప్పుడే హరీష్ రావు కాంగ్రెస్‌లో చేరేందుకు మానసికంగా సిద్ధమయ్యారని దయాకర్ పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్‌లో చేరలేకపోవడంతో ప్రస్తుతం బిజెపి వైపు చూస్తున్నారని ఆరోపించారు. ఇక మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు హరీష్‌రావు రాజకీయ ధోరణి పూర్తిగా తెలుసునని, అలాగే కెసిఆర్ వ్యవహారాలపై హరీష్‌రావుకూ పూర్తి అవగాహన ఉందని వ్యాఖ్యానించారు. అందుకే ఇద్దరూ ఒకరినొకరు వదలడం లేదన్నారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలకు హరీష్‌రావు సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారని, అందుకే చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని అద్దంకి దయాకర్ విమర్శించారు.

## కిషన్ రెడ్డివి తప్పుడు ఆరోపణలు

### ప్రభుత్వ విప్ వేముల వీరేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని ప్రభుత్వ విప్ వేముల వీరేశం తెలిపారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ధాన్యం కొనుగోళ్లపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఆదివారం సిఎల్‌పి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, తెలంగాణలో పరిమితంగా కొనుగోళు చేయడం అక్షేపనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఇందుకు కొనుగోలు కేంద్రాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని, ప్రస్తుత ప్రభుత్వం వాటిపై చర్యలు తీసుకుని బాధ్యులపై కేసులు నమోదు చేసిందని తెలిపారు. బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు రాజకీయ ప్రయోజనాల కోసం రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రైతులు కేంద్ర ప్రభుత్వ వివక్షను ప్రశ్నిస్తున్నారని, ఇందుకు సమాధానం చెప్పాలని వీరేశం డిమాండ్ చేశారు.

## డిస్కంను ఉపసంహరించుకోవాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన మూడో డిస్కం (కిసాన్ డిస్కాం) వల్ల వినియోగదారులపై అదనపు ఆర్థిక భారం పడే ప్రమాదం ఉందని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. మూడో డిస్కంకు ఆదాయ వనరులు లేకపోయినా భారీ అప్పులు, సబ్సిడీ భారం కేటాయించారని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో పెరుగుతున్న ఖర్చులు, కేంద్రం ప్రతిపాదిస్తున్న విద్యుత్ చట్ట సవరణల వల్ల వినియోగదారులపై మరింత భారం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మూడో డిస్కంను రద్దు చేసి విద్యుత్ పంపిణీ బాధ్యతలను ప్రస్తుత వ్యవస్థ ద్వారానే కొనసాగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## వ్యవసాయ విద్యుత్ సరఫరాపై కెటిఆర్ తప్పుడు ప్రచారం : ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయ విద్యుత్ సరఫరా అంశంపై బిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ సరిపోతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ఆదివారం సిఎల్‌పి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి మాటలను వక్రీకరించి రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ అందించడం కాంగ్రెస్ పార్టీ విధానమని, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేశారని గుర్తు చేశారు. రైతును రాజుగా చూడాలనే ఆలోచనతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేశామని కేటీఆర్ చెబుతున్నారని, అయితే వాస్తవానికి అంత స్థాయిలో విద్యుత్ అందించలేదని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రత్యేక రైతు డిస్కంను ఏర్పాటు చేశామని, దీనిపై బిఆర్‌ఎస్ నేతలు రాజకీయ దురుద్దేశంతో విమర్శలు చేయడం తగదన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు అమర్చబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే స్పష్టంగా ప్రకటించారని, మీటర్లు పెడితే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోమని కూడా సవాల్ విసిరారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం మీటర్లు పెట్టకపోతే వచ్చే ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పోటీ చేయదా అన్న ముఖ్యమంత్రి విసిన సవాల్‌ను కెటిఆర్ ఎందుకు స్వీకరించడం లేదని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు.

తెలంగాణ ప్రభుత్వం
**సాగునీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ**

'హైదరాబాద్‌లోని జలసౌధ భవనం ఎర్రమంజిల్ లోని 2026-27 సంవత్సరానికి విద్యుత్ పనుల నిర్వహణ కోసం వార్షిక నిర్వహణ అంచనా' (2nd call) అనే పని కోసం టెండర్లను ఆహ్వానించారు. **టెండర్ నోటీసు నెం.12/2025-26**, తేదీ: 10.03.2026, **ECV తో:** రూ. 4607799/-. **బిడ్ల స్వీకరణకు చివరి తేదీ & సమయం తేదీ:** 17.06.2026 ఉదయం 11:00 గంటల వరకు.

**గమనిక:** మిగతా వివరముల కొరకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.

V.Srinivas Sd/- 30.05.2026
పర్యవేక్షక అభియంత, I&CADD,
ఇరిగేషన్ సర్కిల్, హైదరాబాద్, రెడ్ హిల్స్, హైదరాబాద్.
ఫోన్ : 040-23394218

DIPR R.O. No. : 3286-PP/CL/ADVT/2026-27, Date: 30-05-2026

## చివరి దశలో ఉన్న వడ్లను వెంటనే తరలించాలి

ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సిపిఐ బృందం



**ప్రజాపక్షం / నల్లబెల్లి :**వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని రాంపూర్ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో చివరి దశలో 20 మంది రైతుల ధాన్యాన్ని వెంటనే తరలించాలని సిపిఐ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు చింతకింది కుమారస్వామి డిమాండ్ చేశారు . ఆదివారం రాంపూర్ గ్రామంలో రైతుల కోరిక మేరకు సిపిఐ పార్టీ బృందం ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు . ఈ సందర్భంగా చింతకింది కుమారస్వామి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో కాంటలు అయినప్పటికి కొన్ని రోజులుగా నాలుగు లారీలకు సరి పడ ధాన్యం ఉన్నప్పటికి నిర్వాహకులు తరలించడం లేదని వాపోయరు . నర్సంపేట మండలంలోని రాజుపేట గ్రామ హేమలత రైస్ మిల్లు ,నల్లబెల్లి మండలంలోని భార్గవి రైసు మిల్లులకే మాత్రమే ప్రభుత్వం కేటాయించడంతో ధాన్యం దిగుమతి చేసుకోవాడానికి స్థలం లేదని సాకులు చెబుతున్నట్లు మా దృష్టికి వచ్చిందని చెప్పారు . ఈ రెండు మిల్లులకే ధాన్యం దిగుమతికి అనుమతి ఇచ్చి జిల్లా అధికారులు పర్యవేక్షణ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు . ఈ కార్యక్రమంలో సిపిఐ మండల పార్టీ కార్యదర్శి బట్లు సాంబయ్య ,రైతు సంఘం మండల కార్యదర్శిమామిండ్ల పెద్ద అయిలయ్య ,మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు .

## శాంతి భద్రతల పరిరక్షణలో సిసి కెమెరాల పాత్ర కీలకం



**ప్రజాపక్షం/రాయపర్తి:**శాంతి భద్రతల పరిరక్షణలో సిసి కెమెరాల పాత్ర కీలకమని రాయపర్తి ఎస్ఐ ముత్యం రాజేందర్ అన్నారు. మండలంలోని కాట్రపల్లి గ్రామలో సర్పంచ్ రాపాక పద్మ బ్రహ్మచారి ఆధ్వర్యంలో నేరాలు శాంతి భద్రతల పరిరక్షణ అవగాహన సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఐ ముత్యం రాజేందర్ పాల్గొని మాట్లాడుతూ ఒక్క సిసి కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, ప్రజలకు భద్రత కల్పించడంలో పోలీసు వ్యవస్థ ఎంత ప్రాధాన్యమిస్తుందో అటువంటి వ్యవస్థకు సహకరించడంలో సిసి కెమెరాలు పాత్ర కూడా అంతే ఉంటుందన్నారు. గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ చొరవ తీసుకోవాలని సిసి కెమెరాలు ఏర్పాటులో ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, వ్యాపారవేత్తలు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని, ఏదైనా నేరం జరిగినప్పుడు చేధించడానికి సులువుగా ఉంటుందని సిసి కెమెరాలను మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తామని అన్నారు. కాట్రపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంలో తీర్చిదిద్దుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ,గ్రామ ప్రజలు, రైతులు, గ్రామ యువకులు, హార్వెస్టర్ యూనియన్ సభ్యులు, ఆటో యూనియన్ సభ్యులు, ట్రాక్టర్ యూనియన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన జెండా ఆవిష్కరించనున్న ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/భూపాలపల్లి :**జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నిర్వహించే అధికారిక కార్యక్రమంలో ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర శనివారం అతిథులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుండగా జిల్లాలో జరిగే ప్రధాన కార్యక్రమానికి యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

## సరస్వతీ అంత్య పుష్కరాలకు పోటెత్తిన భక్తులు: ఎస్‌పి



**ప్రజాపక్షం/భూపాలపల్లి/కాలేశ్వరం :**సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా కాలేశ్వరానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చిన నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట భద్రతా, ట్రాఫిక్ ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని జిల్లా ఎస్‌పి సిరిసెట్టి సంకీర్త్ తెలిపారు.ఈ సందర్భంగా దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూ లైన్లలోని భక్తులను ఎస్‌పి సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్ పర్యవేక్షించడం జరిగింది. పుష్కర ఘాట్, త్రివేణి సంగమం వద్ద భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ఎస్‌పి సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్ స్వయంగా డ్రోన్ సహాయంతో పరిస్థితిని పర్యవేక్షించి భక్తుల సంఖ్యను అంచనా వేయడం జరిగింది. భక్తుల వాహనాలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడం జరిగిందన్నారు. భక్తులు సురక్షితంగా పుష్కర స్నానాలు ఆచరించేలా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ అవసరమైన సూచనలు అందించడం జరిగింది.

## సర్వాయి పాపన్న గౌడ్ జంక్షన్ నుండి బీమారంవెళ్లే దారిలో వీధిలైట్లు ఏర్పాటు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ జిల్లా గోపాలపురం నుండి బీమారం కు వెళ్లే రహదారిలో సర్వాయి పాపన్న గౌడ్ జంక్షన్ నుండి అరుణోదయ కాలనీ నాలుగు వరకు వీధిలైట్లు లేకపోవడం వల్ల చీకటిగా ఉండి ఆ మార్గం గుండా ప్రయాణించేవారు భయభ్రాంతులకు గురి అవుతున్నారని తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీష్ రెడ్డి అన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా గతంలో ఉన్న స్తంభాలను తొలగించి విద్యుత్ శాఖ, నగరపాలక సంస్థ అధికారులు కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారని ఆ స్తంభాలకు రెండు వైపులా వీధి లైట్లు లేకపోవడం మూలాన చీకటిగా ఉంటుందని ముఖ్యంగా ఉదయం పూట వాకింగ్ కి,వేరే పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అదేవిధంగా కుక్కలు రోడ్లపైనే చీకటిలో ఉండడం జరుగుతుందని కావున సంబంధిత అధికారులు తక్షణమే సర్వాయి పాపన్న గౌడ్ జంక్షన్ నుండి భీమారం వెళ్లే దారిలో అరుణోదయ కాలనీ వరకు రెండు వైపులా పెద్ద హైమాస్ లైట్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ అధికారులు విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేసేలా కృషి చేయాలని సతీష్ రెడ్డి తెలిపారు.

# త్రివేణి సంగమ తీరం... భక్త జన తరంగం

### నేటితో ముగియనున్న సరస్వతీ అంత్య పుష్కరాలు



**ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం:**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ళేశ్వరం క్షేత్రంలో కొనసాగుతున్న సరస్వతీ అంత్య పుష్కరాలు ఆదివారం 11 రోజుకు చేరుకోగా సోమవారంతోముగియనున్నాయి. సరస్వతీ పుష్కరాలు ముగియనున్న నేపథ్యంలో ఆదివారం కాళేశ్వరం క్షేత్రానికి తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, చత్తీస్‌గడ్ వివిధ ప్రాంతాల నుండి మండుటెండలను సైతం లెక్క చేయకుండా భారీ సంఖ్యలో భక్తులు పోటెత్తారు .త్రివేణి సంగమ సరస్వతీ నదిలో పుష్కర పుణ్య స్నానాలు ఆచరించేందుకు భారీ ఎత్తున తరలివచ్చిన భక్తుల తాకిడి పెరిగి త్రివేణి సంగమ తీరం భక్తజన తరంగంలా మారింది. తీర ప్రాంతంలో ఇసుక వేస్తే రాలనంతగా భక్త జన సందడిగా మారి తీరంలో భక్తులు పష్కర స్నానాలతో పులకించిపోయారు. పుష్కరాల సందర్భంగా త్రివేణి సంగమ తీరంలో పుష్కర పుణ్య స్నానాలతో పాటు తీర్థ విధులకు ప్రాధాన్యత ఏర్పడగా తీరం వద్ద భక్తులు తమ పితృ దేవతలు , పూర్వీకుల పేరున పిండప్రధానాలు ఆచరించారు. మరోవైపు గాజులు, వస్త్రం, పసుపు, కుంకుమలతో కలిపి ఏర్పాటు చేసిన అరటి బెరడులో ఉంచిన వత్తులతో దీపాలు వెలిగించి భక్తి ప్రపత్తులతో నదీ మాతల్లికి సమర్పించి త్రివేణి సంగమ సరస్వతి తీరంలో వదిలి మొక్కులుచెల్లించుకున్నారు. 12 ఏండ్లకొకసారి వచ్చే పుష్కరాల సందర్భంగా నది ఒడిలో పుష్కర స్నానం ఆచరిస్తే పాప విమోచనం, పుణ్య ఫల ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం, హరహర మహాదేవ నామ స్మరణతో త్రివేణి సంగమ తీరం పరిసరాలు భక్తుల ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర ఆలయానికి భక్త జనం తాకిడి భారీగా పెరిగి ఆలయ ప్రాంగణాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామి వారిని దర్శించుకునేందుకు రూ.300ల ప్రత్యేక దర్శనాలతో పాటు రూ.100 ప్రత్యేక దర్శనాలకు భక్తుల సందడి నెలకొనగా సర్వ దర్శనం క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడి బారులు తీరాయి. స్వామి వారి దర్శనం కోసం భక్తులు చాలా సమయం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. త్రివేణి సంగమ తీరంలో సుమారు లక్ష మంది భక్తులు పుష్కర పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.కాళేశ్వరం క్షేత్రంలో కొనసాగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలలో భాగంగా ఆదివారం మెదక్ జిల్లా కొల్చారంకు చెందిన శ్రీ మాధవానంద సరస్వతి స్వామి త్రివేణి సంగమ సరస్వతి నదిలో వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య సరస్వతీ నదీమాతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కర పుణ్యస్నానం ఆచరించారు. సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా జెన్‌కోసిఎండి కృష్ణ భాస్కర్ ఆదివారం కాళేశ్వరం క్షేత్రాన్ని సందర్శించి త్రివేణి సంగమ సరస్వతి తీరంలో పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ శర్మ, ధర్మకర్తలు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలి: మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు:**పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. ములుగు మండలంలోని ఇంచర్ల ఎంఆర్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా స్థాయి ముఖ్య నాయకుల సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) ముఖ్య అతిథిగా హాజరై నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. సమావేశం లో మంత్రి సీతక్క మాట్లాడుతూ పార్టీలోని ప్రతి నాయకుడు త మ పరిధిలో నిబద్ధతతో కష్టపడి పని చేయాలని సూచించారు. పార్టీ కోసం శ్రమించే ప్రతి ఒక్కరికి సరైన సమయంలో తగిన గుర్తింపు, గౌరవం తప్పక లభిస్తుందని మంత్రి భరోసా ఇచ్చా రు. ఎన్నికలు, పార్టీ నిర్మాణంలో బూత్ ఏజెంట్ల వ్యవస్థ చాలా కీలకమైందని తెలిపారు. వారు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించి పార్టీ బలోపేతారికి విశేష కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ సంక్షేమాభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో ప్రతి గడపకు తీసుకెళ్ళాల్సిన బాధ్యత నాయకులపైనే ఉందని స్పష్టం చేశారు. పార్టీ అభివృద్ధి కోసం పాత, కొత్త నాయకులు, కార్యకర్తలు అందరూ సమన్వయంతో ఒకే తాటిపై నడిచి ములుగు జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేయాలని ఆమె ఉద్భోదించారు. ఈ ప్రతిష్టాత్మక స మావేశంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల స్థాయి నాయకులు, డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నూతన ఆడియో సిస్టమ్‌ను ప్రారంభించిన మంత్రి సురేఖ



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ జిల్లా క్రిస్టియన్ కాలనీలోని సెంటెనరీ బాప్టిస్ట్ చర్చ్‌లో నూ తన ఆడియో సిస్టమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పా ల్గొన్నారు. తన భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావుతో కలిసి మంత్రి సురేఖ నూతన ఆ డియో సిస్టమ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాని కి ముఖ్య అతిథిగా వచ్చిన మంత్రికి క్రిస్టియన్ మత పెద్దలు, అభిమానులు సాదర స్వాగతం పలికారు. కొండా మురళీధర్ రావు, సురేఖ దంపతులను ఈ సందర్భంగా క్రిస్టియన్ మతపెద్దలు స న్మానించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, చర్చ్‌ని అద్భుతంగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. ఏసుప్రభువు కృపతో చర్చ్ అభివృద్ధిలో పాలుపంచుకునే భాగ్యం తనకు దక్కింద ని మంత్రి సురేఖ అన్నారు. సన్మార్గంలో పయనిం చి జీవితానికి సరైన అర్థాన్ని ఆపాదించుకోవాలని ఈ సందర్భంగా మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. క్రిస్టియన్ మైనారిటీల సర్వతో ముఖాభివృద్ధికి ము ఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని మంత్రి తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చర్చిల నిర్మాణానికి మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. క్రైస్తవుల సంక్షేమం కోసం తన వంతు పూర్తి సహకారం ఉంటుందని ఏ ఆపద వచ్చిన అండగా ఉంటామని ఈ సందర్భంగా మంత్రి సురేఖ తెలిపారు.

## ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 'సర్' ప్రక్రియ ప్రారంభం

**ప్రజాపక్షం/ నర్సంపేట :** రాష్ట్రంలో జూన్ 25 నుంచి చేపట్టబోయే ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ ప్రక్రియ పట్ల పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని, ఏ ఒక్క పౌరుడు తన ఓటు హక్కును కోల్పోకుండా చూడాలని తెలంగాణ జన సమితి పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు షేక్ జావిద్ పిలుపునిచ్చారు . నర్సంపేట పట్టణంలోని ముస్లిం షాదిఖానా లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్‌పై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ ఇన్స్పెక్టర్, సూపర్వైజర్, వార్డుల వారిగా బిఎల్‌ఓలు పాల్గొని ఎస్ఐఆర్‌లో భాగంగా మ్యాపింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 2002 లో ఓటర్ లిస్టులో పేర్లను చూసుకొని మ్యాపింగ్ నిర్వహించారు. 2002లో పేర్లు లేని వారికి తల్లిదండ్రుల పేర్లతో మ్యాపింగ్ జరిపిస్తూ ప్రజలకు భరోసా కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 25 నుంచి ఇంటింటా తిరిగి సర్ సర్వే జరుపుతారని, అంటే కేవలం ముస్లిం ఓట్ల తొలగిస్తారని ప్రజలు భ్రమలో ఉండవద్దని, అన్ని వర్గాల ప్రజలకు సర్వే జరుగుతుందన్నారు. 40 సంవత్సరాల పై ఉన్న ఓటర్ 2002 లిస్ట్ ప్రకారం మ్యాపింగ్ జరుగుతుందని, 40 సంవత్సరాలు, 20 సంవత్సరాల వరకు 20సంవత్సరాల నుంచి తక్కువ వరకు జూన్ 25 నుంచి ఇంటింటా సర్వే లో సంబంధించిన దరఖాస్తు ఫారాలు ఇస్తారని ఆ ఫామ్ లో సంబంధించిన సమాచారాన్ని తెలపాలన్నారు. సర్ సర్వే తో ప్రజలు భయ ఆందోళనకు గురి కావద్దని, మరింత సమాచారాన్ని తెలుసుకోవడానికి ఎస్ఐఆర్ కార్యక్రమం జరిపించుకొనుటకు స్థానిక తహసీల్‌కార్యాలయానిన సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జామా మజీద్ కమిటీ అధ్యక్షులు మీర్జా మసూద్ అలీబేగ్, ప్రధాన కార్యదర్శి యాకూబ్ పాషా, రీయాజ్ కమిటీ సభ్యులు స్థానిక కౌన్సిలర్ సలావుద్దీన్ అయ్యూబ్, సూపర్వైజర్ ఆర్ఐ యూసుఫ్ అలీ, బిఎల్ఓ లు కాసాని పద్మ, రామగిరి మాధవి, రమ, చైతన్య, అనురాధ, నాయిని సతీష్, సునీత తదితరులు పాల్గొన్నారు

## తెలియని వ్యక్తుల వద్ద విత్తనాలు కొనొద్దు

గూడూరు మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్

**ప్రజాపక్షం/గూడూరు;** ఖరీఫ్ సీజన్ ప్రార ంభం నేపథ్యంలో రైతులు విత్తనాల కొనుగో లు విషయంలో అప్రమత్తంగా ఉండాలని గూడూరు మండల వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ మాలిక్ సూచించారు.ఆదివా రం గూడూరు మండల కేంద్రంలో ప్రజాపక్షంతో మాట్లాడుతూ రైతులు గ్రామాలకు వచ్చి అమ్మే తెలియని వ్యక్తుల వద్ద నుంచి విత్తనాలు కొనుగోలు చేయవద్దని ప్రభుత్వ అనుమతి పొందిన గుర్తింపు ఉన్న వ్యవసా య దుకాణాల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు.విత్తనాలు కొనుగో లు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు లే దా రసీదు తీసుకోవాలని ఆ రసీదును పం ట కోత్త పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని తెలిపారు.విత్తనాల నాణ్యతో ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు లేదా మొల క శాతం తక్కువగా ఉన్నప్పుడు రైతులకు న్యాయం జరిగేందుకు రసీదే ప్రధాన ఆధారంగా ఉపయోగపడుతుందని వివరించా రు.రసీదు లేకుంటే సంబంధిత సంస్థలపై చర్యలు తీసుకోవడం కష్టమవుతుందని పేర్కొన్నారు.మార్కెట్ డిమాండ్ దిగుబడులు ఖ ర్చులను పరిగణనలోకి తీసుకొని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు.అదేవిధంగా భూసారాన్ని కాపాడుకోవడం రైతు ల బాధ్యత అని పేర్కొన్నారు.మొక్కజొన్న వ రి తదితర పంటల కోత అనంతరం మిగిలే కాండాలు అవశేషాలను పొలాల్లో కాల్చివేయడం వల్ల భూమిలోని సేంద్రియ పదార్థా లు సూక్ష్మ జీవులు నశిస్తాయని చెప్పా రు.దీ ంతో భూసారం క్రమంగా తగ్గిపోవడంతో పాటు భవిష్యత్తులో పంట దిగుబడులపై ప్ర తికూల ప్రభావం పడుతుందని వివరించా రు.పంట అవశేషాలను కాల్చకుండా భూ మిలో కలపడం సేంద్రియ ఎరువుల తయారీలో వినియోగించడం లేదా పశువుల మే తగా ఉపయోగించడం ద్వారా భూమి సారవంతతను పెంచుకోవచ్చని తెలిపారు .రైతు లు మట్టి పరీక్షలు చేయించుకుని భూసార నివేదికలు ఆధారంగా ఎరువుల వినియో గం చేపట్టాలని సూచించారు.వ్యవసాయ ర ంగంలో నకిలీ విత్తనాలు నాసిరకం ఎరువు ల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏవైనా అనుమానాలు ఉంటే వెంటనే వ్యవ సాయ శాఖ అధికారులను సంప్రదించాలని రైతులకు పిలుపునిచ్చారు.నాణ్యమైన విత్తనాలు శాస్త్రీయ సాగు పద్ధతులు భూసార పరిరక్షణతోనే రైతులు అధిక దిగుబడులు సా ధించి ఆర్థికంగా బలోపేతం కావచ్చని మం డల వ్యవసాయ అధికారి పేర్కొన్నారు.

## హమాలీల కూలి రేట్లు పెంచాలి

ఎఐటియుసి సివిల్ సప్లై హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మునీశ్వర్



**ప్రజాపక్షం/ నర్సంపేట :** హమాలీల కూలి రేట్లు పెంచాలని, నాలుగో తరగతి ఉద్యోగస్తులుగా గుర్తించాలని ఎఐటియుసి సివిల్ సప్లయిహమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ అన్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ సప్లయి హమాలీ కార్మికుల జీవనోపాధిలో నిత్య అవసర సరుకుల ధరలు పెరుగుతున్నాయని, కాని కార్మికుల వేతనాలు మాత్రం పెంచడంలేదని, దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. తక్షణమే హమాలి కార్మికుల వేతనం పెంచాలని, వారిని నాలుగో తరగతి ఉద్యోగస్తులుగా నియమించాలని డిమాండ్ చేశారు. సివిల్ సప్లయ్ హమాలీలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వేరువేరుగా వేరు వేరు తేదీలలో హమాలీలకు చెల్లిస్తున్నందున హమాలీ కార్మికులకు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏ నెలకు ఆ నెల హమాలీ రే ట్ల బిల్లును చెల్లించాలి, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లు క్వింటాల్‌కు రూ.40/లకు పెంచాలి, 350కిలోల బెల్స్ బ ండల్ ఒక్కటికి ఎగుమతి, దిగుమతికి రూ.200/లకు పెంచాలి, దసరా పండుగ సందర్భంగా ఇచ్చే స్వీటు, రూ.1200లు చెల్లించాలి, ఇఎస్ఐ వైద్య సౌకర్యం కల్పించాలి, హమాలీ కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి, బోనస్ రూ.10,000/లు చెల్లించాలి, అన్ని గోడౌన్లలో పనిచేస్తున్న స్వీపర్లకు కనీస వేతనం నెలకు రూ.12 వేలు ఇవ్వాలి, రిటరైన హమాలీ కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్ చెల్లించేలా కార్పొరేషన్ తగిన చర్యలు తీసుకోవాలి, అర్హులైన హమాలీ కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా నియమించాలి. యూ నిఫాం కుట్టు కూలి రూ.2వేలు చెల్లించాలి, గోడౌన్లలో కార్మికుల అవసరాన్ని ఆధారంగా కార్మికులను నియమించుకునే అవకాశం హ మాలీలకే ఉండాలని, సొంత గోడౌన్లు లేని అ న్ని మండలాల పాయింట్లలలో వెంటనే సొం త గోడౌన్లు స్థలాన్ని ఆయా జిల్లా కలెక్టర్, జా యింట్ కలెక్టర్, తహసీల్దారులు గుర్తించి, నూ తన గోడౌన్ల నిర్మాణం చేయాలి. స్వీపర్లకు బ్లౌ జుల కుట్టుకూలి రూ.500లు చెల్లించాలి అని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

## సమీకృత జిల్లా కార్యాలయం పనులు పూర్తి

కలెక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/ వరంగల్ :**సమీకృత జిల్లా కార్యాలయం పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సత్య శారద అన్నారు. ఆదివారం ఉదయం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఓ సిటీ లో నిర్మాణం లో ఉన్న జిల్లా సమీకృత కార్యాలయ సముదాయాన్ని సందర్శించారు. ఈ సందర్శనకు వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్, సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు. అనంతరం సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లను నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని, త్వర లో అందుబాటులోకి రానున్న సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయాన్ని మొక్క లు, కొన్ని అందమైన చెట్లును నాటి సుందరీకరణగా తీర్చిదిద్దాలన్నారు.

## 'రుద్రమ' బ్రాండ్‌తో మహిళా ఆత్మగౌరవానికి కొత్త అధ్యాయం

స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ మినీ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ ప్రారంభం

పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ :** నిజాయితీ నిబద్ధత పెట్టుబడిగా పరకాల ఇందిరా మహిళ పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ ఏర్పడుతుందని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా దామెర మండలం ల్యాదేళ్ల గ్రామంలో మహిళా శక్తి వారోత్సవాల సందర్భంగా పరకాల స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ మినీ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ ప్రారంభోత్సవం, ఎస్ హెచ్ జి వివో, వర్క్ షెడ్, జిఎం డైరీ, సమావేశ మందిరము భవనములకు వీ హబ్ సిఇఒ సీతా పల్లాచోళ్లతో కలిసి పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు.అనంతరం మహిళా సమైక్య సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ...ల్యాదల్లలో రుద్రమ బ్రాండ్‌తో తెలంగాణ మహిళా ఆత్మగౌరవం పేరుతో ఫు డ్ ప్రాసెసింగ్ యూనిట్ పరకాల స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ మినీ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌ను ప్రారంభించుకోవడం గర్వకారణంగా ఉంది అన్నారు.ఈ ల్యాదల్లలో డైరీ ఎప్పుడు ఎప్పుడు ప్రారంభిస్తామనీ ఎదురు చూసిన రోజు నెరవేరిందన్నారు.రుద్రమ బ్రాండ్‌తెలంగాణ మహిళల ఆర్థిక స్వావలంబన ఆత్మగౌరవం పెంచుతుంది .ల్యాదల్ల గ్రామంలో మహిళల కోసం ప్రత్యేకంగా స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ మినీ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ ఏ ర్పాటు చేయబడింది. స్థానిక యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు క ల్పించేందుకు జిల్లా యంత్రాంగం, వీహబ్ ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నదని అ న్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు నైపుణ్యాభివృ ద్ధి శిక్షణ ఇ వ్వడం, స్థానికంగా చిన్న తరహా తయారీ యూనిట్లలో ఉపాధి అవకాశాలు కల్పించడం ముఖ్య ఉద్దేశం అన్నారు.ఈ ప్రాజెక్టును వీ హబ్ (తెలంగాణ మహిళా పారిశ్రామికవేత్తల హబ్), స్థానిక జిల్లా యం త్రాంగం సంయుక్తంగా నిర్వహిస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న మహిళా శక్తి వారోత్సవాల సందర్భంగా ప్రారంభించుకోవడం సంతోషకరంగా ఉందన్నారు.మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారతకు ప్రతీకగా నిలుస్తున్నాయి అని అన్నారు. స్వయం సహాయక సంఘాలను పటిష్టం చేయడం, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యం అన్నారు.వి హబ్ ను, జిల్లా యంత్రాగాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు.మా బాధ్యతలను మేము నిర్వర్తించామని, ఇక్కడ ఇచ్చే శిక్షణతో నాణ్యతతో కూడిన ఉత్పత్తులను తయారుచేసి రుద్రమ బ్రాండుకు దేశవ్యాప్తంగా పేరు తెచ్చేలా మహిళలు తేవాలని మా నమ్మకాన్ని నిలబెట్టాలని అన్నారు.మహిళా సోదరిమణులలో కమిట్‌మెంట్‌తో పనిచేసే శక్తి ఉన్నదని అన్నారు.ఎన్ని అడ్డంకులు వచ్చినా వీరోచితం పోరాడిన రాణి రుద్రమ చరిత్రను తిరగరాసేలా ఇక్కడ తయారు చేసే ఉత్పత్తులకు రుద్రమ పేరు పెట్టడం మంచి పరిణామం అని అన్నారు.అభివృద్ధికి కావలసిన సౌకర్యాలు తాను కల్పిస్తానని మీరు మార్కెటింగ్ పెరిగేలా కృషి చేయాలని మహిళల ఆర్థిక కృషి చేయాలని వీ హబ్ నిర్వాహకులను కోరారు.నిజాయితీ నిబద్ధత పెట్టుబడిగా పరకాల ఇందిరా మహిళ పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

# ఛాంపియన్‌లీగ్ వేడుకల్లో హింస

### 800 మంది అరెస్ట్
### వాహనాలు దగ్ధం, పోలీసులకు గాయాలు



**పారిస్ :** పారిస్‌లో జరిగిన ఛాంపియన్స్ లీగ్ పోటీల్లో వరుసగా రెండోసారి కూడా పారిస్ సెయింట్ జర్మైన్ (పిఎస్‌జి) విజయం సాధించడంతో వేలాదిమంది ఫుట్‌బాల్ అభిమానులు ఆనందం పట్టలేక ఫ్రాన్స్ దేశవ్యాప్తంగా వీధుల్లో నాట్యాలు చేశారు. వీరంగం సృష్టించడంతో చివరకు ఈ సెలబ్రేషన్స్ హింసాత్మకంగా మారాయి. ఈ హింసలో 219 మంది గాయపడ్డారు. వీరిలో అనేకమంది పోలీసులు ఉన్నారు. దీంతో పోలీసులు వందలమందిని అరెస్టు చేశారు. ఫుట్‌బాల్ అభిమానులను పారిస్ వీధుల్లో ఆరు వాహనాలను, రెండు వ్యాపార దుకాణాలను, ఒక బస్ షెల్టర్‌ను కూడా ధ్వంసం చేశారని ఫ్రాన్స్ హోంశాఖా మంత్రి లారెంట్ నూనెజ్ చెప్పారు. మొత్తంగా చూస్తే చివరకు 800 మంది అల్లరిమూకలను ఫ్రాన్స్‌వ్యాప్తంగా అరెస్టుచేశామని, వీరిలో 480 మందిని ఒక్క పారిస్‌లోనే అరెస్టు చేశామని, వీరిలో 82 మంది మైనర్లు ఉన్నారని ఆయన చెప్పారు. ఈ హింసాత్మక దాడిలో అనేకమంది పోలీసు అధికారులు కూడా గాయపడినట్లు చెప్పారు. విక్టరీ పరేడ్ సమయంలో ఈఫిల్ టవర్ వద్ద 6000 మంది పోలీసులను మోహరించారు.
గత ఏడాది కూడా పిఎస్‌జి ఛాంపియన్స్ లీగ్‌లో ఘన విజయం సాధించింది. ఈసారి కూడా 4–3 తేడాతో పెనాల్టీ షూట్‌తో ఘన విజయం సాధించడంతో ఫుట్‌బాల్ అభిమానులు గ్రౌండ్‌లోకి దూసుకువెళ్ళారు. పారిస్‌లో భారీ స్క్రీన్‌లలో ఈ వేడుకలు, ఆట విజయాన్ని తిలకిస్తున్న వేలాదిమంది అభిమానుల్లో ఆనందం కట్టలు తెంచుకుంది. వీధుల్లో వేలాదిమంది స్తంభించిపోయారు. పెద్ద పెద్ద స్క్రీన్‌ల వద్ద అభిమానులు, పోలీసులతో ఘర్షణ పడ్డారు. చేతికి అందిన వస్తువులను ధ్వంసం చేశారు. పోలీసులు వారిని చెల్లాచెదురు చేసేందుకు టియర్ గ్యాస్ ప్రయోగించారు. రబ్బరు బుల్లెట్లు ప్రయోగించారు. గత ఏడాది కూడా ఇదే విధంగా ఛాంపియన్స్‌లీగ్ పోటీల్లో పిఎస్‌జి విజయం సాధించినప్పుడు హింస, అల్లర్లు చెలరేగాయి. ఆనాటి అల్లర్లలో 17 ఏళ్ళ ఒక టీనేజర్ సహా ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ విధంగా వరుసగా పిఎస్‌జి రెండుసార్లు విజయం సాధించి ''ఆల్ టైమ్ గ్రేటెస్ట్ జాబితా''లో చేరింది. విజయం సాధించిన ఈ బృందం తర్వాత పారిస్‌లో ఈఫిల్ టవర్‌ను సందర్శించి దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఇచ్చిన విందులో పాల్గొని ఆయన అభినందనలు అందుకుంది. ఈ సందర్భంగా ఫ్రాన్స్ ప్రతిపక్ష నేత పచ్చిమితవాద పార్టీ నాయకురాలు లీ మెరైన్ లీపెంగ్ ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెడుతూ, కేవలం ఫ్రాన్స్‌లో మాత్రమే ఫుట్‌బాల్ పోటీలు జరిగినప్పుడు ఘోరంగా హింసాకాండ చెలరేగుతోందని, అందువల్ల అభిమానులను ఇళ్ళల్లోనే ఉండి మ్యాచ్‌లు చూసేవిధగా కట్టడి చేయాలని, వారిని వేలాదిమందిని ఒకేసారి వీధుల్లోకి రాకుండా కట్టడి చేయాలని కోరారు.

# లెబనాన్‌లో చరిత్రాత్మక బ్యూఫోర్ట్ కోట ఇజ్రాయెల్ స్వాధీనం

### మూడేళ్ళలో 8000 మంది హెజ్బొల్లా ఉగ్రవాదులు హతం
### మేం బలపడ్డాం,ఐడిఎఫ్‌కు నెతన్యాహూ ప్రశంస



**బీరూట్ :** లెబనాన్‌లో ఇజ్రాయెల్ దురాక్రమణ చర్యలు ప్రమాదకరస్థాయికి చేరుకున్నాయి. రెండు దేశాలమధ్యా కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నప్పటికీ కూడా ఐ.డి.ఎఫ్ సైనికులు లెబనాన్ లోలోపలికి చొచ్చుకువెళ్ళి దాడులు చేస్తూ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. తాజాగా దక్షిణ లెబననాన్‌లో అనేక రోజులపాటు తీవ్ర యుద్ధం, గగనతల దాడులు, పోరాటం తర్వాత వ్యూహాత్మకమైన లిటానీ నదికి ఎగువన ఒక ఎత్తైన కొండమీద ఉన్న చరిత్రాత్మకమైన బ్యూఫోర్ట్ కోటను ఇజ్రాయెల్ దళాలు స్వాధీనం చేసుకున్నాయి. ఇజ్రాయెలీ–హెజ్బొల్లా యుద్ధంలో ఇది నెతన్యాహూకు అతిపెద్ద ఘన విజయం. మార్చి రెండో తేదీన లెబనాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించింది. 1948లో ఇజ్రాయెల్ ఆవిర్భవించినప్పటినుండీ ఈ రెడు దేశాల మధ్యా వైరం కొనసాగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ 17 నుండి రెండు దేశాలమధ్యా కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నాగానీ, ఐ.డి.ఎఫ్ లెక్కచేయకుండా దాడులు కొనసాగిస్తోంది.
అదేసమయంలో దక్షిణ లెబనాన్‌లో అనేక గ్రామాలు పట్టణాలను ప్రజలు ఖాళీ చేసి వెళ్ళిపోవాలని ఇజ్రాయెల్ దళాలు హుకుం జారీ చేశాయి. జహ్రానీ నదికి దక్షిణాన ఉన్న ప్రాంతాన్ని ప్రతిఒక్కరూ విడిచి వెళ్ళిపోవాలని ఐ.డి.ఎఫ్ దళాలు తాజా ఆదేశం జారీ చేశాయి. హెజ్బొల్లా కేంద్రాలు, స్థావరాలు,మౌలిక సదుపాయాలకు సమీపంలో ఎవరు ఉన్నాగానీ ఖాళీ చేసి వెళ్ళిపోవాలని, లేకపోతే వారు తమ ప్రాణాలు కోల్పోతారని హెచ్చరించింది. హెజ్బొల్లా యుద్ధం ప్రారంభించినప్పటినుండీ ప్రతిరోజూ ఒక కొత్త విస్తరణ చర్యకు పాల్పడుతోంది. ఈ ఆపరేషన్స్‌లో ఇజ్రాయెల్‌కు చెందిన సైనికులు భారీ సంఖ్యలో పాల్గొంటారు. హెజ్బొల్లాపై దాడులు విస్తరించారు.
కాగా చరిత్రాత్మకమైన బ్యూఫోర్ట్ కోటను స్వాధీనం చేసుకోవడంతో ఇజ్రాయెల్ సైనిక బలగాలపై ఆ దేశ ప్రధానమంత్రి నెతన్యాహూ ప్రశంసలు కురిపించారు. మేం కొత్త విజయాలు , తమ పట్టును విస్తరిస్తామని ఒక వీడియో సందేశంలో ఆయన చెప్పారు. 1982లో మొదటిసారి దక్షిణ లెబనాన్‌లో యుద్ధం చేసినప్పుడు ఈ కోటను ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకుంది. ఆ తర్వాత 18 సంవత్సరరాల పాటు దక్షిణ లెబనాన్‌లోని అధికశాతం భూభాగాన్ని తన అధీనంలోనే ఇజ్రాయెల్ ఉంచుకుంది. వందలమంది ఇజ్రాయెల్ సైనికులు ప్రాణత్యాగాల తర్వాత చివరకు 2000 సంవత్సరంలో ఈ ప్రాంతం నుండి ఇజ్రాయెల్ వైదొలగాల్సివచ్చింది. ''మేం ఈసారి చాలా బలంగా బ్యూఫోర్ట్‌కు తిరిగి వచ్చాం, స్వాధీనం చేసుకున్నాం, చొరవచేశాం, భయం అనే అడ్డంకిని చేధించాం, సిరియా,గాజా,లెబనాన్ సహా అన్ని రంగాలలో మేం పనిచేస్తున్నాం, బలంగా తిరిగి వచ్చాం, మా సమాజాలను రక్షించుకోవడానికి సరిహద్దుల అవతల భద్రతా మండలాలను ఏర్పాటు చేసుకున్నాం'' అని నెతన్యాహూ తన ప్రకటనలో పేర్కొన్నారు. 2023 అక్టోబరులో హమాస్ దాడి చేసిన తర్వాత ఇరాన్ అనుకూల హెజ్బొల్లా ఉగ్రవాదులపై యుద్ధం కొనసాగుతోందని, ఈనాటివరకూ 8000 మంది హెజ్బొల్లా ఉగ్రవాదులను నిర్మూలించామని నెతన్యాహూ ప్రకటించారు. గత జూన్ నెలలో ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేశాక మూడువేలమందినని, గతనెలలో ఏడు వందలమంది హెజ్బొల్లా ఉగ్రవాదులను నిర్మూలించామని చెప్పారు.

# పారిస్‌లోని 100 పాఠశాలల్లో లైంగిక వేధింపులు

### కేసులపై విచారణ

పారిస్:ఫ్రాన్స్‌రాజధాని పారిస్‌లో ఏడాది కాలంగా పాఠశాలల్లో పిల్లలపై లైంగిక వేధింపుల కేసులు ప్రభుత్వాన్ని కుదిపేస్తున్నాయి. ప్రజలను తీవ్ర కలవర పెడుతున్నాయి. ఇప్పుడు ఈ కేసులపై విచారణ జరుగుతోంది. దాదాపు 100 పాఠశాలల్లో లైంగిక వేధింపుల కేసులు వెలుగులోకి వచ్చాయి. పిల్లలు స్కూలు వెళ్ళడానేకే భయాందోళన చెందుతున్నారు. దీంతో తల్లితండ్రులు ఫిర్యాదులు చేసిన తర్వాత ప్రభుత్వంలో కదలిక వచ్చింది. ఈ పాఠశాలల్లో యానిమేటర్లుగా పిలిచే 15,000 మంది సహాయకులు బోధనేతర సిబ్బందిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం పారిస్‌లోని 100 శిశు సంరక్షణ కేంద్రాలు, కిండర్ గార్టెన్‌లు, జూనియర్ స్కూళ్ళలో ఈ లైంగిక వేధింపుల కేసులపై విచారణలు జరుగుతున్నాయి. ఈ యానిమేటర్వే పిల్లలపై దారుణంగా వేధింపులకు పాల్పడుతున్నారని, వారికి సరిగ్గా తిండికూడా పెట్టడంలేదని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో చాలామంది తల్లితండ్రులు పిల్లలను స్కూళ్ళకు కూడా పంపడం మానేశారు.నాలుగు కేసులకు సంబంధించి ఈ నెలలోనే తీర్పులు వెలువడాల్సి ఉంది. గడచినవారంలో ఏడవ ఆరాండిస్‌మెంట్ జిల్లాలో పాఠశాలలు ఆకస్మికంగా పాఠశాలలపై దాడులు చేసి 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ముగ్గురు పిల్లలపై అనుచితంగా లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కేసులు వెలుగుచూశాయి. 11వ అరాండిస్‌మెంట్ జిల్లాలో బాండిస్ జూనియర్ పాఠశాలలో ఒక యానిమేటర్ ఐదుగురు పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. తన కుమార్తెపై గత ఏడాది ఏప్రిల్‌లో లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, తన కుమార్తెలో అసాధారణమైన మార్పులను తాను చూశానని ఒక కుటుంబంలోని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వేధింపులు పారిస్‌లో తలిదండ్రులకు, వారి పిల్లలకు పూర్తి అభద్రతను తెచ్చిపెట్టింది. పాఠశాలలపై నమ్మకం పోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో తల్లితండ్రులు కూడా వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు.

# కొలంబియా అధ్యక్ష పదవికి ఓటింగ్

### 21న రన్నాఫ్ పోలింగ్



**బోగోటా :** వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉన్న దక్షిణ అమెరికా దేశం కొలంబియాలో ఆదివారం అధ్యక్ష పదవికి ఎన్నికల పోలింగ్ జరిగింది. కొలంబియా రాజ్యాంగం ప్రకారం ఒకసారి నాలుగు సంవత్సరాలు పదవిలో ఉన్న అధ్యక్షుడు రెండోసారి పోటీ చేసేందుకు అర్హుడు కాదు. దీంతో వామపక్ష నేత,గెరిల్లా నాయకుడు గుస్తావోపెట్రో రెండోసారి పోటీకి అనర్హుడయ్యారు. ఈ ఎన్నికల్లో ఆరుపార్టీలకు చెందిన నాయకులు ప్రధానంగా పోటీలో ఉన్నారు. గుస్తావో పెట్రోకు చెందిన హిస్టారిక్ పార్టీ తరపున కొలంబియా సెనేటర్ ఇవాన్ సెపేడా కాస్ట్రో (64) పోటీలో ముందంజలో ఉన్నారు. కొలంబియా వామపక్ష ఉద్యమంలో సీనియర్ నాయకుడు సెపేడా.1994లో హత్యకు గురైన కమ్యూనిస్టునేత మాన్యుయెల్ సెపేడా వర్గాస్ ఆశయాల వారసుడుగా ఆయన వామపక్ష రాజకీయాలలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇక ఇండిపెండెంట్ అభ్యర్థి డీ లా ఎస్ప్రియెల్లా (48), డెమొక్రటిక్‌పార్టీ సెంటర్ పార్టీ తరపున అధ్యక్ష అభ్యర్థిని పలోమా సుసానా వాలెన్సియా లాసెర్నా (48), డిగ్నిటీ అండ్ కమిట్‌మెంట్ పార్టీ తరపున యాంటియోక్వియా రాష్ట్ర గవర్నర్ సెర్గియో ఫజార్డో వాల్డెర్రామా(70) తదితరులు పోటీలో ఉన్నారు. లాటిన్ అమెరికా ప్రాంతం నుండి మాదక ద్రవ్యాలు అక్రమంగా అమెరికాలోకి రవాణా అవుతున్నాయని డోనాల్డ్ ట్రంప్ విమర్శలు, పడవలపై దాడులు, విమర్శలు, ప్రతివిమర్శల నేపథ్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ ఎన్నికలు జరుగుతున్నాయి.
ఐతే ఆదివారం జరిగే ఎన్నికల పోలింగ్‌లో ఏ అభ్యర్థికీ సంపూర్ణ మెజారిటీ వచ్చే అవకాశాలు కనిపించడంలేదు. కొలంబియా రాజ్యాంగం ప్రకారం యాభైశాతం కంటే ఎక్కువ ఓట్లు ఏ అభ్యర్థికీ రాకపోతే రెండో విడత రన్నాఫ్ ఎన్నికల పోలింగ్ మొదటి ఇద్దరి అభ్యర్థుల మధ్యా జరుగుతుంది. జూన్ 21వ తేదీన రన్నాఫ్ పోటీకి ముహూర్తంగా నిర్ణయించారు. అందువల్ల జూన్ నెలాఖరువరకు అందరూ ఉత్కంఠతో ఎదురుచూసే పరిస్థితి ఎదురైంది.

## సాహితీ రంగానికే అంకితం

(మొదటి పేజీ తరువాయి)

విత్తనాలే మొలకెత్తి అరసం, ప్రజానాట్యమండలి వంటి సంస్థలు ఉద్భవించాయని చెప్పారు. ఏటుకూరి కుటుంబం మొత్తం కమ్యూనిజం బాటలో నడుస్తూ జీవితం మొత్తాన్ని సమాజానికి అంకితం చేశారన్నారు. ఏటుకూరి ప్రసాద్ త్యాగాలు వృధా కాకుండా, ఆయన సేవలు అందించిన అరసం, ప్రజానాట్యమండలి, నవ చేతన పబ్లిషింగ్ హౌస్‌లు ఆయన కృషిని ముందుకు తీసువెళ్లే దిశగా పనిచేయాలన్నారు. అందులో భాగంగా ప్రసాద్ రాసిన ప్రతిధ్వని పుస్తకంలోని పాటలతో పాటు ఇతర పాటలు, ఆయన జీవిత చరిత్రతో కూడిన పుస్తకం ముద్రించి భవిష్యత్ తరాలకు కరదీపికగా అందించాలని సాంబశివరావు సూచించారు.
సిపిఐ సీనియర్ నాయకులు అజీజ్ పాషా మాట్లాడుతూ డాక్టర్ ప్రసాద్ జీవితమంతా సాహిత్తీ రంగానికే అంకితం చేసిన మహానీయుడని కొనియాడారు. సిపిఐ సెంట్రల్ కమిషన్ చైర్మన్ డాక్టర్.కె.నారాయణ మాట్లాడుతూ తనకు నచ్చిన సాహితీవేత్తలలో ఏటుకూరి ప్రసాద్ ఒక్కరని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అరసం పునర్ నిర్మాణంలో ఏటుకూరి ప్రసాద్ క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. శ్రామిక, విద్యార్థి, యువజన, అన్ని వర్గాల ప్రజలకు జనరంజకంగా పాటలను అందించిన గొప్ప రచయిత అని కొనియాడారు. సిపిఐ సీనియర్ నాయకులు చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ సాహిత్య రంగంలో నిష్ణాతులైన ఏటుకూరి ప్రసాద్ ఆయనకు ఆయనే సాటి అని కొనియాడారు. డాక్టర్ ప్రసాద్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడమే లక్ష్యంగా సాగుదామన్నారు. కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఏటుకూరి ప్రసాద్ మరణంతో ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా పాటల రూపంలో ఎప్పుడూ మనతోనే ఉంటారన్నారు. నవచేతన విజ్ఞాన సమితి (ఎన్‌విఎస్) జనరల్ మేనేజర్ ఎన్.మధుకర్ మాట్లాడుతూ ఏటుకూరి ప్రసాద్ ఎప్పుడు కూడా పుస్తకాల మార్కెట్ విలువకు కాకుండా కథ, సాహిత్యానికి విలువ ఇచ్చేవారని, రచనలు బాగుండి ఇది ప్రజలకు ఉపయోగపడుతుందని భావిస్తే చాలు అది అమ్ముడు పోవడం, పోకవడంతో సంబంధం లేకుండా పుస్తక రూపంలో తీసుకువచ్చేవారని తెలిపారు. పలు పుస్తకాలను సొంత ఖర్చు అచ్చువేయించిన గొప్ప సాహితీవేత్త అని కొనియాడారు. సాహిత్యానికి సంబంధించి ఆయన నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని తెలిపారు.
ప్రముఖ కవి నిఖిలేశ్వర్ మాట్లాడుతూ ఏటుకూరి ప్రసాద్ సామ్యవాద నిబద్ధుడైన రచయిత, సహృదుడైన సాహితీవేత్త అని కొనియాడారు. నిబద్ధత కలిగిన కవిగానే కాకుండా సాహితీ, సంస్కృతిపరంగా కూడా విశేష సేవలను అందించారన్నారు. మార్క్సిస్టు అధ్యయశీలిగా ఆయన నాలుగు వేదాలను చదివిన తర్వాత ఆయన గ్రహించిన సారాన్ని గొప్ప కవిత రూపంలో చెప్పారన్నారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ, వి.ఎస్.బోస్, కలవేనశంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి, ఎన్.జ్యోతి, ఎన్‌విఎస్ కోశాధికారి ఉజ్జని రత్నాకర్‌రావు, అరసం నాయకులు తిరుపాల్, ఎఐటియుసి సీనియర్ నాయకురాలు డాక్టర్ బి.వి.లక్ష్మి , ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్ తదితరులు పాల్గొని ఏటుకూరి ప్రసాద్‌కు నివాళులు అర్పించారు.
ఎన్‌విఎస్ కార్యదర్శి బిఆర్‌ఎస్.మోహన్ రెడ్డి, కవులు, రచయితలు, ప్రజాసంఘాల నాయకులు పల్లె నర్సింహ్మా, హదేశ్ రాణి, కాలువ మల్లయ్య, చైతన్య ప్రసాద్, పల్లే వీరస్వామి, డాక్టర్ నాగసూరి వేణుగోపాల్, నాళేశ్వరం శంకర్, వల్లూరి శివప్రసాద్, శరత చంద్ర జ్యోతిశ్రీ, వేల్పుల నారాయణ, బి.ఎస్.రాములు, బొమ్మగాని నాగభూషణం, ఎస్‌వి.సూర్యప్రకాశ్, జి.చంద్రమోహన్ గౌడ్ మాట్లాడుతూ ఏటుకూరి ప్రసాద్ సాహిత్తీ రంగానికి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. సభకు నవచేతన పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ పి.నారాయణ రెడ్డి వందన సమర్పణ చేశారు.

## తయారుచేయదు, కొనదు

(మొదటి పేజీ తరువాయి)

పడుతుందని వైట్‌హౌస్ అధికారులు చెప్పారు. ఈ సానుకూల పరిణామాలతో మార్కెట్లు పుంజుకున్నాయి. ఇరాన్ వద్ద అణ్వాయుధం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని మొదటి నుండీ ట్రంప్ వాదిస్తున్నారు. అదే సమయంలో అణ్వాయుధం తయారుచేయడం ఇస్లామ్‌కు విరుద్ధమని, తమ అణున కార్యక్రమం పూర్తిగా పౌర ప్రయోజనాలకోసమేనని ఇరాన్ ప్రభుత్వం కూడా మొదటినుండీ చెబుతున్నది. ఎట్టకేలకు ఇరాన్ మాటలను ట్రంప్ విశ్వసించారు.
ఇదిలాఉండగా, అమెరికా–ఇరాన్ చాలా మంచి ఒప్పందానికి చాలా దగ్గరలో ఉన్నాయని ట్రంప్ చెప్పినట్లు పి.టి.ఐ వార్తాసంస్థ ఆదివారం ప్రకటించింది. ఒకవేళ తాము కోరుకున్న విధంగా గనుక ఒప్పందం కుదరకపోతే ఈ ఒప్పందం మరోవిధంగా ముగుస్తుంది'' అని కూడా తన కోడలు లారా ట్రంప్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ చెప్పారని ఫాక్స్‌న్యూస్ శనివారం ఒక వార్త ప్రసారం చేసిందని పిటిఐ పేర్కొంది. ''మేం చాలా మంచి ఒప్పందానికి దగ్గరలో ఉన్నాం,మేం గనుక ఆదరాబాదరాగా వ్యవహరించి ఉంటే అంత మంది ఒప్పందాన్ని మేం చేసుకుని ఉండేవాళ్ళమే కాదు, చాలా మెల్లిగా,తొందర లేకుండా మేం కోరుకున్నది చేశాం, ఒకవేళ మేం కోరుకున్నట్లు ఒప్పందం లేకపోతే మరో పద్ధతిలో ఈ ఒప్పందాన్ని మేం ముగిస్తాం'' అని పరోక్షంగా యుద్ధ హెచ్చరికలు చేశారు. ఇరానియన్లు మంచి సంప్రదింపుకర్తలు, బేరసారాలు బాగా చేస్తారు, కానీ అమెరికా మాత్రం అన్ని అవకాశాలను, అన్ని అస్త్రాలను తన దగ్గరే ఉంచుకుంది, ఎందుకంటే ఇరాన్ సైనికంగా పూర్తిగా ఓడిపోయింది, కాబట్టి సైనికంగా మాకు మంచి పట్టు ఉంది, కానీ నాయకత్వంలో కొందరు మితవాదులు ఉన్నందువల్ల మేం వారి సైన్యాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయలేదు, మేం చాలా మంచి ఒప్పందానికి చేరువలో ఉన్నాం, మేం ఆ ఒప్పందం చేసుకుంటే మంచిది, లేకపోతే మేం మళ్ళీ మా యుద్ధ మంత్రిత్వశాఖకు పిలుపు ఇస్తాం'' అని ట్రంప్ చెప్పారని పిటిఐ పేర్కొంది. ఇరానియన్లు అణ్వాయుధాన్ని అభివృద్ధి చేయరు, కానీ నేను ఎదురుప్రశ్న వేశాను, మీరు తయారు చేయకుండా కొనుగోలుచేస్తే ఏం జరుగుతుందని అడిగాను అందువల్ల ఇప్పుడు వారు ఏం చెబుతున్నారంటే, ''మేం అణ్వాయుధాన్ని మా దేశంలో అభివృద్ధి చేయబోం, ఇతర దేశాల నుండి కొనుగోలు చేయబోం అని చెప్పారు, దీని మధ్య చాలా పెద్ద తేడా ఉంది'' అన్నారు.
తన రాయబారులు ఇరాన్ ప్రతినిధులతో కుదుర్చుకున్న ముసాయిదా ఒప్పందంలో సవరణలు చేయాలని సిత్యుయేషన్ రూమ్‌లో అగ్రశ్రేణి క్యాబినెట్ సహచరులతో జరిగిన సమావేశంలో ట్రంప్ డిమాండ్ చేసినట్లు ఆదివారం తొలుత వార్తలు వచ్చాయి. ఆ పదజాలాన్ని కూడా మార్చాలని ట్రంప్ కోరుతున్నారు. ఐతే ఇరాన్ నుండి స్పందన రావడానికి మూడు రోజులు పట్టవచ్చునని వైట్‌హౌస్ అధికారులు చెప్పారు. శుద్ధి చేసిన యురేనియం కోసం ట్రంప్ పట్టు పడుతున్నారు. ఈ విషయంలో రెండు దేశాల ప్రతినిధులమధ్యా చచాలా రోజులు మళ్ళీ వాదోపవాదాలుకొనసాగే అవకాశాలు ఉన్నాయి. ఎప్పటికీ అణ్వాయుధం ఇరాన్ వద్ద ఉండకూడదని, ఆ మేరకు ఇరాన్ గట్టి హామీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అమెరికా–ఇరాన్ మధ్య 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించారని, హోర్ముజ్ తెరిచేందుకు అంగీకారం కుదిరిందని, అణు సమస్యపై కూడా రాబోయే 60 రోజుల వ్యవధిలో చర్చలు జరుగుతాయని ఇంకా ఒప్పందంపై ట్రంప్ సంతకాలు చేయాల్సి ఉందని ప్రచారం జరుగుతున్న పూర్వరంగంలో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 91 డాలర్లకు తగ్గింది. బంగారం, వెండి ధరలు గణనీయంగా పెరిగాయి. ప్రాంతీయ,నగర స్థాయిలో చూసినప్పుడు 24 క్యారెట్ల బంగారం ధర ఒక్కరోజులో రూ.1580 పెరగడంతో పది గ్రాముల ధర 1,57,640కు చేరింది. 22 క్యారెట్ల బంగారం ధర ఒక్కరోజులో రూ.1450 పెరగడంతో పది గ్రాముల ధర రూ.1,.44,500 కు చేరుకుంది. ఇరాన్ అణ్వాయుధాన్ని అడ్డుకోవడానికి ట్రంప్ గీసుకున్న రెడ్‌లైన్స్‌కు అనుగుణంగా సంతృప్తి చెందితేనే ఒప్పందాన్ని ఆయన ఖరారు చేస్తారని వైట్‌హౌస్‌లో పేరు చెప్పడానికి ఇష్టపడని సీనియర్ అధికారి శనివారంనాడే ప్రకటించారు. సిత్యుయేషన్‌రూమ్‌లో ముఖ్య సహాయకులతో రెండు గంటల పాటు సమావేశం జరిపిన తర్వాత కూడా ట్రంప్ శనివారం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వార్తలు వెలువడిన తర్వాత, ఇరాన్ ఒప్పందంలో సవరణలను ట్రంప్ కోరుతున్నారని ఆక్సియోస్ సంస్థ తన నివేదికలో వెల్లడించింది. ఆ తర్వాత ఇరాన్ తమకు అణ్వాయుధం తయారు చేయబోమని హామీ ఇచ్చిందని మాస్కో కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 8.36 గంటలకు టాస్ వార్తాసంస్థ ప్రకటించింది. ఏప్రిల్ ఎనిమిదో తేదీన అమెరికా–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చింది. ఆ తర్వాత ఏప్రిల్ 11–12 తేదీలలో ఇస్లామాబాద్ వేదికగా రెండు దేశాలమధ్యా మొదటి విడత చర్చలు ఎలాంటి ఒప్పందం లేకుండానే ముగిశాయి. మే నాలుగో తేదీన ట్రంప్ ''ప్రాజెక్టు ఫ్రీడమ్''ను ప్రకటించారు. తర్వాత ఇరవైనాలుగ్గంటల్లోనే దానిని ఉపసంహరించారు. మే 25న మరోసారి ఇరాన్‌పై అమెరికా దాడులు చేసింది. ఈ దాడులను ఆత్మరక్షణ చర్యగా ప్రకటించింది. ప్రస్తుతం కాల్పుల విరమణ ఒప్పందం కొనససాగుతుండగా చర్చలు ఒక కొలిక్కి వచ్చాయి.

## పునర్ నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

సిఎం ట్విట్టర్‌లో (ఎక్స్) పోస్ట్ చేశారు. ఏ ముఖ్యమంత్రి ఆలోచన చేయని విధంగా విద్యా శాఖ బాధ్యతలను స్వయంగా తానే తీసుకున్నానని, గడచిన రెండేళ్లుగా తెలంగాణ మోడల్ స్కూళ్ల ఏర్పాటు, నూతన ఉపాధ్యాయుల నియామకం, డిజిటల్ విద్యకు ప్రాధాన్యత, ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ సదుపాయం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన, డ్రాపొట్ల నియంత్రణ వంటి అంశాలపైన బలమైన కార్యచరణను తీసుకున్నామని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గత పదేళ్లలో జరిగిన విద్య విధ్వంసం నుంచి విద్యా వికాస పునర్ నిర్మాణానికి తాము నడుంకట్టామని, తాజా ఫలితాలతో తాము సంతృప్తి పడటం లేదన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం పూర్తయి, భవిష్యత్ లో ఈ పాఠశాలలు దేశ విద్యా వ్యవస్థలో తెలంగాణ స్థానాన్ని నంబర్ వన్‌గా నిలబెడతాయనే విశ్వాసం తమకు ఉందని, ఆ లక్ష్య సాధనలో ప్రస్తుతం కేంద్ర నివేదికలో పేర్కొన్న ఫలితాలు తమకు ప్రేరణను ఇచ్చాయని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## రెండో విడతకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

రెండో విడతకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం కాగజ్‌నగర్‌లో ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభా ప్రాంగణం, పార్కింగ్, హెలిపాడ్, ఇతర ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారులతో సిఎం పర్యటన వివరాలను సమీక్ష నిర్వహించనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణ ప్రక్రియ ప్రారంభమైంది. రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయంచింది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఆసిఫాబాద్ జిల్లా నుంచే ప్రారంభించనుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. సిఎం పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. ప్రజలు హాజరయ్యే సభకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది.

## ఉపశమనం..

(మొదటి పేజీ తరువాయి)

అవకాశం ఉందని చెప్పారు. వాతావరణ శాఖ విడుదల చేసిన బులెటిన్ ప్రకారం, రాష్ట్రంలో వచ్చే వారం రోజుల పాటు పలుచోట్ల ఉరుములు, మెరుపులు, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.నేడు ఆదిలాబాద్, కోమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.
జూన్ 2, 3 తేదీల్లో ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాలతో పాటు హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందన్నారు. జూన్ 3, 4 తేదీల్లో వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు, అలాగే హైదరాబాద్ పరిసర జిల్లాల్లో విస్తృతంగా వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని చెప్పారు. జూన్ 4, 5 తేదీల్లో రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. జూన్ 5 నుంచి 7 వరకు కూడా అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగనున్నట్లు తెలిపారు.
**తగ్గనున్న ఉష్ణోగ్రతలు :**
వర్షాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గనున్నాయి. ప్రస్తుతం 41 నుంచి 44 డిగ్రీల మధ్య నమోదవుతున్న ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, ఖమ్మం, వరంగల్, సూర్యాపేట జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 36 నుంచి 40 డిగ్రీల మధ్యకు తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36 నుంచి 40 డిగ్రీల మధ్య కొనసాగనున్నాయి. జూన్ రెండో వారంలో నైరుతి రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెప్పుతున్నారు.

## నకిలీ ధృవపత్రాలు

(మొదటి పేజీ తరువాయి)

దందా వ్యవహారంలో కొందరు రాజకీయ నాయకులు, వైద్యులు, ఇతర శాఖల అధికారులు జోక్యం చేసుకుంటున్నారు. ఒక పైరవీకారు ఫోటో స్టూడియో యజమానితో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే ఉద్యోగులు ఒక ముఠాగా ఏర్పడి ఈ నకిలీ ధృవపత్రాలతో పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. గ్రామాల్లో వయస్సుతో సంబంధం లేకుండా, వైకల్యంతో నిమిత్తం లేకుండా కొందరిని ఎంపిక చేసుకుని ఎర వేస్తున్నారు. గ్రామాల్లో ఉండే పైరవీకారులను కలుపుకుని వారికి ఐదు నుంచి పది వేల రూపాయలు ఇస్తున్నారు. వారు గ్రామాల్లో వికలాంగ పింఛన్ కోసం ఆశపడే వారిని వీరి వద్దకు పంపుతున్నారు. ఆధార్, ఓటరు కార్డు, ఇతర వివరాలు సేకరించి వైరా పట్టణంలోని ఓ స్టూడియోలో అంగవైకల్యం చూపేవిధంగా ఫోటోలు తీయిస్తారు. ఒక్కొక్కరి వద్ద నుంచి రూ. 40వేల నుంచి రూ.60వేల వరకు వసూలు చేస్తున్నారు. జీవిత కాలం వికలాంగ పింఛన్ వస్తుంది కదా అన్న ఆశతో వారు అడినంత సమర్పించుకుంటున్నారు. వసూలు చేసిన దానిలో కొంత మొత్తం ప్రభుత్వ ఆసుపత్రిలోని ఉద్యోగులు, వైద్యులకు ముట్టజెప్పి వికలాంగ ధృవపత్రాలు తీసుకు వస్తున్నారు. కొందరు ధృవపత్రాలను చూసి గ్రామ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు విస్తుపోతున్నారు. కనీసం ఐదు శాతం కూడా వైకల్యం లేని వారికి 60 శాతానికి మించి వైకల్యం ఉన్నట్లు ధృవపత్రాలు జారీ అవుతుండటం గమనార్హం. నకిలీ ధృవపత్రాలు పొందుతున్న వారిలో అన్ని వర్గాల వారు ఉండటం గమనార్హం. ఖమ్మం రూరల్, వైరా, కొణిజర్ల, మధిర సహా జిల్లా వ్యాప్తంగా ఈ నకిలీ దందా ద్వారా ధృవ పత్రాలు పొంది పింఛన్ పొందుతున్నట్లు తెలుస్తుంది. ఈ ముఠా దందా వ్యవహారం ఖమ్మంజిల్లాలో ఐదేండ్లుగా యధేచ్ఛగా సాగుతున్న ఎందుకో ఎవరు పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో ఏ వైకల్యం లేకున్నా నెలకు నాలుగు వేల పింఛన్ పొందడం చూసి మరి కొందరు ఈ ముఠాను ఆశ్రయిస్తున్నారు. దీనితో వీరి వ్యాపారం దిన దిన ప్రవర్థమానమవుతుంది.
**విచారణ జరిపితే గుట్టు రట్టు :** నకిలీ వికలాంగ పింఛన్ల వ్యవహారంపై విచారణ జరిపితే విస్తుగొలిపే విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది. ఏ వైకల్యం లేకుండా యుక్త వయస్సు నుంచి వృద్ధుల వరకు పింఛన్లు పొందుతున్న తీరు ఆశ్చర్యపరుస్తుంది. ఖమ్మం ఆసుపత్రిలో ఈ ముఠాతో చేతులు కలిపిన సిబ్బంది, వైద్యులు ఎవరనేది కూడా తేల్చాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా నకిలీ ధృవపత్రాలతో పింఛన్ పొందుతున్న వారిపైన గ్రామస్థాయిలో విచారణ జరపాల్సి ఉంది. విచారణ అనంతరం ధృవపత్రాల జారీ, వసూళ్ల వీటిపై తగు చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో ఇటువంటి నకిలీ ముఠాలు తమ దందాలను సాగించే అవకాశం ఉండదు. వైకల్యం లేకున్నా పింఛన్లు పొందుతున్నవారి నుంచి గతంలో పొందిన పింఛన్ సొమ్మును రికవరీ చేయాల్సిన అవసరం కూడా ఉంది. ఐదేండ్ల నుంచి ఈ నకిలీ దందా సాగుతున్న ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదో, దీని వెనక ఉన్న అంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు. ప్రతి నెల నకిలీ పింఛన్ దారులు లక్షలాది రూపాయలు కాజేస్తున్న వ్యవహారంపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ఈ ఫోటోలో ఉన్న వ్యక్తికి ఎటువంటి అంగవైకల్యం లేదు. వ్యవసాయ పనులతో పాటు ఇప్పటికీ హమాలీ పని చేస్తుంటాడు.

# వైభవ్ చాలా ప్రత్యేకమైన క్రికెటర్..

## టెస్టుల్లో ఆడితే చూడాలనుంది : సచిన్

భారత క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆటను దిగ్గజ ఆటగాళ్లు వేనోళ్ల పొగుడుతున్నారు. ఐపిఎల్ 19లో వైభవ్ తుఫాన్ ఇన్నింగ్స్‌లను చూసి అతడు నా ఫేవరెట్ క్రికెటర్ అని ప్యాట్ కమిన్స్.. ప్రస్తుతం ప్రపంచంలోనే ఉత్తమ ఆటగాళ్లలో వైభవ్ ఒకడు భారత కెప్టెన్ శుభ్మన్ గిల్ చెప్పేశారు. పదిహేనేళ్లకే దునియా మొత్తాన్ని తనవైపు తిప్పుకున్న ఈ కుర్రాడికి క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ ప్రశంసలూ దక్కాయి. వైభవ్ చాలా ప్రత్యేకమని, అతడి మణికట్టు మ్యాజిక్ అద్భుతమైని సచిన్ పేర్కొన్నాడు. ప్రపంచ క్రికెట్లో వంద శతకాలతో చరిత్ర సృష్టించిన సచిన్ టెండూల్కర్ ఐపీఎల్లో దుమ్మురేపిన వైభవ్ సూర్యవంశీని ఆకాశానికెత్తేశాడు. క్రిక్ఇన్ఫో 21వ శతాబ్దపు ఉత్తమ పురుష క్రికెటర్ అవార్డుకు ఎంపికైన సచిన్ మాట్లాడుతూ వైభవ్ చాలా ప్రత్యేకమైన క్రికెటర్ అని చెప్పాడు. వైభవ్ చాలా ప్రత్యేకమైన ఆటగాడు. సహజసిద్ధంగా అతడికి అబ్బిన క్రికెట్ నైపుణ్యాలతో ఎవరూ పోటీపడలేరు. ప్రతిఒక్కరూ సూర్యవంశీ గురించి గొప్పగా మాట్లాడుతున్నారు. కానీ, నేను అతడి ఆటను గమనిస్తున్నా. ఎంతో గొప్పగా ఆడుతున్నాడు. అతడు బంతిని బాదే సామర్థ్యం మాత్రమే కాదు అతడు మణికట్టును కదిలించే తీరు అద్భుతం. మైదానం నలువైపులా షాట్లు ఆడాలంటే మణికట్టును మెరుపులా కదలించడం కీలకం. వైభవ్ బంతిని బాదడం కాదు.. లైన్ అండ్ లెంగ్త్ను అందరికంటే ముందే పసిగడుతున్నాడు. దాంతో, అలవోకగా బంతిని స్టాండ్స్లోకి పంపుతున్నాడు అని వైభవ్ ఆటను విశ్లేషించిన సచిన్ అతడిని టెస్టుల్లో చూడాలని ఆశపడుతున్నట్టు చెప్పాడు. 'వైభవ్ను నేను టెస్టు జెర్సీలో చూడాలనుకుంటున్నా. అలా అనీ తొందరేమీ లేదు. వైభవ్‌ను అతడిలానే ఉండాలని నేను కోరుతున్నా. అయితే.. టెస్టుల్లో అతడు సవాళ్లను ఎలా అధిగమించాలో నేర్చుకుంటాడు. వైభవ్ చాలా ఆత్మవిశ్వాసంతో కనిపిస్తాడు. టెస్టుల్లో బౌలర్లు విసిరే సవాళ్లకు అతడు ఎలా స్పందిస్తాడో చూడాలనుంది. అంతేతప్ప నేను అతడి సహజ నైపుణ్యాలను తక్కువ చేయడం లేదు. ప్రస్తుతానికి బంతిని సునిశితంగా గమనించి బాదేస్తున్న వైభవ్.. ఆ సిగ్నల్లో అంతరాయం ఏర్పడితే కష్టాలు తప్పవు. అప్పుడు అతడికి నిజమైన సవాళ్లు ఎదురవుతాయి. అందుకని అతడిని ఇప్పటిలానే స్వేచ్ఛగా కోరుతున్నా. కాలంలో పాటు అతడు ఆటలోని సవాళ్లను ఎలా అధిగమించాలో నేర్చుకుంటాడు. టెస్టులే కాదు ఏ ఫార్మాట్‌లో వైభవ్ గొప్పగా ఆడుతాడో అందులోనే కొనసాగించాలి. ఈ విషయా న్ని సెలెక్టర్లకు వదిలేస్తున్నా. ఎందుకంటే ప్రతిభావంతుడైన సూర్యవంశీ భవిష్యత్తుకు వారిదే బాధ్యత' అని టెండూల్కర్ వెల్లడించాడు.



**ఆరెంజ్ క్యాప్...** పంతొమ్మిదో సీజన్‌లో ఆరెంజ్ క్యాప్ విజేత ఎవరు? అనేది ఆసక్తి రేపుతోంది. ఎలిమినేటర్, క్వాలిఫయర్ 2లో శతకం చేజార్చుకున్న యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ 776 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. గుజరాత్ టైటాన్స్ ఓపెనర్లు శుభ్మన్ గిల్, సాయి సుదర్శన్ అతడికి గట్టి పోటీ ఇస్తున్నారు. రాజస్థా సెంచరీతో గిల్ ఏడొందల క్లబ్లో చేరగా.. అర్ధ శతకంతో మెరిసిన సుదర్శన్ సైతం రేసులోకి దూసుకొచ్చాడు.

# చరిత్ర సృష్టించిన సాత్విక్—చిరాగ్

### భారత తొలి డబుల్స్ జంటగా రికార్డు

గత సీజన్ నుంచి అంతర్జాతీయ టోర్నీలో దుమ్మురేపుతున్న సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి ద్వయం చరిత్ర సృష్టించింది. ఏళ్లుగా భారత డబుల్స్ క్రీడాకారులను ఊరిస్తున్న సింగపూర్ ఓపెన్ ట్రోఫీని ఈ జోడీ గెలుపొందింది. ఆదివారం ఫైనల్లో టాప్ గేర్లో ఆడిన భారత జంట ఫైనల్లో ఫజర్ అల్ఫియాన్ ముహమ్మద్ షోహిబుల్ ఫిక్రీ(ఇండోనేషియా)ను మట్టికరిపించి టైటిల్ను కొల్లగొట్టింది. తద్వారా రెండేళ్లలో రెండో ట్రోఫీని సాధించింది సాత్విక్ చిరాగ్ జోడీ. థామస్ కప్లో రన్నరప్తో సరిపెట్టుకున్న సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి ద్వయం సింగపూర్ ఓపెన్ సూపర్ 750 పురుషుల డబుల్స్లో ట్రోఫీని పట్టేసింది. సెమీస్లో వరల్ నంబర్ 1 జోడీ కిమ్ వాన్ హో సియో సెయంగ్ జీ(దక్షిణ కొరియా)ని 52 నిమిషాల్లోనే ఓడించిన భారత జంట ఫైనల్లోనూ పంజా విసిరింది. ఇండోనేషియా షట్లర్లు ఫజర్ అల్ఫియాన్ ముహమ్మద్ షోహిబుల్ ఫిక్రీ తొలి సెట్ను గెలుచుకున్నా పట్టువదల్లేదు సాత్విక్ చిరాగ్. రెండో సెట్లో 2117తో ప్రత్యర్థికి షాకిచ్చిన భారత జోడీ.. నిర్ణయాత్మక మూడో సెట్ను 21 16తో అలవోకగా గెలుచుకుంది. అంతే.. సింగపూర్ ఓపెన్ డబుల్స్లో విజేతగా నిలిచిన భారత జంటగా సాత్విక్ చిరాగ్ రికార్డు నెలకొల్పారు. 'ఫైనల్లో మేము తరచూ ఓడిపోయేవాళ్లం. కానీ, ఈ టోర్నమెంట్ మాకు చాలా ప్రత్యేకమైనది. ప్రేక్షకులకు ధన్యవాదాలు. ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు. మీరంతా ఆటపై ఎంతో ఇష్టం చూపించారు. ఏ దేశం క్రీడాకారులు అనే విషయం పక్కనపెట్టి.. ప్రోత్సహించారు. బ్యాడ్మింటన్ ఆడేందుకు ఇంతకంటే ఉత్తమమైన స్టేడియం ఇంకొకటి ఉండదని అనుకుంటున్నాం' అని మ్యాచ్ అనంతరం కోర్టులో సాత్విక్ చిరాగ్ వెల్లడించారు.





## భాకర్-రాణాకు సిల్వర్

మ్యూనిచ్‌లో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్‌లో భారత స్టార్ షూటర్లు మను భాకర్, సమ్రాట్ రాణా రజత పతకం అందుకున్నారు. శనివారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్డ్ టీమ్ ఈవెంట్ ఫైనల్లో భాకర్—రాణా జోడీ 483.6 స్కోరుతో రెండోస్థానంతో సిల్వర్ ఖాతాలో వేసుకుంది. ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్‌లో భారత స్టార్ షూటర్లు మను భాకర్, సమ్రాట్ రాణా రజత పతకం అందుకున్నారు. శనివారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్సడ్ టీమ్ ఈవెంట్ ఫైనల్లో భాకర్—రాణా జోడీ 483.6 స్కోరుతో రెండోస్థానంతో సిల్వర్ ఖాతాలో వేసుకుంది. చైనాకు చెందిన కియాన్సున్ యావో కైహు ద్వయం 483.9 పా యింట్లతో స్వర్ణం గెలుచుకోగా, 0.3 పాయింట్ల స్వల్ప తేడాతో భారత జంటకు గోల్ చేజారింది.

## ఆరోగ్యం



### అనాసతో కేన్సర్‌కు చెక్!

ఇటీవల విస్తారంగా ప్రచారమవుతున్న ఆరోగ్య వార్తల్లో 'అనాస' (పైనాపిల్) పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. అనాస రసంలోని బ్రోమెలైన్, కేన్సర్‌పై ప్రత్యక్షంగాను, ప్రభావవంతంగాను పనిచేస్తుందనే అభిప్రాయం వైరల్ అవుతున్నది. ఇందులో శాస్త్రీయ ఆధారం అతిసూక్ష్మంకాగా, అతిశయోక్తి చాలా ఎక్కువ. బ్రోమెలైన్‌పై జరిగిన పరిశోధనలు ప్రధానంగా ప్రయోగశాల స్థాయి లేదా జంతువులకు మాత్రమే పరిమితమై ఉన్నాయి. ఈ అధ్యయనాల్లో బ్రోమెలైన్ కొన్ని కేన్సర్ కణాల పెరుగుదలను తగ్గించడం, అలాగే అపోప్టోసిస్‌ను ప్రేరేపించడాన్ని గమనించారు. కానీ, ఈ ప్రభావాలు మనుషుల శరీరంలో అదేస్థాయిలో పునరావృతమవుతాయా? అన్నది ప్రశ్న. ప్రస్తుతం అందుబాటులో ఉన్న క్లినికల్ ఆధారాలు పరిమితమైనవే. అంటే, ప్రయోగశాలలో పనిచేసినది. నేరుగా మనుషులపై కూడా అదే ప్రభావాన్ని చూపుతుందని అనుకోవడం తార్కికంగా సరైనది కాదు. అంతేగాక, బ్రోమెలైన్ చెడు కణాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని, మంచి కణాలను కాపాడుతుంది అనే వాదన కూడా అర్ధ సత్యమే. జీవవిజ్ఞాన దృష్టిలో చాలా క్లిష్టమైన ప్రక్రియను అతి సులువగా చెప్పడం సరికాదు. అనాసరసం ఆరోగ్యానికి ఉపయోగకరమైనదే. దీనిలో ఉన్న విటమిన్ 'సి', యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. కానీ దాన్ని కేన్సర్ యోధుడుగా వర్ణించడం శాస్త్రీయంగా అతిశయోక్తి. దీనిని ఒక సహాయక ఆహార భాగంగా మాత్రమే చూడాలి.. ప్రధాన చికిత్సగా కాదు. కేన్సర్‌ను ఒకే పదార్థంతో ఎదుర్కొనే ప్రయత్నం కంటే, జీవనశైలి, ఆహారం, వైద్య చికిత్స వంటి అంశాలన్నీ కలిసి పని చేసే సమగ్ర విధానం అవసరం. ప్రకృతిలోని పదార్థాలు ఉపకారకాలు కావచ్చు, కానీ అవి స్వతంత్ర పరిష్కారాలు కావు. ప్రకృతి పదార్థాలు ఆరోగ్యానికి తోడ్పడతాయన్నది సరైనదేగానీ, దాన్ని వైద్యపరంగా నిర్ధారిత చికిత్స స్థాయికి తీసుకెళ్లడం, ప్రస్తుత శాస్త్రీయ ఆధారాల ప్రకారం సమర్థించలేం.

## ఉపయోగించకుంటే క్షీణతే..



మన మస్తిష్కం జీవన అవసరాలకు అనుగుణంగా నిర్మితమైన ఒక అత్యంత సమర్థ వ్యవస్థగా పనిచేస్తుంది. ఇది శక్తిని వృథా చేయకుండా, ఉపయోగకరమైన నాడీ సంబంధాలను బలపరచి, అవసరం లేని వాటిని తగ్గించే దిశలో నిరంతరం మార్పులకు లోనవుతుంది. ఈ ప్రక్రియను శాస్త్రీయంగా 'సైనాప్టిక్ ప్రూనింగ్' అని వ్యవహరిస్తారు. అంటే, తరచుగా ఉపయోగంలో ఉన్న నెరల్ కనెక్షన్లు క్రమంగా మరింత బలపడుతాయి. ఉపయోగం లేని సంబంధాలు క్షీణిస్తాయి లేదా పూర్తిగా తొలగిపోతాయి. ఈ విధం గా మెదడు తన వనరులను సమర్థంగా వినియోగిస్తుంది. నాడీకణాలు ఒకేసారి చురుకుగా పనిచేసినప్పుడు, వాటి మధ్య ఉన్న సంబంధాలు గట్టిపడతాయి అనే సూత్రాన్ని 'ఫైర్ టుగెదర్, వైర్ టుగెదర్' అని పేర్కొంటారు. దీని అర్థం, ఒకే విధమైన ఆలోచనలు లేదా చర్యలు పునరావృతమైతే, వాటి కి సంబంధించిన నాడీ మార్గా లు మరింత వేగంగా, సమర్థంగా పనిచేయడం ప్రా రంభిస్తాయి. ఫలితంగా, మనంనేర్చుకున్న నైపుణ్యాలు లేదా జ్ఞానం కాలక్రమంలో స్థిరంగా మారుతుంది. అయితే, దీనికి విరుద్ధంగా, వాడని నైపుణ్యాలు క్రమంగా తగ్గిపోతాయి. ఒక నైపుణ్యాన్ని లేదా జ్ఞానాన్ని ఉపయోగించకపోతే, దానికి సంబంధించిన నాడీ సంబంధాలు బలహీనమవుతాయి. ఈ పరిణామమే మనం విషయాలను మర్చిపోవడానికి ముఖ్య కారణాలలో ఒకటి. కాబట్టి, నిరంతర అభ్యాసం, పునరావృతం అనేవి నేర్చుకునే ప్రక్రియలో కేంద్ర స్థానాన్ని పొందుతాయి. భాషలను అభ్యసించడం, సంగీత సాధన చేయడం, క్రీడలలో నైపుణ్యాన్ని పెంపొందించడం లేదా మానసిక వ్యాయామాలు చేయడం వంటివన్నీ పునరావృతంపై ఆధారపడిన ప్రక్రియలే. కొత్త నాడీ మార్గాలను నిర్మించడం మాత్రమే కాకుండా, ఇప్పటికే ఉన్న మార్గాలను బలపరచడం కూడా అభ్యాసంతోనే సాధ్యమవుతుంది. దీనిద్వారా మెదడు చురుకుదనం పెరుగుతుంది, జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది, ఆలోచనా సామర్థ్యం స్పష్టంగా రూపుదాలుస్తుంది. తరచుగా వినియోగించే సామర్థ్యాలు నిలిచి, అభివృద్ధి చెందుతాయని, వినియోగం లేకపోతే అవి క్షీణిస్తాయని శాస్త్రీయంగా రుజువైన విషయం. అందువల్ల, నిరంతర సాధన, పునరావృతం, చురుకైన మానసిక చర్యల ద్వారా మెదడును పదును పెట్టడం జీవనాంతర అభ్యాసానికి కీలకమైన సూత్రం గా నిలుస్తుంది.

## మెదడు అంతటా వ్యాపించే 'జాగృతి'!



జాగృతి (కాన్షియస్‌నెస్) కేవలం న్యూరాన్ల పరస్పర చర్యల ఫలితంగానే ఇప్పటి వరకూ ఉన్న బలమైన నమ్మకం. అయితే, అది మెదడు అంతటా వ్యాపించే విద్యుదుద్వీప్తతరంగాలు లేదా ఎనర్జీ ఫీల్డులు దానికి మూలం కావచ్చుననే ప్రతిపాదన ఆసక్తి కలిగిస్తున్నది. ఇది సంప్రదాయ న్యూరోసైన్స్ మోడల్‌కు కొంత సరళీకరణ. అది కేవలం న్యూరాన్లు ఫైర్ అవుతాయి అనేస్థాయిలో మాత్రమే ఉండదు. ఆధునిక సిద్ధాంతాలు, ప్రత్యేకించి 'గ్లోబల్ వర్క్‌ప్లే థియరీ' లేదా 'ఇంటిగ్రేటెడ్ ఇన్ఫర్మేషన్ థియరీ' మెదడులో విభిన్న ప్రాంతాల సమన్వయం, సిగ్నల్ ఇంటిగ్రేషన్, విస్తృత నెట్‌వర్క్ డైనమిక్స్‌ను పరిగణలోకి తీసుకుంటాయని ఇప్పటికే శాస్త్రవేత్తలు నిర్ధారించారు. అంటే సమన్వయిత తరంగాలు జాగృతికి మూలం అనే ఆలోచన పూర్తిగా కొత్తది కాదు. అది ఉన్న ఫ్రేమ్‌వర్క్‌లలోనే ఒక వేరియేషన్. ఇక, ఎలక్ట్రోమాగ్నెటిక్ ఫీల్డ్ ఆధారిత సిద్ధాంతాలు నిజంగా శాస్త్రీయంగా చర్చలో ఉన్నప్పటికీ, అవి ఇప్పటికీ ప్రధాన ప్రవాహ సిద్ధాంతాలు కావు. ఎందుకంటే, ఇవి కారణాలను లేదా మూలాలను స్పష్టం చేయలేకపోతున్నాయి. మెదడులో కనిపించే విద్యుత్ తరంగాలు జాగృతికి కారణమా? లేక ఫలితమా? అనే ప్రశ్న ఉదయించినప్పుడు, ప్రస్తుతం ఉన్న డేటా ఈ రెండింటిని స్పష్టంగా వేరు చేయలేకపోతుంది. ఇఇజి, ఎంఇజి వంటి పద్ధతులు తరంగాలను కొలుస్తాయి, కానీ, అవి చైతన్యాన్ని ఉత్పత్తి చేస్తున్నాయని నిర్ధారించవు. ఇక్కడ మరో అంశాన్ని కూడా ప్రస్తావించాలి. ఈ సిద్ధాంతానికి మరణానంతర అనుభవాలు లేదా హఠాత్ జ్ఞాపకాలను ఆధారంగా చూపడం తార్కికంగా బలహీనంగా ఉంది. ఎందుకంటే ఈ అనుభవాలకు ప్రత్యామ్నాయ వివరణలు ఉన్నాయి.

# మైనింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారానికి కృషి

### సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సింగరేణిలో మైనింగ్ స్టాఫ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. సింగరేణిలో మైనింగ్ స్టాఫ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జూన్ నెలలో యాజమాన్యంతో నిర్వహించే స్ట్రక్చర్ సమావేశాల్లో వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని న్యాయం జరిగేలా ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కృషి చేస్తుందని సీతారామయ్య తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలోని సిసిసి నరసయ్య భవనంలో నిర్వహించిన శ్రీరాంపూర్ డివిజన్ మైనింగ్ స్టాఫ్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సింగరేణిలో 2016–17 బ్యాచ్‌కు చెందిన మైనింగ్ స్టాఫ్ ప్రమోషన్ల అంశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు సంస్థ వ్యాప్తంగా జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించి ఉద్యోగుల అభిప్రాయాలను సేకరిస్తున్నామని చెప్పారు. జూన్‌లో జరిగే సమావేశాల్లో ప్రమోషన్ల అంశంతో పాటు మైనింగ్ స్టాఫ్ ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి చర్చించి ఉద్యోగులకు అనుకూలంగా ఒప్పందం కుదుర్చుకునే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు. గత పదేళ్లుగా మైనింగ్ స్టాఫ్‌కు ప్రమోషన్లు లేకపోవడంతో అనేక మంది ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రమోషన్ల విధానం, క్రమశిక్షణ చర్యల కారణంగా నిలిచిపోయిన ఇంక్రిమెంట్లు, పెరుగుతున్న పని భారం వంటి కీలక సమస్యల పరిష్కారానికి ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ (ఎఐటియుసి) కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, మైనింగ్ స్టాఫ్ వైస్ ప్రెసిడెంట్ అడ్డు శ్రీనివాస్, జీఎం చర్చల ప్రతినిధి గొర్రె నర్సయ్య, ఫిట్ సెక్రటరీలు గునిగంటి నరసింగరావు, ఆకుల లక్ష్మణ్, మీడియా ప్రతినిధి రాజ్‌కుమార్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్, శివ, చంద్రమౌళి, దీక్షిత్, వివిధ గనుల మైనింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికులకు రూ.12 వేల ఆర్థికసాయం

### ఎఐటియుసి నారాయణపేట్ జిల్లా కార్యదర్శి సురేష్ డిమాండ్
### ఆటో కార్మికుల సంతకాల సేకరణ





**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు రూ.12వేల ఆర్థిక సహాయం జూన్ రెండు తెలంగాణ రాష్ట్ర సాధన దినోత్సవం రోజునైన అమలు చేయాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పి.సురేష్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎఐటియుసి ఆధ్వర్యంలోఆటో కార్మికులకు రూ.12 వేల ఆర్థిక సహాయం హామీ అమలులో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పలు ఆటో అడ్డాల్లో ఆటో కార్మికులతో సంతకాల సేకరణ ఉద్యమం ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సహాయం అందిస్తామని. ఆటో కార్మికుల కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, సింగిల్ పర్మిట్ పాలసీ, ట్రాఫిక్ చాలన్ల రాయితీ, యాక్సిడెంట్ల ఇన్సూరెన్స్ లాంటి అనేక వాగ్దానాలు చేసి ఆటో కార్మికుల ఓట్లు దండుకున్న రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి 30 నెలలు గడుస్తున్నా అమలులో అలసత్వం ప్రదర్శిస్తున్నదని ఆరోపించారు. జీవనోపాధికి ఆటోరంగంపై లక్షలాదిమంది కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. మహాలక్ష్మి ఉచిత బస్సు పథకంతో ఆటో కార్మికులు తీవ్రమైన సంక్షోభం ఎదుర్కొంటున్నారన్నారు. తగిన ఉపాధి అవకాశాలు లేక పేద కుటుంబాల నిరుపేద యువకులు ఇఎంఐ ద్వారా ఆటోలు కొనుగోలు, అద్దె ఆటోలు నడుపుతున్న ఆటో కార్మికులకు ప్రయాణికులు లేక అప్పుల ఊబిలోకి వెళుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికి 94 మందికి పైగా ఆటో కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో ఆటో కార్మికుల జీవన విధానం ధ్వంసం అవుతుందన్నారు. రాష్ట్రంలో ఓలా, ఉబర్ సంస్థల నుండి రక్షణ, నియంత్రణ కోసం ప్రభుత్వం ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించనిచో ఆటో కార్మికుల ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉప ప్రధానకార్యదర్శి ఆంజనేయులు, ఎఐటియుసి ఆటో యూనియన్ నాయకులు అర్జున్, అంజి, ఖాజా, భీముడు, సాయిలు, రాజు, గిరి, వెంకటేష్ పాల్గొన్నారు.

# సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను నిర్వహించాలని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను యాజమాన్యం వెనక్కి తీసుకోవాలని కోరారు. మిల్ కార్మికులు గత 12 రోజులుగా రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్న సందర్భంగా ఆదివారం దీక్షా శిబిరాన్ని సందర్శించి ఆయన మాట్లాడారు. గుర్తింపు ఎన్నికలు నిర్వహిస్తే కార్మికుల సమస్యలు, యాజమాన్యం విధానాలు బహిర్గతమవుతాయనే భయంతోనే ఎన్నికలను అడ్డుకుంటున్నారని ఆయన విమర్శించారు. కార్మికుల పేరిట ఏర్పాటు చేసిన పది మంది కమిటీ యాజమాన్యానికి అనుకూలంగా పనిచేస్తోందని, ఆ కమిటీని రద్దు చేసి కార్మికులకు ప్రజాస్వామ్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. మిల్‌లో కనీస వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్, బోనస్, క్యాంటీన్ సౌకర్యాలు లేకపోవడంతో పాటు రిటైర్డ్ కార్మికుల బకాయిలు కూడా చెల్లించడం లేదని ఆరోపించారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా ఇతర రాష్ట్రాల కార్మికులను నియమించడం వల్ల జిల్లాలో నిరుద్యోగ సమస్య మరింత పెరుగుతోందని పేర్కొన్నారు. కార్మికుల పది డిమాండ్లపై యాజమాన్యం వెంటనే చర్చలు జరిపి పరిష్కారం చూపాలని కోరారు. హైకోర్టు పిటిషన్‌ను వెనక్కి తీసుకోకపోతే ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో ఏకే సింగ్, శ్రీనివాస్, రాజేష్, గణపతి, వెంకటేష్ పాల్గొన్నారు.

# ప్రజలకు అండగా పోరాటాలు

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథిరెడ్డి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** ప్రజలకు అండగా పోరాటాలు చేస్తామని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భూ పోరాట కేంద్ర సిపిఐ కార్యకర్తల సమావేశం 18 వ వార్డు కౌన్సిలర్ రేశపల్లి నవీన్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా అజయ్ సారథి రెడ్డి హాజరై మాట్లాడుతూ భూపోరాటాలు నిర్వహించి ఈ ప్రాంతంలో వేలాది మంది ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలకు భూములు పంచిన ఘన చరిత్ర సిపిఐకి ఉందన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు అండగా ఉండి సిపిఐ ఆధ్వర్యంలో ఇంటి స్థలాలు పంచామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న పేదలకు రూ.5లక్షలు అందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, పట్టాలు లేని నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు కట్టించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. పేదలు వేసుకొని నివసిస్తున్న గుడిసెలకు ఇంటి నెంబర్లు ఇంటి పట్టాలు ఇవ్వాలన్నారు. గతంలో 58 జీవో కింద కొంతమందికే పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఇంటి పట్టాలు ఇంటి నెంబర్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, తండ సందీప్, ఎండి ఫాతిమా, ఆబోతు అశోక్, కేదాసు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### పేదలపై ధరల భారం మోపుతున్న మోదీ ప్రభుత్వం

పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సామాన్యులపై ధరల భారం మోపుతుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. మండలంలోని అయోధ్య గ్రామంలో మేడే మాసాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ పోరాటం చేస్తుందన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కట్లోజు పాండురంగ చారి, మండల కార్యదర్శి తండా సందీప్, పెరుగు కుమార్, మేక వీరన్న, కేదాసు రమేష్, బర్ల వీరన్న, బండారి శ్రీనివాస్, సిలువేరు శ్రీనివాస్, కట్లోజు కార్తీక్, మురళి, ఉప్పలయ్య, భాస్కర్, వీరయ్య, శంకర్, యాకన్న, వెంకటేష్, అనిల్, చిరంజీవి పాల్గొన్నారు.





# ఉపాధి హామీ పథకంలో కూలీల వేతనాలు పెంచాలి

### సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్



**ప్రజాపక్షం/కోటగిరి :** జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు వేతనాలు పెంచాలని సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో సిపిఐ మండల విస్తృత సమావేశం మండల కార్యదర్శి విఠల్‌గౌడ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సమావేశంలో సుధాకర్, సిపిఐ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి రాములు మాట్లాడారు. జాతీయ ఉపాధిహామీ పథకంలో ప్రవేశపెట్టిన ఫేస్ రికగ్నిజేషన్ విధానంతో కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, యాప్ కూలీ ముఖాని గుర్తించలేక అధికారులు పలుమార్లు ప్రయత్నించిన ఫొటోక్యాప్చరింగ్ కాకపోవటంతో సమయం వృథా అవుతుందని పని చేస్తున్న కూలీలకు తాగునీరు, ఎండలకు తట్టుకోవటానికి ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయటంలో విఫలమవుతున్నారని, పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకుని జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు సంవత్సరానికి 200 రోజుల పని కల్పించటంతో పాటు రోజుకు రూ. 600 లకూలీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలో రైతాంగం పండించిన వడ్లను కొనుగోలు చేసి మద్దతు ధర పెంచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు గంగాధర్, ప్రసాద్ పాల్గొన్నారు.



## బాధితులకు త్వరితగతిన న్యాయం

### నల్లగొండ జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** గ్రేవ్ కేసుల క్రైమ్ ఫైళ్లు, పెండింగ్ కేసుల రికార్డులు,ముఖ్యంగా ఎస్సి,ఎస్టి అట్రాసిటీ కేసులకు సంబంధించిన ఫైళ్లను సవివరంగా తనిఖీ చేసి,బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా దర్యాప్తు పూర్తి చేయాలని జిల్లా ఎస్సి శరత్ చంద్ర పవార్ అధికారులను ఆదేశించారు.జిల్లా పోలీసు శాఖలో పరిపాలనా పనితీరు,కేసుల దర్యాప్తు పురోగతి,రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా ఎస్పీ ఆదివారం నల్లగొండ డిఎస్పికార్యాలయం,టూటౌన్ సీఐ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హత్యలు,దోపిడీలు,మహిళలు,చిన్నారులపై నేరాలు,సైబర్ నేరాల వంటి గ్రేవ్ కేసుల దర్యాప్తు పురోగతిపై సమీక్ష నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన ఛేదించాలని సూచించారు. ప్రతి కేసులో ఆధారాలను పటిష్టంగా సేకరించి నిందితులకు చట్టపరమైన శిక్షలు పడేలా దర్యాప్తు నాణ్యత ఉండాలని స్పష్టం చేశారు.సీసీటీఎన్ఎస్ నమోదు విధానం, డిజిటల్ రికార్డుల నిర్వహణ,కోర్టు డిస్పోజల్ కేసుల ఫాలోఅప్, వారెంట్ల అమలు తదితర అంశాలపై కూడా ఎస్పి సమీక్ష నిర్వహించారు.ప్రజలకు పోలీస్ శాఖపై మరింత నమ్మకం పెరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఎస్పి శివరాం రెడ్డి,టూటౌన్ సీఐ రాఘవరావు పాల్గొన్నారు.

## మహిళలు ఉన్నతంగా ఎదిగేందుకు ప్రోత్సాహం

### మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహిళల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.ప్రజాపాలప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నల్లగొండ పట్టణంలోని 1,2,3,4 వ డివిజన్లతో పాటు 30వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు.ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహిళలు ఉన్నతంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం వారిని అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని తెలిపారు.మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా వడ్డీ లేని రుణాలు ఇస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి బాటలు వేస్తోందని స్పష్టం చేశారు.మహిళలు వీటిని సద్వినియోగం చేసుకొని వారు ఎంచుకున్న రంగంలో రాణించాలని కోరారు.ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ యూనిట్లను అందజేస్తూ అనేక విధాలుగా ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గణేష్, వార్డు ఆఫీసర్ రాము, ఆర్‌పిలు ముంతాజ్ బేగం,జ్యోతి,స్థానిక నాయకులు ఈసారపు నరసింహ రాజు,లోడంగి ఉపేందర్,లింగంపల్లి పిచ్చయ్య,గడ్డం రమేష్, ఏ.అశోక్,యం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాసర ట్రిపుల్ ఐటిలో సీట్లు పొందిన చిట్యాల విద్యార్థులు



**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని పలువురు విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటిలో సీట్లను సాధించారు. రాజీవ్ గాంధీ వైజానిక సాంకేతిక విశ్వ విద్యాలయం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బాసర ట్రిపుల్ ఐటి ఆరేళ్ళ ఇంటిగ్రేటెడ్ బి టెక్ కోర్సులో ప్రవేశాలకు మండలానికి చెందిన ఏడుగురు విద్యార్థులు సీట్లను సాధించారు. ఇటీవల విడుదలైన పదవ తరగతిలో అత్యుత్తమమైన మార్కులను సాధించిన ఈ విద్యార్థులకు ప్రభుత్వ బాసర ట్రిపుల్ ఐటిలో స్థానం లభించింది. మం డలంలోని చిన్నకాపర్తి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన హెచ్ శ్రీవిద్య 600 మార్కులకు గాను 577, ఏపూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తర్ర అఖిల్ (573) మార్కులు, అలాగే వెలిమినేడు ప్రభుత్వ పాఠశాలకు చెందిన కొండె దీక్షిత (567), నేరడకు చెందిన మిర్యాల సంయుక్త(563), వెలిమినేడుకు చెందిన అర్రూరి వైష్ణవి(562), పెద్దకాపర్తికి చెందిన బి శశాంక్(561), చిన్నకాపర్తికి చెందిన బి దీపక్ రెడ్డి(552) మార్కులను సాధించి ట్రిపుల్ ఐటిలో అర్హత సాధించారు.

**విద్యార్థులకు అభినందనలు:** బాసర ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను మండల విద్యాధికారి సైదానాయక్ అభినందనలు తెలియజేశారు. గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో చదువుకుంటు ఎలాంటి కార్పొరేట్ కోచింగ్ లేకుండా బాసర ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించడం మండలానికి గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించాలని సైదానాయక్ ఆకాంక్షించారు.

## సిసిరోడ్డు పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/నాంపల్లి :** మండలంలోని చిట్టెంపహాడ్ నుంచి దామెర రోడ్డు వరకు శనివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ కోరె దేవేందర్, నెమిళ్లగూడెం సర్పంచ్ నారాయణరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యతతో రోడ్డు పనులు చేపట్టాలని,గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. గ్రామాలను అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ అమరావది యాదయ్య,వార్డు మెంబర్లు యు.రాణి, బి.యాదమ్మ, బి.రాము,రోడ్డు కాంట్రాక్టర్ సర్దార్ నాయక్,బి.సైదులు,యు. యాదయ్య, వై. వెంకటరాములు,భాస్కరయ్య,పర్వతాలు,ఈదయ్య పాల్గొన్నారు.

# యుజిడి పనుల్లో నిర్లక్ష్యం

### కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అగ్రహం : సమగ్ర కార్యాచరణ ప్రణాళికకు ఆదేశం



**ప్రజాపక్షం/సూర్యాపేట:** మున్సిపాలిటి పరిధిలో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ పనుల నిర్వహణ తీరుపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా ఐడిఓసి కార్యాలయంలో ప్రజారోగ్య శాఖ, మున్సిపల్ అధికారులు, కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రజారోగ్య శాఖ ఆధ్వర్యంలో కెఎన్ఆర్ కన్స్ట్రక్షన్ లిమిటెడ్ సంస్థ చేపడుతున్న పనుల పురోగతిని ఈ సందర్భంగా ఆయన పరిశీలించారు.
పనుల జాప్యంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో యూజీడి పనుల అత్యంత నిర్లక్ష్యపూర్వకంగా సాగుతున్నాయని మండిపడ్డారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపుల మ్యాన్‌హోల్‌ల నిర్మాణం కోసం రోడ్లను తవ్వేసి నెలల తరబడి వాటికి సిమెంట్ కాంక్రిట్ పనులు చేయకుండా వదిలేయడంపై అగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల సాధారణ ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ట్రాఫిక్‌కు పెద్ద ఎత్తున అంతరాయం కలుగుతోందని గుర్తు చేశారు. పైపులైన్లు, మ్యాన్ హోల్‌ల నిర్మాణం పూర్తయిన వెంటనే తవ్విన గోతులను పూడ్చకపోవడం ముమ్మాటికి నిర్లక్ష్యమేనని తవ్వకాల సమయంలో దెబ్బతిన్న తాగునీటి పైపులైన్లు, ఇతర ప్రజా వినియోగ సదుపాయాలను సకాలంలో పునరుద్ధరించకపోవడం వల్ల ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడాల్సి వస్తోందని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. పనుల్లో వేగవంతం పెంచడంతో పాటు ప్రజల ఇబ్బందులను తక్షణమే తొలగించాలని కలెక్టర్ అదేశించారు. యూజీడి పనులు చేపట్టిన అన్ని ప్రాంతాల్లో సిసిరోడ్ల పునరుద్ధరణకు సంబంధించి రోడ్డు వారిగా వివరాలు, టైంలైన్‌తో యాక్షన్ ప్లాన్‌ను వెంటనే సిద్ధం చేయాలని అదేశించారు. ప్రజారోగ్య శాఖ, కాంట్రాక్ట్ ఏజెన్సీ సమన్వయంతో పనిచేసి దెబ్బతిన్న మౌళిక వసతులను యుద్ధ ప్రాతిపదికన పునరుద్దరించాలని మున్సిపల్ అధికారులు కూడా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నల్లగొండ ప్రజారోగ్యశాఖ సూపరింటెంట్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనమంత్‌రెడ్డి, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్‌కుమార్, ప్రజారోగ్య శాఖ డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనిల్‌కుమార్, రమాదేవి, కెఎన్ఆర్ కన్స్ట్రక్షన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మద్దతు ధర రైతులకు నష్టదాయకం

### ఎంఎస్‌పి జిఒ ప్రతులను దహనం చేసిన రైతు సంఘాలు

### ఎంఎస్‌పి జిఒ ప్రతుల దహనం




**ప్రజాపక్షం/నల్లగొండ :** రైతులు పండించిన పంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు రైతులకు మరింత నష్టం జరిగే విధంగా ఉన్నాయని, వాటిని సవరించి రైతుకు గిట్టుబాటు కలిగే విధంగా ధరలు నిర్ణయించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రం,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటువెంకటేశ్వర్లు,రైతు సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, వీరేపల్లి వెంకటేశ్వర్లులు డిమాండ్ చేశారు.ఆదివారం నల్లగొండ బస్టాండ్ సమీపంలోని సుభాష్ విగ్రహం వద్ద ఎంఎస్‌పి జీవో ప్రతులను దహనం చేసిన అనంతరం ఆయా సంఘాల నాయకులు మాట్లాడారు.దేశంలో ఉన్న 500లకు పైగా రైతు సంఘాలను కలుపుకొని ఈరోజు నుంచి ఈనెల 31వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఏఐకేఎస్ నిర్ణయించిందన్నారు.కేంద్రం ప్రకటించిన ఎంఎస్‌పి ప్రకారం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు కాక రైతుల ఆత్మహత్యలు పెరిగే పరిస్థితి ఉందన్నారు.ఒకవైపు కేంద్రం ఎరువుల ధరలను పెంచుతూ సబ్సిడీలు ఎత్తివేయడం వల్ల రైతులకు పెట్టుబడి పెరుగుతోందని,పంటకు గిట్టుబాటు ధర లేక రైతులకు దిక్కుతోచని స్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య,కోశాధికారి దుర్గయ్య,పబ్బు వీరస్వామి,కేవస్ రెడ్డి,బండమీది వెంకన్న,బండమీది యాదయ్య, వి.లెనిన్, ముండ్ల ముత్యాలు,సత్తయ్య,వెంకన్న రైతు మహిళా కన్వీనర్ కందాల ప్రమీల,రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కల నరసింహ, కార్యదర్శి లింగారెడ్డి,ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మట్టయ్య,నాయకులు మోహన్, మారయ్య, నల్పరాజు సైదులు పాల్గొన్నారు.

# పొగాకు సిగరేట్, తంబాకుకు యువత దూరం

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ విజ్ఞప్తి




**ప్రజాపక్షం/సూర్యాపేట:** పొగాకు, సిగిరెట్, తంబాకుకు యువత దూరంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కార్యక్రమానిన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది, స్థానిక ప్రజలకు పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. యువత పొగాకు, సిగిరెట్, తంబాకు వంటి మత్తు పదార్థాలకు బానిస కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పొగాకును కొంతమంది ఔషదంగా భావించి వివిధ రకాలుగా ఉపయోగిస్తారని, దాని వినియోగం అలవాటుగా మారితే తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుందని అన్నారు. పొగాకు వల్ల నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు వంటి అనేక ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేకదినోత్సవం సందర్భంగా ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని ఆయన తెలిపారు. పొగాకు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతగా నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఎంహెచ్‌వో, ఎన్సిడి ప్రోగ్రాం అధికారి చంద్రశేఖర్, అంబేద్కర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆఫీసర్ డాక్టర్ అమూల్య, టిబి జిల్లా నోడల్ అధికారి పాపిరెడ్డి, సిహెచ్‌వో శ్రీనివాసరాజు, జిల్లా డెమో ఆఫీసర్ సంజీవరెడ్డి, ఎన్‌బి జిల్లా కోఆర్డినేటర్ లక్ష్మి నారాయణ, కృష్ణమూర్తి, జానకమ్మ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## ఎందరో విద్యార్థులను నారాయణ యాదవ్ తీర్చిదిద్దారు

### సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వంగూరు నారాయణ యాదవ్ ఎంతోమంది విద్యార్థినీ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే కాకుండా సమాజంలోని అన్ని వర్గాల ఉద్యోగులకు సేవలు అందించారని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కొనియాడారు.మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దసూరారంలో ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వంగూరు నారాయణ యాదవ్ పదవీ విరమణ కార్యక్రమాన్ని ఆదివారం ఆపాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మామిడి సైదులు అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం నారాయణ యాదవ్‌ను ఘనంగా సత్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఎంతోమంది విద్యార్థినీ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే కాకుండా,యాదవ ఉద్యోగుల సంఘానికి గౌరవాధ్యక్షుడిగా,బీసీ ఉద్యోగుల సంఘం, తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘాలకు అధ్యక్షుడిగా కొనసాగుతూ సమాజంలోని అన్ని వర్గాల ఉద్యోగులకు సేవలందించడం గొప్ప విషయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే.విజయ్ కుమార్,సత్యబాబు,జ్ఞానేశ్వర చారి, రమేష్, వి.యాదగిరి,పద్మ,సర్పంచ్ జానమ్మ కృష్ణయ్య,ఉపసర్పంచ్ అరుణ రామకృష్ణ,బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ,మిర్యాల యాదగిరి,బెల్లి నాగరాజు యాదవ్,చీర పంకజ్ యాదవ్ పాల్గొన్నారు.

## మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల సాధనకు పోరాటం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా నల్లగొండ జిల్లాలోని నూతనంగా నిర్మించిన ఎస్ఎల్‌బీసీ సబ్‌స్టేషన్ ఆవరణలో 1104 యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా మేడే వేడుకలు నిర్వహించారు.ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు టీ.జైపాల్ రెడ్డి,జిల్లా కార్యదర్శి,రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.వెంకటయ్యల ఆధ్వర్యంలో అరుణ పతాకాన్ని ఆవిష్కరించి కార్మికుల హర్షధ్వానాల మధ్య మేడే ఉత్సవాలను జరిపారు.ఈసందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ 1104 యూనియన్ 76 సంవత్సరాల చరిత్రను పూర్తి చేసుకుని ఏ రాజకీయ పార్టీకి అనుబంధం లేకుండా నిరంతరం కార్మికుల సంక్షేమం కోసం పోరాటం చేస్తోందన్నారు. విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుంటూ తెలంగాణ విద్యుత్ శాఖలో మెజారిటీ సంఘంగా కొనసాగడం గర్వకారణమని పేర్కొన్నారు.విద్యుత్ శాఖలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ,సేవా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర నాయకత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు తిరుగుడు శ్రీనివాసులు,డివిజన్ అధ్యక్షుడు పురం రాంబాబు,డివిజన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు డి.సత్యనారాయణ,అదనపు కార్యదర్శి ఆర్.బాలు,సంయుక్త కార్యదర్శి ఎస్.లింగస్వామి,కంపెనీ నాయకులు బి.ముత్తయ్య, జి. రాములు,జిల్లా ఉపాధ్యక్షుడు పి.వెంకటేశ్వర్లు, జి.భీమార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేటలోని మల్లికార్జున ఫంక్షన్ హాల్ లో జరిగిన ఆత్మీయ సన్మానం కార్యక్రమం రామన్నపేట అఖిల భారత యాదవ మహా సభ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబెర్ గా గెలుపొందిన చలకాని వెంకట్ యాదవ్ కి ఆత్మీయ సమ్మేళనం చాలా ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం అఖిల భారత యాదవ మహాసభ, రామన్నపేట కమిటీ అధ్యక్షులు తిరుగుడు మల్లికార్జున్ అధ్యక్షుత వహించిన అనంతరం వారు మాట్లాడుతు యాదవులు అందరు రాజకీయ చైతన్యం కలిగి ఉండాలని అన్నారు. సన్మాన గహిత చలకాని వెంకట్ యాదవ్ మాట్లాడుతూ యాదవులు ఒక ఐక్యత గా ఉంటూ గ్రామాలలో రాజకీయంగా కీలకంగా వ్యవహారించాలని ఎన్నికల సమయంలో ఐక్యత పాటించాలని సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జంగిలి నర్సింహా, దుర్గయ్య, గోగు వెంకటేశ్వర్లు, సింగనబోయిన జంగయ్య, నీల ఐలయ్య, జిల్లా అధ్యక్షులు అయోధ్య పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో పార్టీ సిద్ధాంతాలను మరింత విస్తృతపర్చాలి



**ప్రజాపక్షం/కోదాడ:** బిఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సభ్యత్వ నమోదు నియోజకవర్గ ఇన్‌ఛార్జి తిప్పన విజయసింహారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం బిఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ పార్టీ ప్రజాప్రతినిధుల ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని సూచించారు. దీంతో పాటు సభ్యత్వ నమోదులో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. పార్టీని గ్రామస్థాయి నుండి పట్టణ స్థాయి వరకు మరింత బలోపేతం చేస్తూ యవత మహిళలు, రైతులు, కార్మిక వర్గాన్ని అనుసంధానం చేయడమే సభ్యత్వ నమోదు ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. ఇది సంఖ్య కోసం కాదని ప్రతి నాయకుడు కార్యకర్త తమ పరిధిలో ఆయా వార్డులలోని బూతులలో విస్తృతంగా సభ్యత్వ నమోదు చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ మాట్లాడుతూ ప్రతి నాయకుడు నిబద్ధతతో సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేయాలని సూచించారు. పార్టీ శ్రేణులకు ఐక్యంగా కృషి చేసి నమోదును చేపడితేనే రాష్ట్రంలో నియోజకవర్గం ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

# నల్లగొండ వ్యాప్తంగా విస్తృత నాఖా బందీ





### 1500 మంది పోలీసులతో ప్రత్యేక తనిఖీలు

### 738 వాహనాలపై కేసులు నమోదు

**ప్రజాపక్షం/నల్లగొండ:** జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతాభావం పెంపొందించేందుకు జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు శనివారం రాత్రి విస్తృత నాఖా బందీ నిర్వహించారు.జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టగా జిల్లా ఎస్పి స్వయంగా పలు ప్రాంతాల్లో తనిఖీలను పరిశీలించారు.జిల్లాలోని ప్రధాన రహదారులు, జాతీయ రహదారులు,రద్దీ కూడళ్లు, పట్టణ ప్రాంతాలు మరియు అనుమానాస్పద ప్రాంతాల్లో మొత్తం 47 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి దాదాపు 1500 మంది పోలీసు అధికారులు,సిబ్బందితో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.ద్విచక్ర వాహనాలు, కార్లు,ఆటోలు తదితర వాహనాల పత్రాలను పరిశీలించి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకున్నారు.హెల్మెట్ లేకుండా ప్రయాణించడం,ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్,నంబర్ ప్లేట్లు లేకుండా తిరగడం,సైలెన్సర్లలో మార్పులు చేయడం వంటి ఉల్లంఘనలకు పాల్పడిన మొత్తం 738 వాహనాలపై కేసులు నమోదు చేశారు.అదేవిధంగా రాత్రివేళల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను ప్రశ్నించి వారి వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, జిల్లాలో శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. నేరాల నియంత్రణలో భాగంగా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించి అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలపై వెంటనే సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిఎస్పిలు,సీఐలు, ఎస్ఐలు పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డుపై పారుతున్న మురుగునీరు... డ్రైనేజీ అస్తవ్యస్తం!

### నిద్రమత్తులో అధికార యంత్రాంగం

### తీవ్ర అవస్థలు పడుతున్న ప్రజలు

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** పారిశుద్ధ్యం నిద్రావస్థలో ఉండి పడకేసిందని అక్కడ పరిస్థితి చూస్తే అర్థమవుతుందని అని అక్కడ ప్రజలు అనుకుంటున్నారు. అధికారులు నిద్రమత్తును వదిలి ఈ పరిస్థితిని పరిశీలించాలని ప్రజలు అధికారులను వేడుకుంటున్న సంఘటన మండల పరిధిలోని రేవూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామ పంచాయతీ అధికారులు రేవూరులోని గంగపాలెం అనే కాలనీలో డ్రైనేజీ కాలువ పూడిక తీయకపోవడంతో డ్రైనేజీ స్తంభించిపోయి మురుగునీరు ఎటు పోలేక రోడ్డుపై ప్రవహిస్తుందని దీంతో విపరీతమైన దుర్గంధం వెదజల్లి అక్కడ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అనుకుంటున్నారు. సాయంత్రం అయితే చాలు దోమలు స్వైర్య విహారం చేస్తున్నాయని, దీంతో ప్రజలు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు భయపడుతున్నారు. డ్రైనేజీ కాలువలు ఉన్నప్పటికీ వాటిని సరిగా పూడికలు తీయకపోవడం వల్ల నీరు స్తంభించిపోయిందని అంటున్నారు. దీంతో ప్రజలు డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల బారిన పడి ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు. అనారోగ్యంతో సతమతమవుతూ ఆసుపత్రి చుట్టూ తిరుగుతూ నానా తంటాలు పడుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**జ్వరాల పంజా...**

రేవూరులోని ఆ వాడలో ప్రజలు మొత్తం రోగాల బారీన పడి జ్వరాల పంజా విసరకముందే సమస్యను సత్వరం పరిష్కరించాలని ప్రజలు వేడుకుంటున్నారు. వేసవికాలంలో కూడా మురుగునీరు స్తంభించి రోడ్లపై నిలవడంతో దోమలు పెరిగి జ్వరాలు వచ్చి పంజా విసురుతుందన్నారు.

**సంబంధిత అధికారులు స్పందించాలి**

డ్రైనేజీ కాలువలో చెత్త చెదారంతో ప్లాస్టిక్ వ్యర్ధాలతో నిండి ఉండటంతో నీరు పారుదలకు అడ్డంగా ఉండి అక్కడే నిలిచిపోయి దోమల వ్యాప్తి విపరీతంగా పెరుగుతుందని సమీపంలోని ప్రజలు అనుకుంటున్నారు. దీంతో ప్రజలు జ్వరాల బారీన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీలను ఎప్పటికప్పుడు పూడికలు తీయించి కాలువలు సజావుగా పారేలా చూడాలని కాలువలో నీరు నిల్వ ఉం డకుండా చూడాలని నీరు నిలబడి ఉండే చోట కాలువలపై దోమల లార్వాను చంపడానికి బ్లీచింగ్ వెదజల్లాలని ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు.



## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఎస్‌పి నితికా పంత్



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 1న కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ యాక్ట్30 అమలులో ఉన్నట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సజావుగా, ప్రశాంతంగా జరిగేలా జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చడం, ప్రజా శాంతికి భంగం కలిగించే చర్యలకు పాల్పడడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. పోలీస్ యాక్ట్30 నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి శాంతియుత వాతావరణం నెలకొనేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె కోరారు. ఈ పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని తెలిపారు.

## ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా సింగరేణిలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను శ్రీరాంపూర్ ఏరియా నుంచి ఇద్దరు ఉద్యోగులు ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికయ్యారు. ఏరియా స్థాయిలో ఉత్తమ ఉద్యోగిగా ఆర్‌కే7 భూగర్భ గనిలో సీనియర్ అండర్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం. శశాంక్ ఎంపిక కాగా, కంపెనీ స్థాయిలో ఉత్తమ ఉద్యోగిగా ఎస్ఆర్‌పీ3 గనిలో హెడ్ ఓవర్మెన్‌గా పనిచేస్తున్న బోగె మోహన్ దాస్ ఎంపికయ్యారు. మంగళవారం శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ఏరియా స్థాయి ఉత్తమ ఉద్యోగి ఎం. శశాంక్‌ను శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ సత్కరించనున్నారు. కంపెనీ స్థాయి ఉత్తమ ఉద్యోగిగా ఎంపికైన బోగె మోహన్ దాస్‌కు కొత్తగూడెంలో జరిగే రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో సింగరేణి సిఎండి చేతుల మీదుగా సత్కారం అందజేయనున్నారు. ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన ఇద్దరు ఉద్యోగులకు ఆయా గనుల అధికారులు, ఏరియా అధికారులు, సహోద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## ఉద్యమ స్ఫూర్తితో పనిచేయాలి



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** భారతీయ మజ్దూర్ సంఘ్ కార్యకర్తలు ఉద్యమ స్ఫూర్తితో కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, వచ్చేనెల 7న భూపాలపల్లిలో జరిగే 29వ ద్వైవార్షిక మహాసభలను విజయవంతం చేయాలని ఎబికెఎంఎస్ బిఎంఎస్ జాతీయ కార్యవర్గ సభ్యులు మంద రమాకాంత్ పిలుపునిచ్చారు. నస్పూర్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన బిఎంఎస్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి సింగరేణికి రావలసిన రూ. 51,149 వేలకోట్ల విద్యుత్తు బొగ్గు బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఆదాయపన్ను రియాంబర్స్మెంట్ చెల్లించాలని, 12వ వేజ్ బోర్డు కొరకు కోల్ ఇండియా యాజమాన్యం వెంటనే కమిటీ నోటిఫికేషన్ జారీ చేయాలని కోరారు. సింగరేణిలో రాజకీయ జోక్యం నిర్మూలనకు, నూతన గనుల ప్రారంభానికి, కార్పొరేట్ మెడికల్ బోర్డు పునరుద్ధరణకు మహాసభల్లో కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. అధ్యక్షులు యాదగిరి సత్తయ్య 2026–28 ఆర్థిక సంవత్సరానికి నూతన కమిటీని ప్రకటించారు. ఏరియా ఉపాధ్యక్షులుగా నాతాడి శ్రీధర్ రెడ్డి, కార్యదర్శిగా రాజారామ్ కిరణ్, కోశాధికారిగా బొమ్మకంటి కిషన్, జాయింట్ సెక్రటరీలుగా మంద కమలాకర్, జెట్ల తిరుపతి, ఏ రాజ్ కుమార్, దుంపల శ్రీధర్, అప్పల బీరయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా చల్ల ప్రశాంత్, మీసా దీపక్, మిట్ట మధుకర్, కనవేన సాగర్, ఐలి శ్రీనివాస్, ఆఫీస్ సెక్రటరీగా బుర్ర అరుణ్ గౌడ్ ఎన్నికయ్యారు. చెట్టి వీరన్న, బొంపల్లి రమేష్, కొమ్మ బాపు, రాజు, రాజేశం, ప్రభాకర్, సురేష్, తిరుపతి, స్వామి, మొగిలి పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల కాంగ్రెస్‌కే సాధ్యం



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇల్లు లేని పేదవారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేషారెడ్డి తెలిపారు. ఆదివారం రాంపూర్ గ్రామంలో దూదేకుల రహీం బేగం జాంగిర్ ల, ఇందిరమ్మ ఇల్లు సర్పంచ్ గోపాల్ రెడ్డి తో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఆయన మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇల్లు కట్టుకున్న పేదవారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఐదు లక్షల రూపాయలు లబ్ధిదారులు అకౌంట్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. పేదల సొంతింటి కల నెరవేరుస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిలు, సంజీవరెడ్డి, రఘురాం రెడ్డి, శ్రీనివాస్, కొండల్ రెడ్డి, జైపాల్, బేతయ్య శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బాసర ట్రిపుల్ ఐటికి

## ఇద్దరు విద్యార్థుల ఎంపిక

కూచన్‌పల్లి పిఎంశ్రీ పాఠశాలకు గర్వకారణం




**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండల పరిధిలోని కూచన్‌పల్లి పీఎంశ్రీ ఉన్న పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీ( ఆర్జీయూకేటీ)లో సీట్లు సాధించి ఎంపికయ్యారు.ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు రవితేజ, దివ్యలు 2026 విద్యా సంవత్సరానికి సంబంధించి తాజాగా విడుదలైన ఎంపిక జాబితాలో చోటు దక్కించుకుని బాసర ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి అర్హత సాధించారు. హవేలీ ఘనపూర్ మండల విద్యాధికారి (ఎంఈఓ)తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాచారం మధుమోహన్ విద్యార్థులను అభినందించారు. నిరంతరం కష్టపడి ఈ విజయాన్ని సాధించారని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఉన్నత విద్యను అభ్యసించి సాంకేతిక రంగంలో రాణిస్తూ జిల్లా, రాష్ట్రాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థు ల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని కూడా ఆయన అభినందించారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు శివరాజ్ తో పాటు సందీప్ కృష్ణ, మల్లారెడ్డి, పంతంగి శ్రీనివాస్, కొండల్‌రెడ్డి, తదితర ఉపాధ్యాయులు విద్యార్థుల విజయంపై ఆనందం వ్యక్తం చేశారు. అలాగే తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన రవితేజ, దివ్యలను అభినందిస్తూ వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.

## సీఎం పర్యటనకు

# పకడ్బందీగా ఏర్పాట్లు



కలెక్టర్ హరిత

**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. ఆదివారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సీఎం పర్యటన ఏర్పాట్లపై ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 1న కెరమెరి మండలం కొఠారి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తగుడ గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.గిరిజనులతో, గ్రామ పటేళ్లతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. సీఎం పర్యటనకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర వైద్య సేవలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాగజ్ నగర్ ఎక్స్ రోడ్డు వద్ద నిర్వహించే బహిరంగ సభకు వచ్చే ప్రజల కోసం పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. హెలిప్యాట్ వద్ద, బహిరంగ సభ ప్రాంతంలో రహదారులు భవనాల శాఖ అధికారులు భారీ బారికేడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## సీఎం పర్యటన.. ట్రాఫిక్ మళ్లింపు




**ప్రజాపక్షం / రెబ్బన :** ముఖ్యమంత్రి సోమవారం పర్యటించనున్న నేపథ్యం లో కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, వాహనదారులు పోలీసులకు సహకరించి ట్రాఫిక్, పార్కింగ్ నిబంధనలు తప్పకుండా పాటించాలని కోరారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్ వద్ద సర్వీస్ రోడ్డుపై ట్రాఫిక్ నియంత్రణ అమలులో ఉంటుందని, భారీ వాహనాలను అనుమతించబోమని పేర్కొన్నారు. కాగజ్‌నగర్ వైపు నుంచి ఎక్స్ రోడ్డుకు వచ్చే వాహనాలకు, ఎక్స్ రోడ్ నుంచి కాగజ్‌నగర్ వైపు వెళ్లే భారీ వాహనాలకు సీఎం మీటింగ్ ముగిసే వరకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి కెరమెరి నుంచి ఆసిఫాబాద్ వైపు, ఆసిఫాబాద్ నుంచి కెరమెరి వైపు భారీ వాహనాలను అనుమతించరని తెలిపారు. సీఎం పర్యటన ముగిసేవరకు రోడ్లపై ఎలాంటి వాహనాలు నిలపరాదని, పశువులను రోడ్లపైకి అనుమతించవద్దని ఎస్పీ సూచించారు.

## ఉద్యోగుల జీతాల నుంచి..

## ఇహెచ్ఎస్ కోతలపై ఆగ్రహం

మెదక్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్

**ప్రజాపక్షం/మెదక్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల జీతాల నుంచి ఎంప్లాయి హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) పేరుతో 1.5 శాతం మొత్తాన్ని ముందస్తు సమాచారం, స్పష్టమైన ఉత్తర్వులు లేకుండానే కే నెల వేతనాల నుంచి మినహాయించడం సరికాదని ఆదివారం ఎస్టియూ మెదక్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్ విమర్శించారు.ఉద్యోగ సంఘాలతో ఎలాంటి చర్చలు జరపకుండా, విధి విధానాలను వెల్లడించకుండా వేతనాల నుంచి కోతలు విధించడం ఉద్యోగుల్లో ఆందోళనకు గురి చేస్తోందన్నారు. ముఖ్యంగా భార్యాభర్తలు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే ఒకరి జీతం నుంచే మినహాయింపు ఉంటుందని ముందుగా చెప్పి, ప్రస్తుతం ఇద్దరి జీతాల నుంచీ కోతలు విధించడం అన్యాయమని పేర్కొన్నారు. అలాగే భార్య లేదా భర్తల్లో ఒకరు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగి కాగా, వారికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం క్యాష్‌లెస్ వైద్య సదుపాయాలు కల్పిస్తున్నప్పటికీ, వారిపై కూడా ఈ హెచ్ ఎస్ కోతలు విధించడం సమంజసం కాదన్నారు. ఇలాంటి అంశాలపై స్పష్టత లేకుండా ఉద్యోగుల వేతనాల్లో కోతలు విధించడం వల్ల అనేక సందేహాలు తలెత్తుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి, ఈహెచ్ఎస్ అమలుకు సంబంధించిన పూర్తి విధి విధానాలను ప్రకటించిన తర్వాతే వేతనాల నుంచి మినహాయింపులు చేపట్టాలని రాజగోపాల్ గౌడ్ డిమాండ్ చేశారు.

## ఎన్నికలొద్దు, విలీనం ముద్దు

నిర్మల్ డిపో ఎదుట ఆర్టీసీ జెఏసి ఆధ్వర్యంలో కార్మికుల ఉధృతి నిరసన



**ప్రజాపక్షం / నిర్మల్ రూరల్ :** ఆర్టీసి కార్మికుల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించి, సంస్థను ప్రభుత్వంలో తక్షణమే విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ జిల్లా కేంద్రంలో నిరసన జ్వాలలు మిన్నంటాయి. ఎన్నికలు వద్దు విలీనం ముద్దు అనే నినాదంతో ఆర్టీసి జేఏసీ పిలుపు మేరకు నిర్మల్ ఆర్టీసి డిపో ఎదుట నాయకులు, కార్మికులు భారీ ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రభుత్వ కాలయాపన ధోరణిని నిరసిస్తూ కార్మికులంతా ఎర్ర బ్యాడ్జీలు ధరించి, డిపో పరిసరాల్లో తమ నిరసన స్వరాన్ని వినిపించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జెఏసి ముఖ్య నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలోనూ, అంతకుముందు ఇచ్చిన హామీల్లోనూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని నమ్మబలికిన పాలకులు, ఇప్పుడు మాట మారుస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు ముగిసిన తర్వాతే విలీన ప్రక్రియను చేపడతామని అనడం యావత్ ఆర్టీసి కార్మిక లోకాన్ని తీవ్ర నిరాశకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు రాత్రింబవళ్ళు కష్టపడి పనిచేస్తున్న కార్మికుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది కుటుంబాల భవిష్యత్తుతో ముడిపి ఉన్న ఈ అంశాన్ని ఎన్నికల సాకుతో వాయిదా వేయడం సరికాదని జేఏసి ప్రతినిధులు స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జూన్ 2వ తేదీన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కానుకగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు అధికారికంగా జీవో విడుదల చేయాలని గట్టిగా డిమాండ్ చేశారు. జూన్2వ తేదీ లోపు ప్రభుత్వం నుండి ఏలాంటి సానుకూల ప్రకటన రాకపోయినా, విలీనంపై నిర్లక్ష్యంగా వ్యవహరించినా, నిర్మల్ డిపో సాక్షిగా రాష్ట్ర వ్యాప్తంగా మరో చారిత్రాత్మక ఉధృత ఉద్యమానికి తాము సిద్ధంగా ఉన్నామని, దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో నిర్మల్ డిపోకు చెందిన వివిధ విభాల కార్మికులు, ప్యాసింజర్ సర్వీస్ సిబ్బంది, కార్మిక సంఘాల ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# నేటి నుండి జిల్లా వ్యాప్తంగా '30 పోలీస్ యాక్ట్'

ముందస్తు అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు, ధర్నాలు నిషేదం



**ప్రజాపక్షం / నిర్మల్ :** నిర్మల్ జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతలను కాపాడటంతో పాటు ప్రజల జీవన విధానానికి ఏలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణాన్ని పెంపొందించేందుకు జిల్లా పోలీస్ శాఖ గట్టి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సోమవారం నుండి జూన్ 30,2026 వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డా.జి.జానకీ షర్మిల ఐపిఎస్ ఒక ప్రకటనలో అధికారికంగా వెల్లడించారు. జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా ఐఏఎస్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఈ ఆంక్షలు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ కఠినంగా వర్తిస్తాయని ఆమె స్పష్టం చేశారు. ఈ చట్టం అమలులోకి వచ్చిన నేపథ్యంలో జిల్లాలో ఏలాంటి బహిరంగ కార్యక్రమాలు నిర్వహించాలన్నా నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా సంబంధిత పోలీస్ ఉన్నతాధికారుల నుండి ముందస్తు రాతపూర్వక అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు, ర్యాలీలు రాస్తారోకోలు, ధర్నాలు మరియు నిరసన ప్రదర్శనలు జరపరాదని ఎస్పీ భక్తులకు, సంఘాల నాయకులకు స్పష్టం చేశారు. సాధారణ ప్రజానికానికి ఇబ్బంది లేదా చిరాకు కలిగించే విధంగా జన సమూహాలు పోగుకావడం, రహదారులను దిగ్బందించడం వంటి పనులపై పూర్తి నిషేదం ఉంటుందని పేర్కొన్నారు.

### ఆయుధాల ప్రదర్శన..

### డిజెలపై ఆంక్షలు

శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించే వారిపై నిఘా ఉంచామని, నిరసనలు లేదా సభల సాకుతో నిషేధిత ఆయుధాలైన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు లేదా నేరానికి పురిగొల్పే ఎటువంటి ఆయుదాలనైనా ధరించి సంచరించడం చట్టవిరుద్ధమని ఎస్పీ హెచ్చరించారు. అలాగే, ఘర్షణలకు దారితీసే విధంగా ఎక్కడికక్కడ రాళ్ళను జమ చేయడం, ప్రజలకు శబ్ద కాలుష్యం కలిగించేలా లౌడ్‌స్పీకర్లు మరియు డీజే సౌండ్ సిస్టం ఏర్పాటు చేయడంపై కూడా ఈ సమయంలోపూర్తి నిషేదం విధించినట్లు తెలిపారు. నిర్మల్ పోలీస్ మీ పోలీస్ అనే నినాదంతో జిల్లాలోని ప్రతి ఒక్క పౌరుడి రక్షణే ధ్యేయంగా తాము పనిచేస్తున్నామని ఈ నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే 30 పోలీస్ యాక్ట్ 1861 కింద కఠినమైన సెక్షన్ల ప్రకారం చట్టపరమైన శిక్షార్హులు అవుతారని ఎస్పీస్పష్టం చేశారు. జిల్లాలో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు కలగకుండా ప్రశాంతతను కాపాడేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల శ్రేణులు మరియు స్వచ్ఛంద సంస్థల నాయకులు పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆమె ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## పోతంగల్‌లో విషాదచాయలు



**ప్రజాపక్షం/కోటగిరి :** పోతంగల్‌కు చెందిన కుర్మ గంగొండ ఆదివారం తన గొర్రెలను తీసుకుని కొడుకు సంతోష్, రెంజల్ మండలం బోర్గాంకి చెందిన చిక్క గంగారాంతో మంజీరా నదిలోకి గొర్రెలను కడగడానికి ఆదివారం తీసుకెళ్లారు. కాలు జారి నదిలో పడగా అతనిని కాపాడటానికి గంగొండ దిగగా ఇద్దరూ నీటిలో మునిగి చనిపోయారని ఎస్ఐ సునీల్ తెలిపారు. భార్యరుక్మిణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్బావ దినోత్సవ వేడుకలకు మంత్రి వివేక్

**ప్రజాపక్షం/మెదక్ :** జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మెదక్ జిల్లాలో నిర్వహించే అధికారిక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మంత్రి భూగర్భ శాస్త్ర మంత్రిత్వ శాఖల మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం అతిథులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుండగా జిల్లాలో జరిగే ప్రధాన కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు.

## పట్టణాభివృద్ధికి కౌన్సిలర్లు కృషి

**ప్రజాపక్షం/బోధన్:** నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణ అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు కృషి చేయాలని సిపిఐ నాయకులు కోరారు. ఆదివారం బోధన్ పట్టణంలోని ఒకటో వార్డు ఆటో నగర్‌లో సిపిఐ సీనియర్ నాయకులు నాగళ్ల హనుమంతరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఐ నాయకులు మాట్లాడారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ పట్టణ కార్యదర్శి రాధాకృష్ణన్ మాట్లాడారు. బోధన్ పట్టణంలోని మురికి వాడల అభివృద్ధి కోసం కౌన్సిలర్లు కృషి చేయాలన్నారు.

# జనగణన హెచ్ఎల్ఓ లోపాలు సవరించాలి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్:** జనగణన హెచ్ఎల్ఓ డేటాలోని లోపాలను సవరించాలని, నిర్దేశిత గడువులోగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి సంబంధిత జిల్లా, మండల, మున్సిపల్ అధికారులతో ఆయన గూగుల్ మీట్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.జనాభా గణనకు సంబంధించిన హెచ్.ఎల్.ఓ డేటాలో ఉన్న లోపాలను క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా తక్షణమే సరిచేయాలన్నారు. మాస్టర్ ట్రైనర్లు, సూపర్వైజర్లు, చార్జ్ అధికారులు, వార్డు అధికారులు సమన్వయంతో వ్యవహరించి తప్పుల్లేని డేటాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, మహా గృహప్రవేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ వర్చువల్ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి స్రవంతి, జెడ్పీ సీఈఓ రవి, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, హౌసింగ్ పీడీ శంకర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్, ఎంపీడీఓలు, చార్జ్ అధికారులు పాల్గొన్నారు.

# మహారాష్ట్ర టూ భైంసా వయా నిర్మల్ – ఖానాపూర్

నకిలీ విత్తనాల 'గండం' వ్యవసాయ అధికారుల మామూళ్ళ' నిర్లక్ష్యమే అన్నదాతకు శాపమా ?



**ప్రజాపక్షం / నిర్మల్ :** మృగశిర కార్తె ముంచుకొస్తుడటం , రోహిణి కార్తె ముగింపు దశకు చేరడంతోనిర్మల్ జిల్లా వ్యాప్తంగా రైతాంగం ఖరీఫ్ సాగు పనుల్లో నిమగ్నమైంది. అయితే, అన్నదాతల అత్రుతను ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాల అంతరాష్ట్ర ముఠాలు జిల్లాలో యథేచ్చగా కోరలు చాస్తున్నాయి. ముఖ్యంగా నిర్మల్ జిల్లాలోని భైంసా, నిర్మల్ టౌన్, ఖానాపూర్ ప్రాంతాలలో నకిలీ విత్తనాల విక్రయాలు అత్యధికంగా సాగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఏజెన్నీ ప్రాంతాల్లోని అమాయక గిరిజన రైతులను ఆసరా చేసుకుని, గరిష్ట లాభాల కోసం నకిలీ పత్తి, అంటగడుతూ వారిని నిలువునా ముంచుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

### భైంసా కేంద్రంగా నెట్‌వర్క్..

### మహారాష్ట్ర నుండి భారీగా సరఫరా

పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుండి ఈ నకిలీ విత్తనాలు జిల్లాలోకి యథేచ్ఛగా రవాణా అవుతున్నట్టు తెలుస్తోంది. మహారాష్ట్ర సరిహద్దుకు ఆనుకుని ఉన్న భైంసా పట్టణాన్ని ఈ ముఠాలు తమ ప్రధాన సరఫరా కేంద్రంగా (హబ్) మార్చుకున్నాయి. అక్కడి నుండి రాత్రి వేళల్లో ప్రైవేట్ వాహనాల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్మల్ రూరల్ ప్రాంతాలతో పాటు, గిరిజన తండాలు మరియు ఏజెన్సీ గ్రామాలు ఎక్కువగా ఉండే ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలోకి ఈ నకిలీ నిల్వలను సప్లై చేస్తున్నారనే ప్రచారం క్షేత్రస్థాయిలో బలంగా సాగుతోంది. ప్రభుత్వ నిషేదిత, ప్రమాదకరమైన బీటి3 పత్తి విత్తనాలను ఆకర్షణీయమైన ప్యాకెట్లలో ప్యాక్‌చేసి, బ్రాండెడ్ కంపెనీల పేర్లతో రైతులకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

### అధికారుల నిర్లక్ష్యం,

### 'మామూళ్ళ' మత్తుపై

### తీవ్ర విమర్శలు

జిల్లాలో ఇంత బహిరంగంగా నకిలీ విత్తనాల అక్రమ రవాణా, విక్రయాలు సాగుతున్నా క్షేత్రస్థాయిలో ఉన్న వ్యవసాయ అధికారులు కనీసం పట్టించుకోకపోవడంపై రైతాంగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్లే ఈ నకిలీల దందా యథేచ్ఛగా సాగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని ఫర్టిలైజర్, సీడ్స్ దుకాణాల నిర్వాహకుల నుండి కొందరు అధికారులు ముందస్తుగానే మామూళ్ళకు కక్కుర్తి పడుతున్నారనే బలమైన ఆరోపణలు ఉన్నాయి. ఏటా సీజన్ ప్రారంభానికి ముందే సదరు డీలర్ల నుండి అధికారులకు అందాల్సిన వాటాలు (కమీషన్లు) క్రమం తప్పకుండా అందుతాయని, అందుకే ఈ అక్రమ వ్యాపారాన్ని చూసి చూడనట్లు వదిలేస్తున్నారని పలువురు రైతులు బహిరంగంగానే వాపోతున్నారు. అధికారుల మత్తు నకిలీ ముఠాలకు రక్షణ కవచంగా మారిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అప్పుల ఊబిలోకి గిరిజన కుటుంబాలు

ఖానాపూర్ ఏజెన్సీ పరిధిలోని పోడు భూములు మరియు మెట్ట ప్రాంతాల్లో వ్యవసాయ చేసే గిరిజన రైతులకు ఈ నకిలీ విత్తనాలు, అధికారుల ఉదాసినత శాపంగా మారుతున్నాయి. పెట్టుబడి తక్కువ అవుతుందనో, లేదా దళారుల మాయమాటలు నమ్మో కొనుగోలు చేస్తున్న వీరు, తీరా పంట చేతికి వచ్చేసరికి విత్తనాలు మొలకెత్తక, ఒకవేళ మొలకెత్తినా, పూత, కాపు రాక ది క్కుతోచని స్థితిలోకి నెట్టబడుతున్నారు. ఎకరాకు వేలాది రూపాయలు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి పంట దక్కక అప్పుల పాలై కన్నీరు మున్నీరవుతున్నారు.

### సరిహద్దుల్లో టాస్క్‌ఫోర్స్ నిఘా పెంచాలి

ఇప్పటికే జిల్లా ఎస్పీ డా.జి.జానకీ షర్మిల ఐపిఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ నాకాబంధీలు , లాడ్జీల తనిఖీలు మరియు ఆకస్మిక సోదాలు ము మ్మరం చేసినప్పటికీ, ఈ అంతరాష్ట్ర ముఠాలు లోకల్ ఏజెంట్ల సహాయంతో అంతర్గత రహదారుల ద్వారా విత్తనాలను రవాణా చేస్తున్నట్లు సమాచారం, వ్యవసాయ శాఖలోని అవినీతి అధికారుల తీరును పక్కనబెట్టి, పోలీస్ మరియు రెవెన్యూ విభాగాలతో కూడిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు భైంసా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద, అలాగే ఖానాపూర్ ఏజెన్సీ లోపలికి వెళ్ళే మార్గాలపై నిరంతర నిఘా ఉంచాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. నిర్మల్ పోలీస్ మీ పోలీస్ నినాదంతోఅక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతున్న అధికారులు, నకిలీ విత్తనాలు విక్రయించే డీలర్లపై, దళారులపై పిడి యాక్ట్ కింద కఠిన కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రైతులు కూడా గుర్తింపు పొందిన డీలర్ల వద్దే విత్తనాలు కొని, తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు తండాల్లో విత్తనాలు అమ్మడానికి వస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

